

పేలుడు పదార్థాల కేసు.. రెండో నిందితుడిపై ఎన్ఐఏ ఛార్జ్‌షీట్ దాఖలు..


# సూర్య

జాతీయ తెలుగు దినపత్రిక

తెలుగు




ఐటీ స్టాక్స్‌లో కలకలం..!!


CIRCLEATED IN KURNOOL HYDERABAD AMARAVATHI, TIRUPATI, SPSR NELLORE PRAKASHAM, YSR KADAPA, PRAKASAM,ANANTAPUR ,VIJAYAWADAGUNTUR ,VISAKHAPATNAM,EASTGODAVARI, | ఎడిటర్ : యస్.మహేశ్వరరెడ్డి | శనివారం 20 జూన్, 2026 | సంపుటి : 05 / సంచిక : 137/ పేజీలు : 12 / వెల : రూ.5/-




## పల్నాడు జిల్లాలో పర్యటించనున్న...
# సీఎం చంద్రబాబు

- ఆ గ్రామంలో స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏపీ సీఎం సందర్శిస్తారు
- ఆ తర్వాత రైతులతో ఆయన ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారు
- రైతుల సమస్యలు, వ్యవసాయ పరిస్థితులపై వారితో చర్చిస్తారు

2

## సీఎం చంద్రబాబు అధ్యక్షతన 235వ
# ఎస్ఎల్‌బీసీ సమావేశం..

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (SLBC) సమావేశం జరిగింది. ఏపీ సచివాలయంలోని 5వ బ్లాక్‌లో ఈరోజు (శుక్రవారం) మధ్యాహ్నం 235వ బ్యాంకర్ల సమావేశాన్ని నిర్వహించారు.





## సమర్థ నాయకుడు ఉంటే ఏదైనా
# సాధ్యమే..!!

- ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు కొదవేమీ లేదు
- విరివిగా పరిశ్రమలు వస్తే ఉపాధి అవకాశాలు మరింతగా పెరుగుతాయి
- సమర్థ నాయకుడు ఉంటే ఏదైనా సాధ్యమని ప్రధాని మోదీ నిరూపిస్తున్నారన్నారు
- ఏపీ మంత్రి నారా లోకేశ్

కోల్‌కతా పర్యటనలో భాగంగా ఏపీ మంత్రి నారా లోకేశ్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్లీనరీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. ఏపీలో పెట్టుబడులకు అవకాశాలు అంశంపై మంత్రి ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు కొదవేమీ లేదన్నారు. విరివిగా పరిశ్రమలు వస్తే ఉపాధి అవకాశాలు మరింతగా పెరుగుతాయన్నారు. సమర్థ నాయకుడు ఉంటే ఏదైనా సాధ్యమని ప్రధాని మోదీ నిరూపిస్తున్నారన్నారు.

## తన కుమారుడి అదృశ్యంపై విచారణ జరిపి...
# న్యాయం చేయాలి..!!

సీఎం చంద్రబాబును కలిసిన సాయికృష్ణ కుటుంబసభ్యులు

- ఈ ఘటనపై నిష్పక్షపాతంగా ఉన్నతస్థాయి దర్యాప్తు చేయిస్తున్నాం
- ఇప్పటికే సీఐని సస్పెండ్ చేసి దర్యాప్తును వేగవంతం చేశాం
- సమగ్ర విచారణ జరిపి నిందితులకు శిక్ష పడేలా చేస్తాం
- తప్పుచేసింది ఎంతటివారైనా ఉపేక్షించబోం..
- కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా
- న్యాయం చేస్తామని సీఎం హామీ ఇవ్వడంపై విజయలక్ష్మి సంతృప్తి వ్యక్తం
- న్యాయం జరుగుతుందనే నమ్మకం వచ్చింది: సాయికృష్ణ మేనమామ
- "సాయికృష్ణ తల్లి బాధను సీఎం చంద్రబాబు అర్థం చేసుకున్నారు
- మాలాంటి సామాన్యులకు న్యాయం జరగదని భావించాం...
- కానీ.. చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో
- న్యాయం జరుగుతుందనే నమ్మకం వచ్చింది...
- రాజకీయంగా మాకు ఎవరిపైనా ద్వేషం లేదు...
- న్యాయం చేయాలని మాత్రమే సీఎంను కోరాం...



**అమరావతి:** విజయవాడలోని కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి, కుటుంబసభ్యులు సీఎం చంద్రబాబును కలిశారు. తన కుమారుడి అదృశ్యంపై విచారణ జరిపి న్యాయం చేయాలని విజయలక్ష్మి కోరారు. ఈ సందర్భంగా ఆమెకు సీఎం ధైర్యం చెప్పారు. ఈ ఘటనపై నిష్పక్షపాతంగా ఉన్నతస్థాయి దర్యాప్తు చేయిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే సీఐని సస్పెండ్ చేసి దర్యాప్తును వేగవంతం చేశామన్నారు. సమగ్ర విచారణ జరిపి నిందితులకు శిక్ష పడేలా చేస్తామని చెప్పారు. తప్పుచేసింది ఎంతటివారైనా ఉపేక్షించబోమన్నారు. కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. న్యాయం చేస్తామని సీఎం హామీ ఇవ్వడంపై విజయలక్ష్మి సంతృప్తి వ్యక్తం చేశారు.

**న్యాయం జరుగుతుందనే నమ్మకం వచ్చింది:**

**సాయికృష్ణ మేనమామ**

తమకు జరిగిన అన్యాయాన్ని సీఎం చంద్రబాబుకు చెప్పామని సాయికృష్ణ మేనమామ ముళ్లపూడి నవరంగ్ తెలిపారు. కుటుంబసభ్యులతో సీఎంను కలిసిన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. "సాయికృష్ణ తల్లి బాధను సీఎం చంద్రబాబు అర్థం చేసుకున్నారు. బాధ్యులైన అధికారులను శిక్షిస్తామని ఆయన చెప్పారు. మాలాంటి సామాన్యులకు న్యాయం జరగదని భావించాం. కానీ.. చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో న్యాయం జరుగుతుందనే నమ్మకం వచ్చింది. రాజకీయంగా మాకు ఎవరిపైనా ద్వేషం లేదు. న్యాయం చేయాలని మాత్రమే సీఎంను కోరాం. ఇలాంటి అన్యాయం మరో మనిషికి జరగకూడదు" అని నవరంగ్ అన్నారు.

## విధ్వంసమైన విద్యాశాఖను వికాసం వైపు...
# నడిపిస్తున్నాం..!!

విద్యార్థులు ఆత్మగౌరవంతో పాఠశాలకు వెళ్లేందుకు ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యపై నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని చెప్పారు. నగరంలోని ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీని గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కలిసి సీఎం ప్రారంభించారు.

- విద్యార్థులు ఆత్మగౌరవంతో పాఠశాలకు వెళ్లేందుకు ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేస్తున్నాం
- విద్యపై నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నాం
- గురుకుల పాఠశాల విద్యార్థులకు 22 వస్తువులతో కిట్లు అందించారు
- వసతి గృహ విద్యార్థులకు 10, పాఠశాల విద్యార్థులకు 7 వస్తువులతో పంపిణీ
- "తెలంగాణ భాషా ప్రయుక్తరాష్ట్రంగానో, పాలనా సౌలభ్యం కోసమో ఏర్పడింది
- 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, విద్యార్థుల ఆత్మ బలిదానాలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైంది
- దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉంది.. వాటిని పునరుద్ధరించాలి...
- తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ రూపొందించి ప్రక్షాళన చేపట్టాం....
- విధ్వంసమైన విద్యాశాఖను వికాసం వైపు నడిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం రూ.26,600 కోట్లు ఖర్చు చేస్తున్నాం
- ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో నో అడ్మిషన్ బోర్డు పెట్టారు
- ప్రభుత్వ స్కూళ్లలో ఇలా బోర్డు పెట్టే పరిస్థితి వస్తుందని ఎవరూ ఊహించి ఉండరు
- ప్రతినెలా ఒకటో తేదీన విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తాం : సీఎం రేవంత్‌రెడ్డి

2లో



**హైదరాబాద్:** గురుకుల పాఠశాల విద్యార్థులకు 22 వస్తువులతో కిట్లు అందించారు. వసతి గృహ విద్యార్థులకు 10, పాఠశాల విద్యార్థులకు 7 వస్తువులతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "తెలంగాణ భాషా ప్రయుక్తరాష్ట్రంగానో, పాలనా సౌలభ్యం కోసమో ఏర్పడింది కాదు. 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, విద్యార్థుల ఆత్మ బలిదానాలతో ప్రత్యేక




## నీట్ రీ-టెస్టు పేపర్ లీక్ ప్రచారం
# నిజం కాదు: కేంద్రం

- ...దీనిపై పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టతనిచ్చింది
- ఎలాంటి లీక్ జరగలేదని.. ఈ పరీక్ష షెడ్యూల్ ప్రకారమే జరుగుతుంది
- పరీక్షకు ముందు ఏ వ్యక్తి, సంస్థకు ప్రశ్నపత్రాలు దక్కే అవకాశం లేదంది
- పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు
- ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం ఆ వీడియో నకిలీదిగా తేల్చింది


2

జూన్ 21న జరగనున్న నీట్-యూజీ రీ-ఎగ్జామ్ ప్రశ్నపత్రం లీకైనట్లు ఓ వీడియో సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతోంది. దీనిపై పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టతనిచ్చింది. ఎలాంటి లీక్ జరగలేదని.. ఈ పరీక్ష షెడ్యూల్ ప్రకారమే జరుగుతుందని పేర్కొంది. పరీక్షకు ముందు ఏ వ్యక్తి, సంస్థకు ప్రశ్నపత్రాలు దక్కే అవకాశం లేదంది. నీట్ రీ-ఎగ్జామ్ ప్రశ్నపత్రం లీక్ అయినట్టుగా కొందరు నకిలీ వార్తలను ప్రచారం చేస్తున్నారని, అలాంటి వాటిని నమ్మొద్దని విద్యార్థులు, తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేసింది. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి ఏవైనా

# పల్నాడు జిల్లాలో పర్యటించనున్న సీఎం చంద్రబాబు

**ఆ గ్రామంలో స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏపీ సీఎం సందర్శిస్తారు...ఆ తర్వాత రైతులతో ఆయన ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారు...రైతుల సమస్యలు, వ్యవసాయ పరిస్థితులపై వారితో చర్చిస్తారు**

**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం పల్నాడు జిల్లాలో పర్యటించనున్నారు. రాజధాని అమరావతి నుంచి మధ్యాహ్నం చిలకలూరిపేట మండలం లింగంగుంట్లకు ఆయన హెలికాప్టర్‌లో చేరుకుంటారు.**



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం (జూన్ 20వ తేదీ) పల్నాడు జిల్లాలో పర్యటించనున్నారు. శనివారం ఉదయం 9.00 గంటలకు ఉండవల్లి గుహల వద్ద మీడియా సమావేశంలో ఆయన మాట్లాడనున్నారు. అనంతరం హెలికాప్టర్‌లో చిలకలూరిపేట మండలం లింగంగుంట్లకు ఆయన చేరుకుంటారు. ఆ గ్రామంలో స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏపీ సీఎం సందర్శి స్తారు. ఆ కేంద్రం పనితీరును పరిశీలిస్తారు. ఆ తర్వాత రైతులతో ఆయన ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలు, వ్యవసాయ పరిస్థితులపై వారితో చర్చిస్తారు. ఆ కార్యక్రమంలో అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా రైతుల ఖాతాల్లోకి నగదును సీఎం చంద్ర బాబు విడుదల చేయనున్నారు. అనంతరం మధ్యాహ్నం 2.15 గంటలకు టీడీపీ కేడర్ సమావేశంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేయనున్నారు. సాయంత్రం 3.50 గంటలకు ప్రజా వేదిక సమావేశంలో సీఎం పాల్గొంటారు. ప్రజావేదికలో స్థానిక సమస్యలు, అభివృద్ధి అంశాలపై ఆయ న మాట్లాడతారు. సాయంత్రం 6 గంటలకు లింగంగుంట్ల నుంచి హెలికాప్టర్‌లో ఉండవల్లికి సీఎం చంద్రబాబు తిరుగు ప్రయాణం అవుతారు. ఈ పల్నాడు జిల్లా పర్యటనలో రైతు లు, ప్రజలతో సీఎం చంద్రబాబు నేరుగా ముచ్చటించనున్నారు.

# యోగాంధ్ర సంబరం..!!

**సీఎం చంద్రబాబుతో కలిసి బాబా రాందేవ్ యోగాసనాలు.. కోటి మందితో రికార్డు లక్ష్యం!**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ యోగా దినోత్సవానికి భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ వేడుకలకు ప్రత్యేక అతిథిగా ప్రముఖ యోగా గురువు బాబా రాందేవ్ హాజరుకానున్నారు. ఈ నెల 20న



ఉండవల్లి గుహల వద్ద సీఎం చంద్రబాబుతో కలిసి ఆయన ప్రత్యేక యోగా కార్యక్రమంలో పాల్గొంటారు. జూన్ 21న విజయవాడ ఇంది రాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్రస్థాయి వేడుకలు జరగను న్నాయి. రాష్ట్రవ్యాప్తంగా లక్షా 33 వేల కేంద్రాల్లో దాదాపు కోటి మందితో యోగా చేయించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. యోగాను కేవలం ఒకరోజు కార్యక్రమంగా కాకుండా జీవన విధానంగా మార్చాలన్న లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈసారి యోగాంధ్ర కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా యోగా గురువు బాబా రాందేవ్ రానున్నారు. శుక్రవారం విజయవాడ చేరుకోనున్న ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమై యోగా ప్రచారం, ప్రజారోగ్య కార్యక్రమాలపై చర్చించనున్నారు. అనంతరం మంతెన ఆశ్రమంలో బస చేయనున్నారు.

**ఉండవల్లి గుహల వద్ద యోగా సందడి...** ఈ నెల 20న ఉండవల్లి గుహల వద్ద నిర్వహించే ప్రత్యేక యోగా కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, బాబా రాందేవ్ కలిసి పాల్గొననున్నారు. చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఉండవల్లి గుహల వేదికగా యోగా ప్రదర్శనలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం చెబుతోంది. కార్యక్రమం అనంతరం సీఎం చిలకలూరిపేట పర్యటనకు వెళ్లనున్నారు.

**విజయవాడలో రాష్ట్రస్థాయి యోగా వేడుకలు...** 21వ తేదీన విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్రస్థాయి యోగా వేడుకలు జరగనున్నాయి. ఐదు వేల నుంచి ఆరు వేల మంది ఒకేసారి యోగా చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వర్షం కారణంగా ఇబ్బందులు తలెత్తితే ప్రత్యామ్నాయంగా అంబేద్కర్ కళావేదికలో కార్యక్రమం నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షా 33 వేల కేంద్రాల్లో యోగా డే నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

**కోటి మంది లక్ష్యంగా యోగాంధ్ర..** యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే 2 లక్షల 60 వేల మందికి పైగా యోగా ట్రైనర్లను సిద్ధం చేసినట్లు అధికారులు చెబుతున్నారు. యోగా డేలో పాల్గొనేందుకు కోటికి పైగా మంది నమోదు చేసుకున్నట్లు వెల్లడించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామాలు, పట్టణాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా యోగా పట్ల ఆసక్తి పెంచేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు కూడా చేపట్టారు.

**ఇంటింటికీ యోగా...ప్రజారోగ్యానికి కొత్త దిశ...** సంజీవని కార్యక్రమంతో యోగాను అనుసంధానం చేసి ప్రజారోగ్యానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి కోసం ప్రత్యేక థెరప్యూటిక్ యోగా కార్యక్రమాలు రూపొందించాలని ఆదేశించారు. యోగాను ఏడాది పొడవునా కొనసాగించేలా "ఇంటింటికీ యోగా" పేరుతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. యోగా మాస్టర్ ట్రైనర్లకు వచ్చే ఏడాది ప్రత్యేక పురస్కారాలు అందించే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది.

## సీఎం చంద్రబాబు అధ్యక్షతన 235వ

# ఎస్ఎల్‌బీసీ సమావేశం..

**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశం జరిగింది. ఏపీ సచివాలయంలోని 5వ బ్లాక్‌లో ఈరోజు (శు క్రవారం) మధ్యాహ్నం 235వ బ్యాంకర్ల సమావేశాన్ని నిర్వహించారు.**

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశం జరిగింది. ఏపీ సచివాలయంలోని 5వ బ్లాక్‌లో ఈరోజు (శుక్రవారం) మధ్యాహ్నం 235వ బ్యాంకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ భేటీలో




2026–27 వార్షిక రుణ ప్రణాళికపై బ్యాంకర్లతో సీఎం చంద్రబాబు చర్చించారు. వ్యవసాయ రంగం, ఎంఎస్ఎంఈలు, స్వయం సహాయ సంఘాలు, కౌలు రైతులకు అందించిన రుణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 2025–26 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగానికి రూ.3,86,249కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబుకు బ్యాంకర్లు వివరించారు. ఎంఎస్ఎంఈ రంగానికి రూ.1,17,357కోట్లు, ప్రాధాన్య రంగానికి రూ.5,19,693కోట్ల రుణాలు అందించినట్లు వెల్లడించారు. దక్షిణ భారతదేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో రుణాల పంపిణీ 137 శాతం మేర ఉన్నట్లు సీఎం చంద్రబాబుకు తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంకర్లకు ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. మరోవైపు రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు మరింత విస్తరించేలా సహకారం అందించాలని కోరారు. కాగా, ఎస్ఎల్‌బీసీ సమావేశానికి సీఎస్ సాయి ప్రసాద్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈవో ఆశిష్ పాండే, కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ డైరెక్టర్ నీలమ్ అగర్వాల్, ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ ఏవో బషీర్, నాబార్డ్ జీఎం కేవీఎస్ ప్రసాద్, తదితరులు హాజరయ్యారు

## నీట్ రీ-టెస్టు పేపర్ లీక్ ప్రచారం

# నిజం కాదు: కేంద్రం

**(మొదటిపేజి తరువాయి)** అనుమానాస్పద కంటెంట్ మీ దృష్టికి వస్తే వాట్సప్ నంబర్ ౦91 8799711259కు గానీ, Email: factcheck@pib.gov.in ద్వారా గానీ తమకు రిపోర్టు




చేయాలని కోరింది. 2026 జూన్ 21న జరగనున్న నీట్-యూజీ-2026 రీటెస్టు పశ్నపత్రం ఇన్‌స్టాలో లీక్ అయ్యిందని పేర్కొంటూ ఓ వ్యక్తి సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. అందులో పేపర్-బి అని రాసి ఉన్న బుక్‌లెట్‌ను ఓ వ్యక్తి ఓపెన్ చేస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. దీంతో పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం ఆ వీడియో నకిలీదిగా తేల్చింది. ఈ పోస్టను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(చీూా) షేర్ చేసింది.

## పేలుడు పదార్థాల కేసు.. రెండో నిందితుడిపై ఎన్ఐఏ

# ఛార్జ్‌షీట్ దాఖలు..

**ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన పేలుడు పదార్థాల కేసు నిందితుడిపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో రెండో నిందితుడు షేక్ మన్సూర్ అలియాస్ మహ్మద్ అలీ అలియాస్ విజయకుమార్‌పై విజయవాడ ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో అధికారులు ఛార్జ్‌షీట్ సమర్పించారు.**

**విజయవాడ:** ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన పేలుడు పదార్థాల కేసు నిందితుడిపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో రెండో నిందితుడు షేక్ మన్సూర్ అలియాస్ మహ్మద్ అలీ అలియాస్ విజయకుమార్‌పై విజయవాడ ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో అధికారులు ఛార్జ్‌షీట్ సమర్పించారు. షేక్ మన్సూర్‌పై ఉపా, బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన అధికారులు దర్యాప్తు పూర్తి చేసి ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. 1999 బాంబు పేలుడు కేసు తర్వాత తమిళనాడు నుంచి పరారైన షేక్ మన్సూర్.. ఆంధ్రప్రదేశ్‌లోని రాయచోటికి చేరుకున్నట్లు ఛార్జ్‌షీట్‌లో అధికారులు పేర్కొన్నారు. నకిలీ ప్రభుత్వ గుర్తింపు పత్రాలు పొంది అక్కడే నివాసం ఏర్పరచుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో ప్రధాన




నిందితుడైన అమనుల్లా ద్వారా తీవ్రవాద భావజాలానికి ప్రభావితమై బాంబుల తయారీలో శిక్షణ పొందినట్లు ఆరోపించారు. పేలుడు పదార్థాలను రహస్య స్థావరానికి తరలించడంలో షేక్ మన్సూర్ సహకరించినట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. ఓ వర్గం నాయకులను లక్ష్యంగా చేసుకుని హత్యలకు కుట్ర పన్నినట్లు గుర్తించామన్నారు. దేశంలో భయాందోళనలు సృష్టించి షరియా చట్టం అమలు లక్ష్యంగా కుట్ర పన్నినట్లు వెల్లడించారు. కాగా, ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులను అధికారులు అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు షేక్ అమనుల్లాపై ఫిబ్రవరి 2026లోనే ఎన్ఐఏ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. దర్యాప్తు సమయంలో అమనుల్లా ఇంట్లో పేలుడు పదార్థాలు, ఇతర కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు.

# సంపాదకీయం

## ఐటీ స్టాక్స్‌లో కలకలం..!!

**607 పాయింట్లు పతనమైన సెన్సెక్స్, 24,013 వద్ద నిఫ్టీ!**

**భారత ఈక్విటీ మార్కెట్లకు శుక్రవారం భారీ షాక్ తగిలింది. IT రంగ షేర్లు భారీగా పతనమయ్యాయి. దీంతో బెంచ్‌మార్క్ సూచీలు భారీ నష్టాలను చవిచూశాయి. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 607 పాయింట్లు, నిఫ్టీ 154 పాయింట్లు కోల్పోయాయి.**




భారత ఈక్విటీ మార్కెట్లకు శుక్రవారం షాక్ తగిలింది. IT రంగ షేర్లు భారీగా పతనమయ్యాయి. దీంతో బెంచ్‌మార్క్ సూచీలు భారీ నష్టాలను చవిచూశాయి. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 607 పాయింట్లు, నిఫ్టీ 154 పాయింట్లు కోల్పోయాయి. అంతర్జాతీయ ఐటీ దిగ్గజం 'యాక్సెంచర్' (Accenture) బలహీనమైన ఆదాయ అంచనాలను ప్రకటించడంతో, దాని ప్రభావం దేశీయ IT రంగ షేర్లపై తీవ్రంగా పడింది. అయితే, చివరి అరగంటలో కొంతమేర కోలుకొన్న సూచీలు సెన్సెక్స్ 76,802 పాయింట్ల దగ్గర, నిఫ్టీ కీలకమైన 24,000 మార్క్ వద్ద (24,013 వద్ద) స్థిరపడ్డాయి. గ్లోబల్ ఐటీ మార్కెట్లో నెలకొన్న మందగమనం, ఐటీ సేవల డిమాండ్‌పై యాక్సెంచర్ వ్యక్తం చేసిన ఆందోళనలు భారతీయ ఐటీ కంపెనీల పెట్టుబడిదారులను కలవరపెట్టాయి. బెంచ్‌మార్క్ సూచీల్లో కీలకమైన ఐటీ ఇండెక్స్ ఈరోజు మార్కెట్లో అత్యధికంగా నష్టపోయింది. నిఫ్టీ 50 ప్యాక్‌లో ఇన్ఫోసిస్ (Infosys), టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (TCS), టెక్ మహీంద్రా (Tech Mahindra) షేర్లు భారీగా నష్టపోయి టాప్ లూజర్స్‌గా నిలిచాయి.

## మూసీ పునరుజ్జీవనకు

# కీలక అడుగు..!!

**గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్..!**

**హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో కీలకంగా భావిస్తున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు కేంద్ర రక్షణ శాఖ నుంచి అనుమతులు లభించాయి. మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా బాపూఘాట్ వద్ద తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ రావడంతో పనుల అమలుకు మార్గం సుగమమైంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు, భారత సైన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు**

హైదరాబాద్ మహానగర అభివృద్ధి లో కీలకంగా భావిస్తున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు కేంద్ర రక్షణ శాఖ నుంచి అనుమతులు లభించా యి. మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా బాపూఘాట్ వద్ద తెలంగాణ ప్రభు త్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ రావడంతో పనుల అమలుకు మా ర్గం సుగమమైం ది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌కు, భారత సైన్యానికి ప్రత్యేక




కృతజ్ఞతలు తెలిపారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు అనుమతి లభించడం తెలంగాణ ప్రభుత్వ అభివృద్ధి విజన్ సాధనలో ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. మూసీ నది సమగ్ర పునరుజ్జీవనం, నదీ తీర ప్రాంతాల అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల లక్ష్యంగా ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపడుతోంది. మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణతో పాటు సాంస్కృతిక, సామాజిక వనరుల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. గాంధీ సరోవర్ ప్రాజెక్టు పూర్తయితే మూసీ నది పరిసర ప్రాంతాలు పర్యావరణపరంగా పునరుజ్జీవం పొందడమే కాకుండా ప్రజలకు ఆహ్లాదకరమైన ప్రజా స్థలాలు, వినోద కేంద్రాలు, సాంస్కృతిక వేదికలు అందుబాటులోకి రానున్నాయి. అలాగే పర్యాటక రంగానికి కూడా ఇది కొత్త ఊపునిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మూసీ రివర్‌ఫ్రంట్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసి ప్రజలకు మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. ఆధునిక సదుపాయాలు, పచ్చదనం, ప్రజా వినియోగానికి అనువైన మౌలిక వసతులతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. తెలంగాణ ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల్లో ఒకటైన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు కేంద్రం నుంచి లభించిన ఈ సహకారం రాష్ట్ర అభివృద్ధికి మరింత బలాన్ని చేకూర్చనుంది. బాపూఘాట్‌లో గాంధీ సరోవర్ పనులు త్వరలోనే ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ మహానగరానికి మరో ప్రతిష్ఠాత్మక పర్యాటక, పర్యావరణ కేంద్రం అందుబాటులోకి రానుంది.

## విధ్వంసమైన విద్యాశాఖను...

# వికాసం వైపు నడిపిస్తున్నాం..!!

రాష్ట్రం ఏర్పాటైంది. తెలంగాణ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, ఉపాధి కోసం ఎంతోమంది త్యాగాలు చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉంది.. వాటిని పునరుద్ధరించాలి. విద్యాశాఖను గతంలో విధ్వంసం చేశారు. గత పాలకుల అరాచకంతో రాష్ట్రానికి వందేళ్ల నష్టం జరిగింది. తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ రూపొందించి ప్రక్షాళన చేపట్టాం. విధ్వంసమైన విద్యాశాఖను వికాసం వైపు నడిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం బడ్జెట్‌లో 8.5 శాతం నిధులు కేటాయించాం. వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం రూ.26,600 కోట్లు ఖర్చు చేస్తున్నాం. వీటిని భావితరాల భవిష్యత్తును నిర్ణయించే పెట్టుబడులుగా భావిస్తున్నాం. ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో నో అడ్మిషన్ బోర్డు పెట్టారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇలా బోర్డు పెట్టే పరిస్థితి వస్తుందని ఎవరూ ఊహించి ఉండరు. ఉద్యోగులకు జీతాల మాదిరిగానే ప్రతినెలా ఒకటో తేదీన విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## అన్నదాత సుఖీభవ లైవ్ కాన్ఫరెన్స్‌కు రావాలని పిలుపు

**సీతారామపురం జూన్ 19 సూర్య న్యూస్:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాత సుఖీభవ నిధులను రైతుల ఖాతాలలో (నేడు) శనివారం జమ చేయనుందని మండల వ్యవసాయ అధికారి పి. చెన్నారెడ్డి తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం 5వేల రూపాయలు, కేంద్ర ప్రభుత్వం 2 వేల రూపాయలు మొత్తం 7 వేల రూపాయలు రైతుల ఖాతాలో జమ చేస్తుందన్నారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి విడుదల కార్యక్రమం వింజమూరులోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేశామని ఈ కార్యక్రమానికి ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. కావున వింజమూరులో జరిగే అన్నదాత సుఖీభవ ప్రత్యక్ష ప్రసారానికి సీతారామపురం మండలం నుండి ప్రజా ప్రతినిధులు అధికారులు తదితరులు హాజరుకావాలని ఆయన కోరారు.

### సీఎం పర్యటన ఏర్పాట్లను...

## కలెక్టర్ కృత్తికా శుక్ల, ఎస్పీ కృష్ణారావు పరిశీలన

**పల్నాడు జూన్ 19 సూర్య న్యూస్ :** జిల్లా పర్యటనలో భాగంగా చిలకలూరిపేట మండలం లింగంగుంట్లలో శనివారం సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు.ఈ



నేపథ్యంలో కలెక్టర్ కృత్తికా శుక్ల, ఎస్పీ కృష్ణారావు లు కలిసి హెలిప్యాడ్, అంగన్‌వాడీ కేంద్రం, సభా ప్రాంగణాలను పరిశీలించి భద్రతను సమీక్షించారు. పర్యటనలో భాగంగా సీఎం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, రైతులతో ముఖాముఖి మాట్లాడి, అనంతరం 'అన్నదాత సుఖీభవ' ద్వారా రైతులకు రూ. 7,000 జమ చేయడం, 'స్వచ్ఛ ఆంధ్ర' ప్రారంభం, కూటమి రెండేళ్ల విజయోత్సవ సభలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. సాయంత్రం 6 గంటలకు ఆయన తిరుగుపయనమవుతారని అధికారులు తెలిపారు.

### విద్య సాగునీరు అభివృద్ధిపై

## ఎమ్మెల్యే కోట్ల ప్రత్యేక దృష్టి

**విద్యార్థుల సన్మానం నుంచి చెరువుల పరిశీలన పలు వరుస కార్యక్రమాల్లో పాల్గొన్న డోన్ ఎమ్మెల్యే**

**డోన్ జూన్ 19 సూర్య న్యూస్:** నియోజకవర్గ అభివృద్ధి,విద్యా ప్రమాణాల పెంపు,రైతుల సంక్షేమమే లక్ష్యంగా డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి శుక్రవారం



ప్యాపిలి,డోన్ మండలాల్లో విస్తృతంగా పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్యాపిలి మండలంలోని ఏనుగుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబర్చి మండల స్థాయిలో ప్రథమ స్థానాలు సాధించిన రాగనిత్య, మనీషా, లహరి,హర్షవర్ధన్‌తో పాటు ఇతర విద్యార్థులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "విద్యార్థులే భావి భారత నిర్మాణ శిల్పులు" అని పేర్కొంటూ,గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు.అనంతరం ప్యాపిలి పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2026 ఇంటర్మీడియట్ ఫలితాల్లో నంద్యాల జిల్లా టాపర్‌గా నిలిచిన విద్యార్థిని రమ్యతో పాటు ప్రతిభ కనబరిచిన ఇతర విద్యార్థులను సన్మానించి అభినందించారు.ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి అత్యుత్తమ ఫలితాలు సాధించడం గర్వకారణమని,విద్యార్థుల విజయాల్లో ఉపాధ్యాయులు,తల్లిదండ్రుల పాత్ర కీలకమని కొనియాడారు.ఇదే పర్యటనలో భాగంగా ప్యాపిలి మండలంలోని చిన్న పొద్దిళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలలో బోధన విధానం,మౌలిక వసతులు,పరిశుభ్రత,మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించి,లోపాలపై అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.విద్యా ప్రమాణాల పెంపునకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.అదేవిధంగా డోన్ మండలంలోని కొత్తబుర్జు గ్రామ సమీపంలో ఉన్న తిప్పమ్మ కుంట, వెంగళం కుంటలను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.చెరువుల నీటి నిల్వ సామర్థ్యం,అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "రైతులకు శాశ్వత సాగునీటి భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం" అని స్పష్టం చేశారు.చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ ద్వారా భూగర్భ జలాలు పెరిగి రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ,విద్య,వ్యవసాయం,మౌలిక సదుపాయాల రంగాల్లో సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు.నియోజకవర్గ ప్రజల సంక్షేమమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు.

## ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం

**బిఎల్ఓ లు అడిగిన పత్రాలను ఓటర్లు వారికి ఇవ్వాలి-ఇంటింటికి వెళ్లి ఓట్ల సర్వే**

**సింహాద్రిపురం జూన్ 19 సూర్య న్యూస్ :** బిఎల్వోలు అడిగిన పత్రాలను వెంటనే వారికి ఇవ్వాలని వైకాపా జిల్లా చేనేత ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరయ్య అన్నారు .



సింహాద్రిపురం మండలం చవారిపల్లె గ్రామంలో నీ వీఆర్ఏ, టిడిపి నాయకుడు సురేష్ రెడ్డి లు శుక్రవారం జరిగిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) కార్యక్రమంలో వారు పాల్గొని ఓటర్లకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఓటరు వజ్రాయుధమన్నారు. ఓటర్ లిస్టులో ఓట్లు కచ్చితంగా ఉన్నాయా లేవో చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బి ఎల్ వో లు అడిగిన పత్రాలన్నింటినీ ఓటర్లు వారికి అందించి జాబితాలో పేర్లు ఉండేలా చూసుకోవాలన్నారు. జూలై నాటికి 18 ఏళ్లు నిండిన యువతి, యువకులు కూడా ఈ సర్వే కార్యక్రమంలో పాల్గొని కొత్తగా ఓటు హక్కు కోసం బి ఎల్ ఓ లకు దరఖాస్తులు అందించాలని వారు తెలిపారు. బి ఎల్ వో లకు కొత్త ఫోటోలను అందజేయాలన్నారు. 13 రకాల ఆధారాలలో ఏదో ఒకటి వారికి అందించాలన్నారు. ఓటర్లకు ఎర్మినేషన్ ఫరాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో కాసుల పండగ..?

### దండోరా లేకుండానే సభ నిర్వహించారంటూ గ్రామస్తుల ఆరోపణలు..!

### పక్క గ్రామాల నుంచి ఆటోల్లో జనాల తరలింపు.. మైనింగ్ అనుమతులపై అభ్యంతరాలు

**సైదాపురం జూన్ 19 సూర్య న్యూస్:** మండల పరిధిలోని పెరుమల్లపాడు గ్రామంలో ప్రతిపాదిత మైనింగ్ ప్రాజెక్టుకు సంబంధించి శుక్రవారం నిర్వహించిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం వివాదాస్పదంగా మారింది. నాగేశ్వరరావుకు చెందిన సర్వే నంబర్లు 142, 143ఏలో ఉన్న 3.197 హెక్టార్ల లీజు భూమిలో ఓపెన్‌కాస్ట్ విధానంలో క్వార్ట్జ్, మైకా, ఫెల్డ్‌స్పార్ ఖనిజాల తవ్వకాలకు అనుమతుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు అధికారులతో కలిసి ప్రజల అభిప్రాయాలను స్వీకరించారు. అయితే మైనింగ్ కంపెనీ యాజమాన్యం ముందస్తు ప్రణాళిక ప్రకారం అనుకూల వ్యక్తులను నగదు ప్రలోభాలకు గురిచేసి, పక్క గ్రామాల నుంచి ఆటోల్లో సభకు తరలించిందని స్థానికులు ఆరోపించారు.అంతేకాకుండా ప్రజాభిప్రాయ సేకరణకు ముందు గ్రామంలో నిబంధనల ప్రకారం దండోరా




నిర్వహించలేదని, గ్రామ ప్రజలకు పూర్తి సమాచారం అందించకుండా కార్యక్రమం చేపట్టారని గ్రామస్తులు విమర్శించారు.గ్రామానికి అతి సమీపంలో మైనింగ్ కార్యకలాపాలకు అనుమతులు ఇవ్వడం వల్ల కాలుష్య సమస్యలు తలెత్తి ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో మైనింగ్ కారణంగా పర్యావరణ కాలుష్యం పెరిగి ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఇలాంటి పరిస్థితుల్లో గ్రామ సమీపంలో మైనింగ్‌కు అనుమతులు మంజూరు చేయవద్దని స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. మైనింగ్ అనుమతుల విషయంలో నిబంధనలు, ప్రజల అభ్యంతరాలు, పర్యావరణ ప్రభావాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## అంకాళమ్మ వారికి విశేష పూజలు

**శ్రీశైలం(దేవస్థానం) జూన్ 19 సూర్య న్యూస్ :** లోకకల్యాణం కోసం శ్రీశైలక్షేత్ర గ్రామదేవత అయిన శ్రీ అంకాళమ్మవారికి శుక్రవారం ఉదయం అభిషేకం, విశేష



పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతీ శుక్రవారం రోజున శ్రీ అంకాళమ్మ వారికి దేవస్థానం సేవగా (సర్కారి సేవగా) ఈ విశేషపూజ జరిపించబడుతోంది. ఇందులో భాగంగా శ్రీఅంకాళమ్మ వారికి అభిషేకం, విశేషఅర్చనలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు జరిపించబడ్డాయి. కాగా శ్రీశైల క్షేత్రానికి గ్రామదేవతగా చెప్పబడుతున్న అంకాళమ్మ ఆలయం, ప్రధాన ఆలయానికి ఎదురుగాగల రహదారికి చివరలో కుడివైపున ఉత్తరముఖంగా ఉంది.ప్రకృతి శక్తుల యొక్క కళలే గ్రామ దేవతలని దేవీభాగవతంలో చెప్పబడింది.కాగా ఈ ప్రకృతి అంతా ఆదిపరాశక్తి స్వరూపమేనని మన ఆర్షవాఙ్మయం చెబుతోంది.చతుర్భుజాలను కలిగిన ఈ దేవి నాలుగు చేతులలో కుడివైపున క్రింది నుండి పైకి వరుసగా కత్తి, సర్పంలో చుట్టబడిన దమరుకం ఉండగా, ఎడమవైపున పానపాత్ర, త్రిశూలం ఉన్నాయి. కిరీట మకుటం గల ఈ దేవి వస్త్రాలంకృతురాలైనా కర్ణాభరణాలను, కంఠాభరణాలను కలిగి ఉంటుంది.కాగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజ జరిపించబడింది.ఆ తరువాత లోకకల్యాణాన్నికాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు.అనంతరం పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం,జలముతో విశేషఅభిషేకం అర్చనలు నిర్వహించబడ్డాయి.

## రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలి

**-జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్**

**రంపచోడవరం జూన్ 19 సూర్య న్యూస్:** జిల్లాలోని రైతులకు యూరియా, డి ఏ పి ఎరువులు కొరత లేకుండా ఎప్పటికప్పుడు పర్యేక్షించాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్





కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అడ్డతీగల గ్రామంలోని ఎరువులు,డి ఏ పి ,మన గ్రోమోర్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలవరం జిల్లా కలెక్టర్ కే.దినేష్ కుమార్ మాట్లాడుతూ పోలవరం జిల్లాలో వ్యవసాయ రైతులకు ఎట్టి పరిస్థితుల్లో యూరియా, డిఏపి ,ఎరువులు కొరత లేకుండా ఎప్పటికప్పుడు సంబంధిత డీలర్లతో సంప్రదించాలని ఆయన అన్నారు. పోలవరం జిల్లాలో ఏపీ ఎఐ యం యాస్ యాప్ ద్వారా రైతులు ఎరువులు, డి ఏ పి విక్రయించే విధంగా రైతులకు ఈ యాప్ పై అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. పోలవరం జిల్లాలోని రైతులు ఎరువులు, డి ఏ పి కావలసిన రైతులు సంబంధిత మండలాలలోని ఎరువుల షాపులకు వెళ్లి పట్టాదారు పాస్ పుస్తకాలు ద్వారా ఎరువులు విక్రయించాలని ఆయన అన్నారు. ఎక్కడైనా ఎరువులు కొరతయున్నాయెడల సంబంధిత మండల వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా ఎరువుల స్టాక్ రూమును జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె. రామ్మోహన్ రావు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సావిత్రి ,తాసిల్దార్ తేజస్విని,ఎంపీడీవో కుమార్,మండల వ్యవసాయ శాఖ అధికారి శివ శ్రీనివాసరావు,ఆర్ ఎస్ కే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తడలో 'కల్తీ' విందు..!

**అధికారుల నిర్లక్ష్యంతో ప్రజారోగ్యానికి ముప్పు..!**

**సూళ్లూరుపేట జూన్ 19సూర్య న్యూస్:** సూళ్ళూరుపేట, తడ ప్రాంతాల్లోని హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార కల్తీ విపరీతంగా పెరిగిపోయింది. తిరుపతి జిల్లాలో పారిశ్రామికంగా, రవాణా పరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న సూళ్ళూరుపేట పట్టణం మరియు తడ మండల కేంద్రాలు, ప్రస్తుతం ఆహార కల్తీకి అడ్డాగా మారుతున్నాయి. చుట్టూ ఉన్న పరిశ్రమలు, పెరిగిన రద్దీని ఆసరా చేసుకుని హోటళ్లు, రెస్టారెంట్లు, రోడ్డు పక్కన ఫుడ్ స్టాల్స్ వ్యాపారస్తులు నాణ్యతను గాలికి వదిలేశారు. సామాన్యుల ప్రాణాలతో యథేచ్ఛగా



చెలగాటమాడుతున్నా, సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది.?సూళ్ళూరుపేట మరియు తడ ప్రాంతాల్లోని హోటళ్లలో విక్రయించే ఆహార పదార్థాల నాణ్యత అత్యంత ప్రశ్నార్థకంగా మారింది. కనీస పరిశుభ్రత పాటించకుండా, నిత్యం దుమ్ము, ధూళి మధ్యే వంటకాలు వడ్డిస్తున్నారు. పరిశ్రమల వల్ల వచ్చే రద్దీని దృష్టిలో ఉంచుకుని, వేగంగా ఆహారం అందించాలనే లక్ష్యంతో నాణ్యతను పూర్తిగా విస్మరిస్తున్నారు. గతంలో అధికారులు చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో భారీగా నిల్వ ఉన్న మాంసం పట్టుబడిన ఘటన జిల్లాను కుదిపేసింది. అప్పట్లో తనిఖీలు నిర్వహించి ఆంక్షలు విధించినా, అధికారుల పర్యవేక్షణ లోపించడంతో పరిస్థితి మళ్ళీ మొదటికే వచ్చింది. ప్రస్తుతం చాలా చోట్ల రోజుల తరబడి నిల్వ ఉంచిన మాంసాన్నే వాడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.?ముఖ్యంగా చికెన్ వంటకాల్లో కంటికి ఇంపుగా కనిపించేందుకు ప్రమాదకరమైన సింథటిక్ రంగులను, రుచి కోసం అజినోమోటో వంటి హానికర రసాయనాలను మితిమీరి వాడుతున్నారు. ఇవి దీర్ఘకాలంలో క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీస్తాయని తెలిసినా, అధిక లాభాల కోసం వ్యాపారులు ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారు. మరోవైపు, వంట నూనెలను పదేపదే వేడి చేయడం, ప్లాస్టిక్ కవర్లలో వేడి పదార్థాలను ప్యాక్ చేయడం వంటి చట్టవిరుద్ధ పనులు సర్వసాధారణమైపోయాయి.?ప్రతి రోజూ అధికారులు ఇదే మార్గంలో ప్రయాణిస్తున్నా, హోటళ్లలో జరుగుతున్న ఈ అక్రమ వ్యాపారాలు వారి కంట పడటం లేదా? అనే అనుమానాలు ప్రజల్లో బలంగా వ్యక్తమవుతున్నాయి. తనిఖీలు చేపట్టాల్సిన ఆహార భద్రతా విభాగం అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, సూళ్ళూరుపేట మరియు తడ ప్రాంతాల్లోని హోటల్స్, రెస్టారెంట్లలో ప్రత్యేక బృందాలతో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని, నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### 10వ తరగతి సప్లిమెంటరీ ఫలితాలలో హొలగుంద జిప ఉ.పాఠశాలలో

## 85శాతం విద్యార్థుల ఉత్తీర్ణత

**హొళగుంద జూన్ 19 సూర్య న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం 10వ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేసింది. ఈ ఫలితాలలో మండల కేంద్రంలోని జిల్లా



పరిషత్ ఉన్నత పాఠశాల నందు 110 మంది విద్యార్థులకు గాను 94 మంది విద్యార్థులు ఉత్తీర్ణతను సాధించి 85% ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాల తర్వాత 2025 26 విద్యా సంవత్సరానికి ఎస్ఎస్సి రెగ్యులర్ పరీక్షలలో 312 మంది విద్యార్థులకు గాను 22 మంది ఉత్తీర్ణత సాధించారని అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాల తర్వాత 312 మందికి గాను 296 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి, పాఠశాల మొత్తంగా 95 శాతం ఉత్తీర్ణత సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.కబీర్ సాబ్ తెలిపారు. ఫలితాలను సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయ బృందానికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఖాకీల కన్ను...నేరగాళ్లకు చెమటలు..!

### నేరగాళ్లకు హెచ్చరిక.. గ్రామాల్లో పోలీసుల మెరుపు దాడులు...కొండ్రెడ్డిపల్లి, నారేపల్లిని చుట్టుముట్టిన భారీ పోలీసు బలగాలు

### ఇంటింటా తనిఖీలు.. అనుమానితులపై ఆరా...ఎస్పీ ఆదేశాలతో కట్టుదిట్టమైన కార్డన్ అండ్ సెర్చ్

**వేముల జూన్ 19 సూర్య న్యూస్:** జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపేందుకు కడప జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ షెల్కే ఆదేశాల మేరకు, పులివెందుల ఎస్‌డీపీఓ మురళీ నాయక్ ఆధ్వర్యంలో వేముల మండలంలోని కొండ్రెడ్డిపల్లి,నారేపల్లి గ్రామాల్లో గురువారం భారీ ఎత్తున కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్కే వ్యాలీ సీఐ శంకర్ రెడ్డి,వేముల ఎస్.ఐ ప్రవీణ్ కుమార్ సమన్వయంతో చేపట్టారు.ఉదయం నుంచే గ్రామాలను చుట్టుముట్టిన పోలీసు బృందాలు ఇంటింటా సోదాలు నిర్వహించి అనుమానాస్పద వ్యక్తులు,పాత నేరస్థులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఆరా తీశాయి. గ్రామాల్లోకి వచ్చే,వెళ్లే మార్గాలన్నింటినీ పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుని క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. వాహనాలు,వ్యక్తుల వివరాలు,గుర్తింపు పత్రాలను పరిశీలిస్తూ గ్రామాలను జల్లెడ పట్టారు.గ్రామాల్లో నివసిస్తున్న వ్యక్తుల వివరాలు,అద్దెకు ఉంటున్న వారి సమాచారం,వాహనాల



పత్రాలు,గుర్తింపు ధ్రువపత్రాలను పరిశీలించారు.చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని,నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు. ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడం, నేరాలను ముందుగానే అరికట్టడం, అసాంఘిక శక్తుల కదలికలను గుర్తించడం లక్ష్యంగా ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా,చట్టవ్యతిరేక కార్యకలాపాలపై సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.జిల్లా పోలీసు యంత్రాంగం నేరాల నియంత్రణ విషయంలో రాజీ పడదని, ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కలిగించే వారిపై నిరంతర నిఘా కొనసాగుతుందని ఎస్‌డీపీఓ మురళీ నాయక్ పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఇలాంటి కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాలు మరింత ముమ్మరం చేస్తామని సీఐ శంకర్ రెడ్డి,ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సబ్‌డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు,ఏఆర్ సిబ్బంది,పోలీసు సిబ్బంది పాల్గొని విస్తృత తనిఖీలు నిర్వహించారు.

సూర్య



### రేపు దుత్తలూరు తహశీల్దార్ కార్యాలయంలో

# రెవెన్యూ డే వేడుకలు

**అధికారులు.. ఉద్యోగులు తప్పనిసరిగా పాల్గొనాలి: తహశీల్దార్ వై నాగరాజు**

**ఉదయగిరి జూన్ 19సూర్య న్యూస్:** దుత్తలూరు మండలంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శనివారం రెవెన్యూ డే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహశీల్దార్ వై. నాగరాజు తెలిపారు. రెవెన్యూ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తుచేసుకుంటూ, శాఖ అభివృద్ధి, బాధ్యతలు, ప్రజా సేవలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది తమ విధుల పట్ల మరింత అంకితభావంతో పనిచేయాలని, ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. అలాగే రెవెన్యూ శాఖకు సంబంధించిన పలు అంశాలపై చర్చలు, అభిప్రాయాల మార్పిడి, శాఖ సేవల ప్రాధాన్యతపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రెవెన్యూ శాఖ అధికారులు, ఉద్యోగులు, సంబంధిత సిబ్బంది అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని తహశీల్దార్ నాగరాజు పిలుపునిచ్చారు. మండల ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో రెవెన్యూ శాఖ కీలక పాత్ర పోషిస్తోందని, ఈ సందర్భంగా శాఖ సేవలను సమీక్షించుకునే అవకాశం కలుగుతుందని ఆయన అన్నారు.



### ఓటర్ల సమగ్ర సవరణ పక్రియను ప్రతి ఒక్కరు

# సద్వినియోగం చేసుకోవాలి

**టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి**

**వేంపల్లె జూన్ 19సూర్య న్యూస్ :** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)పక్రియను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ రామ ముని రెడ్డి కోరారు. శుక్రవారం పక్కీరుపల్లిలో బూత్ నెం. 248 ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పక్రియ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి బిఎల్ఓ తమ పరిధిలోని ప్రతి ఓటరుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అర్హత కలిగి ఉన్న ఓటర్ల పేర్లు చేజారకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బిఎల్ఓ లకు సూచించారు. ఓటర్లకు అవగాహన కల్పిస్తూ పలు సందేహాలను నివృత్తి చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే ఎస్ఐఆర్ పక్రియను పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే అధికారులు, బూత్ కమిటీ సభ్యులు సమన్వయం చేసుకుంటూ మ్యాపింగ్ ప్రక్రియను కొనసాగించారు ఈ కార్యక్రమాన్ని భూత్ ఇంచార్జ్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లాడెన్, యూనిట్ ఇన్చార్జులు జబివుల, మరియు డక్కా రమేష్,భాస్కర్, బాబు పాల్గొన్నారు.



### అభయ - భవిత పోస్టర్లను...

# ఆవిష్కరించిన ఆర్డీఓ

**కావలి జూన్ 19 సూర్య న్యూస్:** అభయ భవిత ఫౌండేషన్ స్వామి బాలచంద్ర వారు రూపొందించిన అభయ – భవిత (జీవితం మనదే..జీవమూ మనదే!) మహిళలు తమ ఆత్మరక్షణ కోసం పాటించాల్సిన పది సూత్రాలకు సంబందించిన పోస్టర్స్ ను శుక్రవారం కావలి ఆర్డీఓ మరియు ఒకటవ పట్టణ సీఐ చేతులమీదుగా ఆవిష్కరణ చేయడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ప్రియదర్శిని మహిళా మండలి అధ్యక్షురాలు షేక్ ఖాదర్ బీ విద్యార్థులకు, మహిళలకు లైంగిక వేధింపులు, చట్టాలు, స్వీయ రక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రహీం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మరియు సిపిసిఎల్ జిల్లా కన్వీనర్ మహమ్మద్ అబ్దుల్ అలీమ్, జాగో వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు షేక్ జమీర్, హ్యాపీ సేవా సంస్థ చైర్మన్ సయ్యద్ ఘనీ మరియు గుడ్ మెన్స్ ట్రస్ట్ చైర్మన్ సోమిశెట్టి బ్రహ్మయ్య పాల్గొన్నారు.



# ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

**ఎమ్మెల్యే వనమాడి కొండబాబు**

**కాకినాడ బ్యూరో జూన్ 19సూర్య న్యూస్ :** ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందని, నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ వారి



సమస్యల సత్వర పరిష్కారం కొరకు కృషి చేయడం జరుగుతుందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు.స్థానిక జగన్నాధపురం శాసనసభ్యులు వారి క్యాంప్ కార్యాలయం నందు శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వనమాడి కొండబాబు స్వయంగా అర్జీలు స్వీకరించి వాటి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ఏ ఒక్క లబ్ధిదారుడు ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉండకూడదని, వచ్చిన ప్రతి వినతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయడం జరుగుతుందని, ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రథమ ప్రాధాన్యతని, ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు చేరాలన్నదే తన లక్ష్యమని కొండబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### తిరుచానూరులో తెప్పోత్సవాలకు ముస్తాబైన...

# పద్మావతి అమ్మవారి ఆలయం

**జూన్ 25 నుంచి 29 వరకు వైభవంగా తెప్పోత్సవాలు**

**భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు జేఈవో డా. ఎ.శరత్ ఆదేశం**

**తిరుమల జూన్ 19 సూర్య న్యూస్:** తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ఈ నెల 25 నుంచి 29వ







తేదీ వరకు జరగనున్న వార్షిక తెప్పోత్సవాలకు టీటీడీ సర్వాంగసుందర ఏర్పాట్లు చేపడుతోంది. ఉత్సవాల నేపథ్యంలో టీటీడీ జేఈవో డా.ఎ.శరత్ శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భద్రత, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, ట్రాఫిక్ నియంత్రణ, దర్శన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. తెప్పోత్సవాల్లో వినియోగించే తెప్పలను సాంకేతికంగా పరిశీలించి ముందస్తు ట్రయల్ నిర్వహించాలని సూచించారు. అలాగే విద్యుద్దీపాలు, పుష్పాలంకరణలతో ఆలయ పరిసరాలను ఆధ్యాత్మిక శోభతో అలంకరించాలని పేర్కొన్నారు.ఉత్సవాల సందర్భంగా హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో భక్తి సంగీత కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, భజనలు, కోలాటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలు భక్తులకు భక్తి భావాన్ని మరింత పెంపొందిస్తాయని చెప్పారు.

**ఉత్సవాల వివరాలు:** జూన్ 25న రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామివారి తెప్పోత్సవం, జూన్ 26న సుందరరాజ స్వామివారి తెప్పోత్సవం, జూన్ 27 నుంచి 29 వరకు శ్రీ పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు నిర్వహించనున్నారు.

**ప్రత్యేక ఆకర్షణగా వాహన సేవలు:** జూన్ 28న రాత్రి గజవాహన సేవ, జూన్ 29న రాత్రి గరుడవాహన సేవ భక్తులను విశేషంగా ఆకట్టుకోనున్నాయి. అనంతరం ఉత్సవమూర్తుల మాడవీధుల ఊరేగింపు వైభవంగా జరుగనుంది. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఎస్ఈలు వెంకటేశ్వర్లు, నరసింహమూర్తి, విజివో గిరిధర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# రోగనిరోధక శక్తికి యోగ అభ్యాసం..

**ఆర్టీసీ గ్యారేజీలో 'యోగాంధ్ర'**

**కావలి జూన్ 19 సూర్య న్యూస్ :** రోజూ కొద్ది నిమిషాల యోగా సాధన చేయడం వల్ల శారీరక, మానసిక రుగ్మతలను దూరం చేసుకోవచ్చని ప్రముఖ యోగా శిక్షకులు, రెడ్ క్రాస్ యోగా ధ్యాన కేంద్రం కన్వీనర్ శ్రీమతి సోమశిల స్వర్ణలత పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం ఏపీఎస్ ఆర్టీసీ కావలి డిపో గ్యారేజీలో 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. డిపో మేనేజర్ డి. ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వర్ణలత పాల్గొని యోగా విశిష్టతను వివరించారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని, పాటించాల్సిన యోగా ప్రోటోకాల్‌ను సిబ్బందితో అభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ డి. ఆదినారాయణ మాట్లాడుతూ.. యాజమాన్యం పిలుపు మేరకు ప్రతి డిపోలోనూ 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో దాదాపు 100 మంది ఆర్టీసీ సిబ్బంది పాల్గొని యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) బి. మల్లికార్జున, డిప్యూటీ సూపరింటెండెంట్ (పర్సనల్) జి. శ్రీనివాసులు, జిల్లా సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్ట్రక్టర్ నాగరాజు, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డి. రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం యోగా శిక్షకులు సోమశిల స్వర్ణలతను డిపో సిబ్బంది ఘనంగా సత్కరించారు.





## బిరదవోలు లో ఇంటింటి ఓటర్ వెరిఫికేషన్

**పొదలకూరు జూన్ 19 సూర్య న్యూస్:** మండలంలోని బిరదవోలు గ్రామంలో ఓటర్లు జాబితా ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని బీఎల్ఓ ప్రశాంతి ఆధ్వర్యంలో వివరాలు నమోదు చేశారు.ఓటర్ జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు చేర్పుల కోసం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ ఇంటింటి సర్వే చేసి ప్రతి ఓటరు వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తప్పులు లేకుండా జాబితాను తయారు చేస్తున్నారు. ఓటర్లందరూ తమ వివరాలను సరిచూసుకొని ఏవైనా తప్పులు ఉంటే బీఎల్ఓ దృష్టికి తీసుకురావాలని అధికారులు కోరారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



### రైతులు మీ ఫోన్‌లోనే ఎరువుల బుకింగ్

# ఇక లైన్లలో నిలబడే పని లేదు

**జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్**

**కాకినాడ బ్యూరో జూన్ 19సూర్య న్యూస్:** ఎరువులు పంపిణీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన 'నేషనల్ ఫార్మర్ ఫెర్టిలైజర్' యాప్ వినియోగంపై జాయింట్




కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం ప్రత్తిపాడు మండలం, ఏలూరు రైతు సేవా కేంద్రాన్ని జేసి.. రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక రైతులతో సమావేశమై ఎరువులు కొనుగోలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నేషనల్ ఫార్మర్ ఫెర్టిలైజర్'యాప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు మీ ఫోన్‌లోనే ఒక్క క్లిక్‌తో ఎరువులు పొందే సరికొత్త విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు.రైతు సోదరులు ఎవరో ఇకనుంచి ఎరువుల కోసం లైన్లలో నిలబడే పని లేదని ఆయన వివరించారు. రైతులు ఎరువుల కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఇకపై ఎరువుల కోసం తిరగాల్సిన పనిలేదు. యాప్‌లో బుక్ చేసుకుని, మీకు వచ్చిన క్యూఆర్ కోడ్ చూపించి నచ్చిన డీలర్ లేదా ఆర్ఎస్కే వద్ద ఎరువులు తీసుకోవచ్చని అని జేసి తెలిపారు. ఈ విధానం వల్ల రైతులకు సమయం ఆదా కావడమే కాకుండా, ఎరువులు ఎప్పుడు, ఎక్కడ అందుబాటులో ఉన్నాయో కూడా తెలుసుకోవచ్చని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు తహసీల్దార్ సూర్యప్రభ, ఎడీఏ శ్రీనివాస్ ప్రతిపాడు మండల వ్యవసాయ అధికారి జోక అమృత, మండల విస్తీర్ణ అధికారి అర్జున్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వాడపల్లి ఆలయ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్**







**కోనసీమ/ఆత్రేయపురం జూన్ 18 సూర్య న్యూస్:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం 'కోనసీమ తిరుమల'గా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ శుక్రవారం పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో సాగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, భక్తుల సౌకర్యార్థం చేపట్టిన ఈ ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా, అత్యంత నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**అభివృద్ధి పనుల పరిశీలన:** ఈ పర్యటనలో భాగంగా కమిషనర్ ఆలయ ప్రాంగణంలో శరవేగంగా జరుగుతున్న పలు నిర్మాణాలను పరిశీలించారు.ముఖ్యంగా వకులామాత అన్నదాన భవన నిర్మాణ పనులు ఆలయ కోనేరు (పుష్కరిణి) అభివృద్ధి పనులు,నూతన రథశాల నిర్మాణం,శ్రీనివాస భవన నిర్మాణ పనులుభక్తుల క్యూలైన్ల ఆధునీకీకరణ, విశాలమైన కార్ పార్కింగ్ ప్రదేశం, పరిశీలించి తగు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ రామచంద్ర మోహన్ మాట్లాడుతూ,వాడపల్లి ఆలయ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా పూర్తి సహకారం అందిస్తోందని స్పష్టం చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్), డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అడ్వైజర్ ఎస్. సుబ్బారావు, ఈఈ టి. దుర్గేష్ కుమార్, డిఈ ఉదయ్ కుమార్ మరియు ఇతర ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

EDITED PUBLISHED AND WONEDBY N.MAHESWARA REDDY PUBLISHED AT D.NO 1/171/2 DEVANAKONDA (M&POST) 518465, KURNOOL DIST, AP, PRINTED AT SRI LAKSHMI OFFSET PRINTERS AND PUBLICATIONS D.NO 1/171/2 DEVANAKONDA (M&POST)518465 KURNOOL DIST. CONTRACT CELL NO. 9010008143,RNI APTEL 2022/82194 Gmail :suryavelugutelugu daily@gmail.com

## మండల ఎంపీడీవో గా సి హెచ్ ఎస్ వి రెడ్డి

# బాధ్యతల స్వీకరణ

**కొవ్వూరు జూన్ 19 సూర్య న్యూస్ :** మండలం ఎంపీడీవో గా సి హెచ్ ఎస్ వి రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.గతంలో పనిచేసిన ఎంపీడీవో పదవీ విరమణ



చేయడంతో ఏర్పడినఖాళీని భర్తీ చేస్తూ ప్రభుత్వం ఆయనను నియమించింది. గతంలో ఉండి మండలంలో డిప్యూటీ ఎంపీడీవో గా పని చేసిన రెడ్డి, పదోన్నతి పై కొవ్వూరు ఎంపీడీవో గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ అధికారులు, కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## శక్తి యాప్ వినియోగంపై అవగాహన

**సీతారామపురం జూన్ 19 సూర్య న్యూస్:** మహిళల భద్రత కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన శక్తి యాప్ వినియోగంపై శుక్రవారం ఆదర్శ పాఠశాలలోని విద్యార్థినీలకు



ఉదయగిరి సీఐ వెంకటరావు ఆధ్వర్యంలో శక్తి బృందం సభ్యులు విద్యార్థినుల భద్రత, స్వీయ రక్షణ, చట్టపరమైన అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు శక్తి యాప్ వినియోగం, మహిళలు, బాలికల భద్రత, స్వీయ రక్షణ పద్ధతులు, బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టం,గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్ వంటి ముఖ్యమైన అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. సంబంధిత చట్టాలు, సెక్షన్లు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.శక్తి బృంద సభ్యులు విద్యార్థులకు ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా స్వీయ రక్షణ పద్ధతులను చూపించి, శక్తి యాప్ ఉపయోగించేవిధానాన్నివివరించారు.ఉపాధ్యాయులందరూ తమ మొబైల్ ఫోన్లలో శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నారు.విద్యార్థులందరూ కూడా ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని అవసరమైన సందర్భాల్లో వినియోగించాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకట రాజేష్, శక్తి బృంద సభ్యులు గోపినాథ్, ఎంఈఓ మస్తాన్వలి,ప్రిన్సిపాల్ సమీరా, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి...

# 10 వేలు ఆర్థిక సహాయం

**మహానంది జూన్19 సూర్య న్యూస్:** ఆటో నడుపుకుంటు జీవనం సాగిస్తున్న శ్రీనివాసులు(27)అనే వ్యక్తి శుక్రవారం ఉదయం మృతి చెందాడు. తెల్లవారు జామున



గుండె పోటుకు గురికావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య 3నెలల కూతురు వున్నారు. విషయం తెలుసుకున్న ఆటో యూని యన్ అధ్యక్షులు లక్ష్మీ నారాయణ గౌడ్ ఆధ్వర్యంలో మహానంది ఆటో యూనియన్ సభ్యులు 10వేల రూపాయల ను అందజేశారు. ఈ కార్యక్రమంలో శివ, డైవర్లు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంపై...

# ప్రజలకు పెరిగిన నమ్మకం

**ఘనంగా కూటమి విజయోత్సవ సభ**

**జగ్గయ్యపేట జూన్19 సూర్య న్యూస్:** కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో ప్రజలకు ప్రభుత్వం పట్ల నమ్మకం పెరిగిందని స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)






అన్నారు. పట్టణంలోని ఉక్కు కళా వేదికలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" విజయో త్సవ సభ ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.విజయోత్సవ సభకు ముందు ఎమ్మెల్యే నివాసం వద్ద నుండి యువనాయకులు శ్రీరాం ధనుంజయ (చిన్నబాబు) ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వందలాది వాహనాలతో ఉత్సాహంగా పాల్గొని పట్టణ ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉక్కు కళా వేదికకు చేరుకుని విజయోత్సవ సభను ప్రారంభించారు.ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూరాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో చిత్తశుద్ధితో పనిచేస్తూ అభివృద్ధిసంక్షేమాన్ని సమన్వయం చేస్తూ రాష్ట్రాన్ని పురోగతి దిశగా నడిపిస్తోందని తెలిపారు. రైతులు, మహిళలు, యువత, కార్మికులు, పేద మరియు మధ్యతరగతి కుటుంబాల సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గానికి,పట్టణానికి కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అందించిన అభివృద్ధి,సంక్షేమం గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో శ్రీరాం సుబ్బారావునూకల కుమార్ రాజా, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లెల సీతమ్మ కొండయ్య, మేక వెంకటేశ్వర్లు, ముల్లంగి రామకృష్ణారెడ్డి, కట్టా వెంకట నరసింహారావు, వడ్లమూడి రాంబాబు, చింతల సీతారామయ్య, కర్రి చిన్న, కన్నెబోయిన రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# కలవరపెడుతున్న 'తార్ గ్యాంగ్'.. అప్రమత్తంగా ఉండాలి

**: ఎస్సై టి. రామకృష్ణ**

**తాళ్లపూడి జూన్ 19 సూర్య న్యూస్:** మండల పరిధిలో ఇటీవల అనుమానాస్పదంగా సంచరిస్తున్న 'తార్ గ్యాంగ్' కార్యకలాపాలపై పోలీసులు అప్రమత్తమయ్యారు. బీహార్ రాష్ట్రానికి చెందిన ఈ గ్యాంగ్ సభ్యులు పగటిపూట ఇళ్లు, వ్యాపార సంస్థల వద్ద రెక్కీ నిర్వహించి రాత్రి సమయంలో చోరీలకు పాల్పడుతున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయని తాళ్లపూడి ఎస్సై టి. రామకృష్ణ తెలిపారు.మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించిన ఆయన, ఇళ్లు, దుకాణాలు, వీధి కూడళ్లు, బ్యాంకులు, బంగారం దుకాణాలు, ఏటీఎంల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కెమెరాల ద్వారా నేరస్థులను గుర్తించడం సులభమవుతుందని చెప్పారు.ఇళ్ల ముందు వెనుక భాగాలు, సందుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కనీసం 15 రోజుల రికార్డింగ్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. వీధుల్లో కొత్త వ్యక్తులు లేదా అనుమానాస్పదంగా సంచరించే



వారు కనిపిస్తే వారి వివరాలను గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. రాత్రి సమయంలో ఇళ్లకు భద్రమైన తాళాలు వేసుకోవడం, ఇంటి పరిసరాల్లో తగిన వెలుతురు ఉండేలా చూసుకోవడం అవసరమన్నారు. గ్రామం లేదా పట్టణం బయటకు వెళ్లే సమయంలో పక్కింటి వారికి సమాచారం ఇచ్చి వెళ్లాలని సూచించారు.ఏదైనా అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే 112కు లేదా తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు. దొంగతనాల నివారణలో ప్రజల సహకారం ఎంతో కీలకమని, సమయానికి అందే సమాచారం అనేక మందిని రక్షించగలదని పేర్కొన్నారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా పోలీసు గస్తీని ముమ్మరం చేసినట్లు తెలిపారు. 'తార్ గ్యాంగ్' ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టాయని ఎస్సై టి. రామకృష్ణ వెల్లడించారు.

## బారులు ఇలా...మరి వెళ్లేదెలా..!

**బియ్యం లారీలతో ప్రజలకు ఇబ్బందులు**

**కాకినాడ సామర్లకోట /జూన్ 19 సూర్య న్యూస్ :** జిల్లా లోని సామర్లకోట పట్టణం సత్యనారాయణపురం శివారున ఉన్న ఎఫ్సిఐ గోదాములకు భారీగా తరలివస్తున్న బియ్యం



లారీలతో తిప్పలు తప్పడం లేదని ఆ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందలాది లారీలు ఎఫ్సీఐ గోడౌన్కు బియ్యం దిగుమతి కోసం రావడం, ఆ గోడౌన్స్ లోపలికి వెళ్లేందుకు అనుమతులు జాప్యం కావడంతో లారీలన్నీ రోడ్డుపైనే ఇరువైపులా నిలిచిపోవడంతో పరిస్థితి దారుణంగా మారుతోంది. కనీసం ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుందటంతో సత్యనారాయణ పురం ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దేశంలో నలుమూల నుంచి లారీలు వస్తుండగా ఆ వాహనాల డ్రైవర్ లు, క్లీనర్ లు వాహనాల వద్దే వంటా వార్పు చేసుకోవడంతో పాటు వారి కదలికల వలన ఆ మార్గంలో ప్రయాణించే మహిళలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అలాగే అదే మార్గంలో ఒక ఉన్నత పాఠశాల ఉండగా విద్యార్థులను తీసుకువెళ్లే ఆటోలకు కూడా ఇబ్బందులు కలుగుతున్నట్లు చెబుతున్నారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు బియ్యం లోడులతో వస్తున్న లారీలకు పట్టణం వెలుపల ఒక స్థలాన్ని కేటాయించి వాహనాలకు సీరియల్ నెంబర్ టోకెన్లు అందించి వాటిద్వారా దిగుమతులు జరుపుకుంటూ స్థానిక ప్రజలకు, వాహనాలకు ఇబ్బంది కలగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

# వృద్ధ మహిళకు అంతిమ సంస్కారాలు

**మాచర్ల / పల్నాడు జూన్ 19 సూర్య న్యూస్ :** జిల్లా లోని మాచర్ల పట్టణానికి చెందిన తడిపి వెంకటరమణ (70) అనే వృద్ధ మహిళ అనారోగ్య కారణంతో మాచర్ల ప్రభుత్వ





ఆసుపత్రిలో తనువు చాలించింది. కొంతకాలంగా అనారోగ్య కారణాలతో ఇబ్బందులు పడుతూ ఆమె గవర్నమెంట్ ఆసుపత్రిలో చేరగా పరిస్థితి విషమించి చనిపోయినట్లు ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. ఈ విషయం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ లో తెలియజేయగా పట్టణ ఎస్ఐ స్వర్ణలత ఆసుపత్రికి చేరుకొని, ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా, మాకు, ఆమెకు, ఎటువంటి సంబంధం లేదని, నన్ను, మా నాన్నను వదిలేసి ఎక్కడికి వెళ్ళిపోయిందని, అందువల్ల మేము ఆమెకు అంతక్రియలు చేయబోమని కరాకండిగా ఆమె కుమారుడు చెప్పాడు. అనంతరం పట్టణ ఎస్ఐ స్వర్ణలత స్థానిక స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ మెట్టు గోవింద్ రెడ్డి కు సమాచారం అందించి, ఆ వృద్ధ మహిళకు అంతిమ సంస్కారాలు నిర్వహించాలని కోరారు. ఆయన వెంటనే స్పందించి తమ సభ్యుల సహకారంతో ఆ వృద్ధ మహిళ శవాన్ని పూడ్చి, అంత్యక్రియలు నిర్వహించారు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కండ్లకుంట అంగన్వాడి టీచర్ రుక్మిణి, ప్రభుత్వ ఉపాధ్యాయులు శివ సుందర ప్రసాద్, మహిమ సిల్క్ షోరూం వెంకటేశ్వర్లు, పైపుల కంపెనీ బాబు తదితర సభ్యులు పాల్గొన్నారు.

## మందేశ్వర స్వామి ఆలయానికి...

# రూ.3 లక్షల విరాళం

**స్టీల్ క్యూలైన్ల ఏర్పాటుకు దాతల ఆర్థిక సాయం**

**ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చేతులు మీదుగా విరాళం అందజేత**

**కోనసీమ/కొత్తపేట జూన్ 19 సూర్య న్యూస్:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మందపల్లి శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం స్టీల్ క్యూలైన్స్ ఏర్పాటు చేయడానికి దాతలు రూ.3,00,000/- విరాళంగా అందజేశారు.



ప్రముఖ వ్యాపార సంస్థ ఎం.ఎస్ ఇషి స్టీల్ రిసోర్సెస్ ఎల్ఎల్పి ప్రతినిధులు, గ్రంధి రాజేష్, రమా దంపతులు ఈ విరాళాన్ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చేతుల మీదుగా ఆలయ సహాయక కమిషనర్ దారపురెడ్డి సురేష్ బాబు కి అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ. స్వామి వారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు , దేవస్థానం అభివృద్ధికి ఈ విరాళం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఆలయాల అభివృద్ధిలో దాతలు భాగస్వాములు కావడం అభినందనీయమని కొనియాడారు.పెద్ద మనసుతో విరాళం అందించిన గ్రంధి రాజేష్, రమా దంపతులతో పాటు సంస్థ ప్రతినిధులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. సమాజంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు మరెంతో మందికి ఆదర్శంగా నిలుస్తాయని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, స్థానిక నాయకులు భక్తులు పాల్గొన్నారు.

## కావలి పరిధిలో ఎక్సైజ్ శాఖ

# మెరుపు దాడులు..!

**బెల్ట్ షాపులు- దాబాలపై నిఘా**

**కావలి /జలదంకి జూన్ 19 సూర్య న్యూస్:** మంగళగిరి ప్రొహిబిషన్ ఽ ఎక్సైజ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు, నెల్లూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీ పి. దయాసాగర్




గారి పర్యవేక్షణలో కావలి పరిధిలో ఎక్సైజ్ అధికారులు ముమ్మర దాడులు నిర్వహించారు. అనధికార మద్యం విక్రయాలు (బెల్ట్ షాపులు), ఎక్సైజ్ నేరాల నిర్మూలనకు గాను శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు కావలి ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి. వెంకటరావు తెలిపారు. ఇందులో భాగంగా జలదంకి మండలం బ్రాహ్మణక్రాక గ్రామం నుండి గుడ్లవేనపోవు రోడ్డులో ఎక్సైజ్ సిబ్బంది జరిపిన తనిఖీల్లో ఒక మహిళ వద్ద అక్రమంగా ఉంచిన 180 ఎం ఎల్ పరిమాణం గల ఏడు ఓల్డ్ అడ్మిరల్ ఫైన్ బ్రాందీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, ఆమెపై కావలి ఎక్సైజ్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అలాగే జలదంకి గ్రామ పొలిమేరలోని ఆర్.ఆర్. దాబా సమీపంలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న ఒక వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేయడం జరిగిందని సమాచారం... అనంతరం కావలి పరిధిలోని అన్ని దాబాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, దాబాల్లో మద్యం విక్రయించినా లేదా మద్యం సేవించడానికి అనుమతించినా యజమానులపై చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించారు. ఈ దాడుల్లో కావలి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ బి. వెంకటరావుతో పాటు, సబ్ ఇన్‌స్పెక్టర్ వి. ప్రసన్న కుమార్, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటర్ల నవీకరణ సద్వినియోగం చేసుకోండి

**టిడిపి క్లస్టర్ ఇంఛార్జ్ జన్ని మత్స్య రాజు దొర**

**హుకుంపేట జూన్ 19 సూర్య న్యూస్ :** మండలంలోని బి బొడ్డపుట్టు పంచాయతీ బొర్రా మామిడి గ్రామం లో ఈరోజు ఓటర్ల పరిశీలన జరిగింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఓటు హక్కు కలిగిన ప్రతి వ్యక్తి కి ఇది మంచి అవకాశం కల్పించింది. ఓటర్ల పరిశీలన గత 2002 లో జరిగింది.అప్పుడు నుంచి ఇప్పటి వరకు ఎంత మంది మైగ్రేషన్ లో ఉన్నారు ఎంత మంది డెత్ లు ఉన్నారు.ఎంత మందికి మార్పులు చేర్పులు ఉన్నాయి అలాగే ఎంత మంది కొత్తగా నమోదులు ఉన్నాయి అనేదే ఈ వాటర్ సవరణ అనే కార్యక్రమం .ఉదాహరణ 2002 పెళ్లి అయిన ఆడపడుచులు ఎక్కడో వెళ్లి పోతారు, ఓటర్ల ఐడి లు అక్కడ ఉండదు, వాళ్ళు ఓటు వేయడానికి అవకాశం ఉండదు, ఓటు కొల్పోయే ప్రమాదం ఉంది, కాబట్టి ఈ పరిశీలన ఎంతో ముఖ్యమైనది.ప్రతి వ్యక్తి కూడా



భవిష్యత్తులో ఓటు వేయడానికి అర్హులు కాబట్టి ప్రతి ఒక్కరూ కు కూడా సద్వినియోగం చేసుకోవాలని కూటమి పెద్దలు నరేంద్ర మోడీ సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఉప ముఖ్యమంత్రి శ్రీ కొనిదెల, పవన్ కళ్యాణ్ ఆదేశాలు మేరకు సార్ ఓటర్ల పరిశీలన వినియోగంచు కోవాలని జన్ని మత్స్య రాజు దొర తెలియజేసారు.ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ ఎంపీటీసీ పాడి బాల్లన్న మరియు ఉప సర్పంచ్ సురద,బోడన్న, బూత్ ఇంచార్జ్ వి, సాయికిరణ్ ,కో, కన్వీనర్ బి.పండన్న,బిఎల్ ఓ.జి.నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

సూర్య
జాతీయ తెలుగు దినపత్రిక
శనివారం 20 జూన్, 2026

# గోరంట్లలో అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమం

**గోరంట్ల జూన్ 19 సూర్య న్యూస్ :** పట్టణంలోని ఎస్సీ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం అంగన్వాడీ పిలుస్తోందికార్యక్రమంనిర్వహించారు.ఈ కార్యక్రమానికి సీడీపీఓ డాక్టర్ శాంతలక్ష్మి, సూపర్వైజర్ నాగరాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా పూర్వ ప్రాథమిక విద్య పూర్తి చేసిన చిన్నారులకు ప్రీ స్కూల్ పట్టాలను అందజేశారు. అలాగే మూడు సంవత్సరాలు పూర్తిచేసుకున్న చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్వాడీ చిన్నారులు పాటలు ఆటలు కథలతో ప్రదర్శనలు ఇచ్చి ఆకట్టుకున్నారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని సీడీపీఓ డాక్టర్ శాంతలక్ష్మి తెలిపారు. అనంతరం గోరంట్ల 5 అంగన్వాడీ కేంద్రంలో తల్లులతో సమావేశమై పోషకాహార సరుకుల పంపిణీ, వాటి నాణ్యతపై అభిప్రాయాలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని కృష్ణకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు మంజుల, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



### ఐదవ సెమిస్టర్ ఫలితాల్లో...

# కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

**కుప్పం టౌన్ జూన్ 19 సూర్య న్యూస్ :** శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విడుదల చేసిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. వివిధ కోర్సుల్లో విద్యార్థులు అత్యుత్తమ గ్రేడ్ పాయింట్లు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చారని కళాశాల చైర్‌పర్సన్ శాంతా నాగరాజ్ తెలిపారు. బీకాం (సీఏ) విభాగంలో ఎస్. ఉమ 9.09 పాయింట్లతో, ఎం. నమిత 8.92 పాయింట్లతో అగ్రస్థానాలు సాధించారు. బీఎస్సీ (కెమిస్ట్రీ)లో ఎం. స్వర్ణ 9.02 పాయింట్లు, ఆర్. పావని 8.83 పాయింట్లు సాధించారు. బీసీఏలో ఎం. ధరణి 8.68 పాయింట్లు, వి. హేమలత 8.45 పాయింట్లతో ప్రతిభ చాటారు. బీబీఏలో సి. హేమలత 8.51 పాయింట్లు, ఆర్. దేవవర్షిని 8.03 పాయింట్లు సాధించగా, బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్)లో జె. భరత్ 8.48 పాయింట్లు, జె. ఇమాన్ 8.19 పాయింట్లతో ఉత్తమ ఫలితాలు నమోదు చేశారు. అదేవిధంగా మేనేజీరియల్ అకౌంటింగ్‌లో ఒక విద్యార్థి, అడ్వాన్స్‌డ్ కార్పొరేట్ అకౌంటింగ్‌లో మరో విద్యార్థి 10కి 10 పాయింట్లు సాధించి విశేష ప్రతిభ కనబరిచారు.ఈ సందర్భంగా అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్‌పర్సన్ శాంతా నాగరాజ్, వైస్ చైర్మన్ సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ సుధారాణి అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



### రావులపాలెం ఎస్.డబ్ల్యు.పి.సి షెడ్‌ను

# పరిశీలించిన డి.ఎల్.డి.ఓ లింకన్

**కోనసీమ/రావులపాలెం జూన్ 19 సూర్య న్యూస్:** మండల కేంద్రంలోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం ఎస్ డబ్ల్యూ పిసి వేస్ట్ ప్రోసెసింగ్ సెంటర్ షెడ్‌ను శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయ డివిజనల్ లెవెల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డి ఎల్ డి ఓ లింకన్ సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా షెడ్‌లో తయారవుతున్న వర్మీ కంపోస్ట్ (ఎరువు) తయారీ విధానాన్ని ఆయన నిశితంగా పరిశీలించారు.ఈ సందర్భంగా డి.ఎల్.డి.ఓ లింకన్ మాట్లాడుతూ.చెత్త నుండి సంపద సృష్టించే ప్రక్రియలో వర్మీ కంపోస్ట్ తయారీ చాలా కీలకమైందని, దీనిని మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం వర్మీ కంపోస్ట్ నాణ్యత, పెంపకం తదితర అంశాలపై స్థానిక పంచాయతీ కార్యదర్శికి పలు కీలక సూచనలు సలహాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రమణ్యం, డిప్యూటీ ఎం.పి.డి.ఓ వీరేష్, రావులపాలెం పంచాయతీ కార్యదర్శి దుర్గ ప్రసాద్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.





### ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన

# ఎమ్మెల్యే కోరం కనకయ్య

**మహబూబాబాద్ జూన్ 19 సూర్య న్యూస్:** బయ్యారం మండల పర్యటనలో భాగంగా నారయణపురం గ్రామ పంచాయితిలోని రామచంద్రాపురం గ్రామంలో నిర్మాణం పూర్తి అయిన జవ్వాజి పద్మ, మిర్యాల పెంట గ్రామ పంచాయితి పరిధిలోని సాంబ తండా, చింతల తండా, మిర్యాలపెంట గ్రామాలలోని అజ్మీర సరోజ, కాయం వెంకటమ్మ, బోడ విజయ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి అవ్వడంతో లబ్ధిదారుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్య అతిధిగా హజరై లబ్ధిధారులతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల సమూహిక గృహ ప్రవేశం చేయించారు.ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిధారులను ఎమ్మెల్యే శాలువతో ఘనంగా సత్కరించి అభినందించారు.సాంబ తండా గ్రామంలో 5లక్షల రూపాయల వ్యయంతో నిర్మాణం చెపట్టనున్న అంతర్గత సిసి రోడ్డు నిర్మాణ పనులకు గ్రామస్థుల నడుమ భూమి పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడివో దీపిక,మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు,సొసైటి చైర్మెన్ మూల మధుకర్ రెడ్డి,హోసింగ్ ఏఇ ప్రియాంక,బానోత్ స్వామి,రాసమల్ల నాగేశ్వరరావు,సనప సొమేష్,కోయగూడెం సర్పంచ్ బానోత్ లింగా నాయక్,బయ్యారం గ్రామ నాయకులు గణేష్ తదితరులు పాల్గోన్నారు.



# అంతఃరాష్ట్ర గజదొంగతోపాటు మరో ముగ్గురు దొంగలు అరెస్టు

### 25 ఏళ్లుగా చోరీలకు పాల్పడుతున్న దొంగను పట్టుకుని బంగారు స్వాధీనం

### 16 కేసులలో రూ.14.50 లక్షలు విలువైన బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం...నగలు, సెల్ఫోన్లు, ఆటో స్వాధీనం

**శ్రీ సత్యసాయి జూన్ 19 సూర్య న్యూస్:** తాళాలు వేసిన ఇళ్లలో దొంగతనాలు చేస్తున్న అంతర్రాష్ట్ర గజదొంగతోపాటు మరో ముగ్గురు దొంగలను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో దొంగలను అరెస్టు చూపించారు. అనంతరం వన్ టౌన్ సీఐ రెడ్డెప్ప, రూరల్ సీఐ ప్రభాకర్లతో కలిసి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ దొంగతనాల వివరాలను వెల్లడించారు. పట్టణంలోని మహాత్మాగాంధీ కాలనీకి చెందిన మల్లెల వీరాంజనేయులు అలియాస్ వడ్డె రామంజినేయులు గత 25 ఏళ్లుగా చోరీలు చేస్తూ జీవిస్తున్నాడు. అదే కాలనీకి చెందిన సాకే నరసింహులు, దేవరకొండ విజయ్, గుజ్జల నారాయణమ్మలు ఒక ముఠాగా ఏర్పడి రాత్రివేళల్లో జనసంచారం తక్కువగా ఉండే ప్రాంతాలను లక్ష్యంగా ఎంచుకునేవారు. ముందుగా ద్విచక్రవాహనంలో రెక్కి నిర్వహించి తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకునేవారు. అర్ధరాత్రి 1గంట నుంచి 3గంటల మధ్యలో తాళాలు లేదా తలుపులు ధ్వంసం చేసి ఇళ్లలోకి ప్రవేశించి బంగారం, వెండి ఆభరణాలు, నగదు తదితర విలువైన వస్తువులను దొంగతనం చేసేవారు. దొంగతనం చేసిన బంగారు ఆభరణాలను ఫైనాన్స్ సంస్థల్లో తాకట్టు పెట్టి నగదుగా మార్చుకునేవారు. సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలు, ప్రత్యేక నిఘాతో దొంగలను ఆరెస్టు చేసి వారి వద్ద నుంచి ఒకఆటో, రూ.14.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని, ముత్తూట్ ఫైనాన్స్ లో తాకట్టు పెట్టిన రూ.17లక్షల విలువైన 13. తులాల బంగారు నగల రసీదులు, దొంగతనానికి ఉపయోగించిన ఆయుధాలు, నాలుగు సెల్ఫోన్లు, రూ.22వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.









**ప్రధాన నిందితుడు అంతఃరాష్ట్ర దొంగ...** ప్రధాన నిందితుడు మల్లెల వీరాంజనేయులుపై వివిధ పోలీస్టేషన్లలో ఆస్తి సంబంధిత కేసులు నమోదయ్యాయి. వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో సస్పెక్ట్ షీట్ నెం.749 కొనసాగుతోంది. గత 25 సంవత్సరాలుగా పాత నేరస్తులతో సంబంధాలు కొనసాగిస్తూ చోరీలకు పాల్పడుతున్న దొంగపై వన్ టౌన్, టూ టౌన్, రూరల్, కదిరి, ములకలచెరువు, ఎన్పీ కుంట, అనంతపురం వన్ టౌన్, టూ టౌన్, అనంతపురం రూరల్, కడప, పులివెందుల, రాయచోటి,ఆంధ్రప్రదేశ్లోని ఒంగోలు, కర్ణాటక రాష్ట్రంలోని మధుగిరి పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడ్డాడని. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మొత్తం 30 నుంచి 40 కేసులు నమోదైనట్లు ఎస్పీ తెలిపారు. సాకే నరసింహులుపై రౌడీషీట్ ఉందన్నారు. త్వరలో వీరిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని తెలిపారు.

**సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి-ఎస్పీ**

దొంగతనాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రతిఒక్కరూ ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ సూచించారు. ఇంటి తలుపులు, కిటికీలకు ఐరన్ గ్రిల్స్ వేయించుకోవాలని, అలారం వ్యవస్థలు అమర్చుకోవాలని సూచించారు. ప్రయాణాలు, కుటుంబ కార్యక్రమాలకు వెళ్లే సమయంలో సమీప పోలీస్ స్టేషన్ కు సమాచారం అందిస్తే లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎలాచ్ఎంఎస్) వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి వద్ద కెమెరాలను పోలీసులు ఏర్పాటు చేసి దొంగతనాలు జరగకుండా చూస్తామన్నారు. వేరే ప్రాంతాలకు వెళ్లే సమయంలో ఇంట్లోని నగదు, ఆభరణాలు సురక్షిత ప్రదేశాల్లో భద్రపరచాలని సూచించారు.

**దొంగలను పట్టుకున్న పోలీసులకు ప్రశంసలు:** వరుస దొంగతనాలకు పాల్పడుతున్న దొంగలను అరెస్టు చేయడంలో ప్రత్యేక చొరవ చూపిన రూరల్ సీఐ ప్రభాకర్, వన్ టౌన్ సీఐ రెడ్డెప్ప, ఎస్ఐలు రాజశేఖర్, ఉమాదేవి, వీరేష్, క్రైమ్ సీసీఎస్, ఎస్ఓజిటీ సిబ్బంది, ప్రత్యేక బృంద సభ్యులను ఎస్పీ అభినందించారు.

# క్రిష్ణగిరి మోడల్ స్కూల్లో ప్రవేశ పరీక్ష


**క్రిష్ణగిరి జూన్ 19 సూర్య న్యూస్** మోడల్ స్కూల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకుప్రవేశ పరీక్ష మోడల్ స్కూల్లో 6వ తరగతి నుండి 9వ తరగతి విద్యార్థులకు ఈనెల 24వ తేదీ నిర్వహించనున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ నిర్మల కుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూవిద్యార్థులు ఉదయం 9 గంటలకు పరీక్షా కేంద్రానికి హాజరు కావాలని నిర్ణీత సమయం తరువాత పరీక్ష కేంద్రానికి చేరుకునే విద్యార్థులకు పరీక్ష రాసేందుకు అనుమతి ఇవ్వబడదని స్పష్టం చేశారు.ప్రవేశ పరీక్షను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని పరీక్ష ఫలితాలను వారం రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు. అదేవిధంగా, పరీక్షకు హాజరు విద్యార్థులు తమ హాల్ టికెట్లు మరియు అవసరమైన పత్రాలు వెంట తీసుకురావాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ నిర్మల కుమారి తెలియజేశారు.




### రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న...

# కొత్తపేట సర్పంచ్- భూక్య ప్రవీణ్ నాయక్

**మహబూబాబాద్ జూన్ 19 సూర్య న్యూస్:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినోత్సవాన్ని గాంధీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు కొత్తపేట సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ హాజరయ్యారు.ఈ సందర్భంగా సీఎం సలహా దారు హనుమంతు రావు, ఫిషరీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సాయితో కలిసి ప్రవీణ్ నాయక్ విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా మనందరం పనిచేయాలని అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రవీణ్ నాయక్ రక్తదానం చేసి యువతకు ఆదర్శంగా నిలిచినందుకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రవీణ్ నాయక్ ని ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఆలోచనలను గ్రామస్థాయిలో అమలు చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.





# రైతులకు యూరియా ఇవ్వాల్సిందే..!

### వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి డిమాండ్


**నెల్లూరు జూన్ 19 సూర్య న్యూస్ :** జిల్లాలో రెండో పంట (ఎడగారు) సాగు ప్రారంభమై, వరి నాట్లు పూర్తయిన తరుణంలో జిల్లాలో తీవ్ర యూరియా కొరత వేధిస్తోందని, దీనివల్ల అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జూన్ 19, 2026న జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య, రూరల్ ఇంచార్జ్ ఆనం విజయ్ కుమార్ రెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు శివుని నరసింహ రెడ్డి, రైతు సంఘాల నాయకులతో కలిసి ఆయన నిరసన ర్యాలీ చేపట్టి, వ్యవసాయ అధికారిణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ వైఖరిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన కాకాణి, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను నేరుగా రైతుల ఇంటి ముంగిటకే సమృద్ధిగా అందించామని, ఎక్కడా కొరత లేకుండా చూశామని గుర్తుచేశారు. చంద్రబాబు ప్రభుత్వం కేవలం మాటల ప్రభుత్వమని, గతంలో ?1100 నుండి ?1200 ఉన్న కాంప్లెక్స్ ఎరువుల ధరలు ప్రస్తుతం ?2100 నుండి ?2400 కి చేరి రెట్టింపైనా ధరలను నియంత్రించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. మొదట ఎకరానికి ఒకటిన్నర బస్తా అని, ఆపై రెండు, తాము నిలదీశాక మూడు బస్తాలంటూ యూరియాపై పరిమితులు విధిస్తూ స్పష్టత లేకుండా వ్యవహరిస్తున్నారని, ఆ మూడు బస్తాలను కూడా టీడీపీ నాయకులు బ్లాక్ మార్కెట్‌కు తరలించుకుపోయి ?400 నుండి ?500 ల రెట్టింపు ధరలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. విదేశాల్లో ఉండే భూయజమానుల నుండి ఓటీపీలు రావాలంటూ తెచ్చిన కొత్త యాప్ విధానం వల్ల కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఆరోగ్య సమస్యలనే కుంటిసాకులు చెప్తూ గతంలో శ్రీలంక ఎదుర్కొన్న విపత్కర సేంద్రీయ విధానాలను బలవంతంగా రుద్దుతున్నారని విమర్శించారు. గతంలో 54 లక్షల మందికి రైతు భరోసా అందిస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం దాన్ని 47 లక్షల మందికి తగ్గించిందని, ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి రైతు అనుకూల నిర్ణయాలేవీ తీసుకోలేదని దుయ్యబట్టారు. రైతులు ఇబ్బందులు భరించలేక వ్యవసాయం మానేస్తే ఆ భూములను పరిశ్రమల పేరుతో తక్కువ ధరకు కొట్టేసి క్యాష్ చేసుకోవాలనే ఆలోచన ముఖ్యమంత్రికి, లోకేష్‌కు ఉందే తప్ప రైతు సంక్షేమం పట్టడం లేదని ఘాటుగా విమర్శించారు. జిల్లా కలెక్టర్, అధికారులు తక్షణమే స్పందించి రేపటి నుంచే యూరియా నిల్వలను పెంచి, బ్లాక్ మార్కెటింగ్‌ను నిరోధించి సక్రమంగా సరఫరా చేయాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని కాకాణి గోవర్ధన్ రెడ్డి హెచ్చరించారు.






# భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జూలై 1న అనంతపురం పర్యటన

### రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో సెంట్రల్ యూనివర్సిటీని సందర్శించిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఎస్పీ పీ.జగదీష్







**అనంతపురం జూన్ 19 సూర్యన్యూస్ :** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అనంతపురములోని 'జ్ఞాన సీమ' ప్రాంగణంలో నిర్వహించనున్న విశ్వవిద్యాలయ తొలి స్నాతకోత్సవ కార్యక్రమానికి జూలై 1న ముఖ్య అతిథిగా హాజరు కానున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (జఖూరా) అనంతపురము ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్.ఎ. కోరి గారితో కలిసి, సెంట్రల్ యూనివర్సిటీని శుక్రవారం సాయంత్రం సందర్శించి ఏర్పాట్లపై స్థల పరిశీలన చేసి అధికారులతో సమీక్షించించారు. పలు అంశాలపై జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ దిశా నిర్దేశం చేశారు.హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ ఐదు హెలిప్యాడ్ ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని, జియో కోఆర్డినేట్లు సత్వరమే పంపాలని జిల్లా కలెక్టర్ సూచించారు. స్నాతకోత్సవం జరిగే ప్రాంతాన్ని పరిశీలించి పలు అంశాలపై సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ మరియు తదితర అధికారులతో జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ చర్చించి పలు సూచనలు చేశారు.యూనివర్సిటీ రహదారి, సమీప ప్రదేశంలోని అంశాలపై చర్చించారు. యూనివర్సిటీ అవసరాలకు సరిపడా నీరు సరఫరా కొరకు ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులు ప్రత్యామ్నాయ మార్గంగా బోర్ వెల్ డ్రిల్లింగ్ కొరకు ప్రతిపాదనలు సత్వరమే సిద్ధం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అనంతపురము ఇంచార్జి ఆర్డీఓ రామ్మోహన్, రూరల్ డీఎస్పీ శ్రీనివాసులు, ఏపీ ఎస్పీడీసిఎల్, ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ కె.శ్రీనివాసులు, కలెక్టరేట్ కో ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి దేవి బుక్కరాయసముద్రం తహసీల్దార్ శ్రీధర్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు లక్ష తమలపాకుల- లక్ష పత్రార్చన
# పూజ కార్యక్రమం

**సంజీవరాయ ఆంజనేయ స్వామికి విశేష పూజలు**

**పులివెందుల జూన్ 19సూర్య న్యూస్ :** పట్టణ పరిధిలోని నూతన ఆర్టీసీ బస్టాండ్ సమీపాన, కొలువై ఉన్న సంజీవరాయ ఆంజనేయ స్వామి ఆలయం ప్రతిష్ట జరిగి 41



రోజుల మండల కాలం పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా శనివారం లక్ష తమలపాకుల- లక్ష పత్రార్చన పూజ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు ఈ సందర్భంగా పులివెందుల పట్టణ ప్రజలకు తెలియజేస్తూ జూన్ 20వ తేదీ శనివారం సాయంకాలం ఆరు గంటలకు నూతన బస్టాండ్ వద్ద కొలువై ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో లక్ష తమలపాకుల- లక్ష పత్రార్చన పూజ కార్యక్రమం స్వామివారికి చేయదలచినారు. ఈ పూజ కార్యక్రమాలలో 100 మంది వరకు పాల్గొనవచ్చునని, పూజ కార్యక్రమాలలో పాల్గొనదలచిన వారికి ఆలయం నిర్వాహకులు తమలపాకులు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ పూజ కార్యక్రమాలకు 516 రూపాయలు ఆలయం వారికి చెల్లించవలసి ఉంటుందని, ఈ పూజ కార్యక్రమాలలో పాల్గొనదలచిన వారు ఆలయం వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని వివరాల కోసం 7780115171 నెంబర్కు సంప్రదించవలెనని ఆలయ కమిటీ నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం భక్తిశ్రద్ధలతో హోమ పూజ పూర్ణాహుతి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొంది తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేశారు.

# రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**కుప్పం( టౌన్) జూన్ 19 సూర్య న్యూస్ :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 55వ జన్మదిన వేడుకలను కుప్పం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం



ఘనంగా నిర్వహించారు. కుప్పం పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు బాణాసంచా పేల్చి, కేక్ కట్ చేసి పరస్పరం పంచుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కుప్పం నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి గోపి మాట్లాడుతూ దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుప్పం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మునిస్వామి, కాంగ్రెస్ నాయకులు నిజాం, గుడిపల్లి మండల అధ్యక్షుడు కృష్ణప్ప, శాంతిపురం మండల అధ్యక్షుడు నంజప్ప, రామకుప్పం మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జన్మదిన వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు.

## ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్‌కు ఘన నివాళి

**యాడికి జూన్ 19 సూర్య న్యూస్:** ప్రముఖ సామాజిక సేవకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ వర్ధంతి సందర్భంగా యాడికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆయన



విగ్రహానికి ఘనంగా నివాళు లర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీతారామాంజనేయులు విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ సమాజ అభ్యున్నతి కోసం చేసిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. గ్రామీణాభివృద్ధి, విద్య, ఆరోగ్యం, వికలాంగుల సంక్షేమం వంటి రంగాల్లో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది సురేష్, శ్రీనివాస్ యాదవ్, రాజు, వారిస్, రాజశేఖర్ నాయుడు, నాగరాజు, సాంబశివారెడ్డి, చలపతి, సదాశివ శాస్త్రి, రామచంద్ర, శివ తదితరులు పాల్గొని ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్‌కు నివాళులర్పించారు.

## మంగంపేటలో అభివృద్ధి పనులపై ఉన్నతాధికారుల
# క్షేత్రస్థాయి పరిశీలన

**రైల్వే కోడూరు జూన్ 19 సూర్య న్యూస్:** నియోజకవర్గం లోని ఓబులవారిపల్లె మండలం మంగంపేట గ్రామ పంచాయతీ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన పలు



అభివృద్ధి పనులపై జిల్లా కమిషనర్ కార్యాలయానికి అందిన ఫిర్యాదుపై ఉన్నతాధికారులు స్పందించారు. గల్లా శ్రీనివాసులు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ శాఖల పరిధిలో జరిగిన పనుల నాణ్యతను పరిశీలించేందుకు ఉన్నత స్థాయి బృందం గ్రామాన్ని సందర్శించింది. పంచాయతీరాజ్ జేడీ కే.వి. సాంబశివారెడ్డి, పంచాయతీరాజ్ చీఫ్ ఇంజనీర్ విజయకుమారి నేతృత్వంలోని అధికారులు మంగంపేటలో పర్యటించి, గతంలో చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు స్థానిక గ్రామస్తులతో మాట్లాడి, పనుల తీరుపై వివరాలు సేకరించారు. పరిశీలన అనంతరం పంచాయతీరాజ్ జేడీ కే.వి. సాంబశివారెడ్డి మీడియాతో మాట్లాడుతూ... పనులలో నాణ్యత లోపాలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని, అయితే దీనిపై పూర్తిస్థాయి స్పష్టత కోసం క్వాలిటీ కంట్రోల్ నాణ్యత నియంత్రణ విభాగం ద్వారా మరిన్ని పరీక్షలు నిర్వహించాల్సి ఉందని తెలిపారు. సాంకేతిక నివేదికలు అందిన తర్వాత, నిబంధనల ప్రకారం తుది నివేదికను సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆహార పదార్థాలలో నాణ్యతను పాటించండి

**డాక్టర్ యువ అన్వేష్**







**తిరుపతి జూన్ 19సూర్య న్యూస్ :** ఆహార పదార్థాలలో నాణ్యతను పాటించాలని, లేని యెడల కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ హెచ్చరించారు. జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి సూచనలతో కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలోని మల్టీ నేషనల్ రెస్టారెంట్ల లో ఆహార నాణ్యత పై ఫుడ్ సేఫ్టీ అధికారి మద్దిలేటి, వెటర్నరీ అధికారి గుణశేఖర్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, పారిశుదధ్య సిబ్బందితో కలసి శుక్రవారం తనిఖీలు నిర్వహించామని తెలిపారు. నగరంలోని మల్టినేషనల్ రెస్టారెంట్ వ్యాపార సంస్థలైన దామినోస్ రెస్టారెంట్ బాలాజీ కాలనీ, దామినోస్ రెస్టారెంట్ రేణిగుంట రోడ్,దామినోస్ రెస్టారెంట్,తిరుమల బైపాస్ రోడ్డు,కె ఎఫ్ సి వి వి మహల్ రోడ్డు, బైపాస్ రోడ్ మెగడోనాల్డ్స్ రెస్టారెంట్ బైపాస్ రోడ్ మరియు సబ్వేరెస్టారెంట్ తిరుమల బైపాస్ రోడ్డు లను తిరుపతి ఫుడ్ సేఫ్టీఆఫీసర్, నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ వెటర్నటీ ఆఫీసర్ పారిశుద్ధ్య శాఖ సిబ్బంది కలిసి తనిఖీలు నిర్వహించడమైనది. ఇందులో మెగడోనాల్డ్స్ డ్స్ రేస్టారెంట్,డామినోస్ రెస్టారెంట్స్,సబ్వే రెస్టారెంట్ లు సరిఅయిన ప్రమాణలు పాటించుతూ ప్రజల వినియోగార్థం విక్రయించు ఆహార పదార్థాల వ్యాపారం సరిగా నిర్వహించడం పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోని వ్యాపారాన్ని చేయడం గమనించడమైనది కానీ వారివద్ద ఉత్పత్తి అయ్యే వ్యర్థలను సరిఅయిన పద్దతిలో తడి, పొడి, మరియూ ప్రమాధాకర వ్యరదాలు గా వేరుచేయకుండా సరిఅయిన డబ్బాలలో నిలువ చేయక పోవడం వలన ఇన్ సానిటరీ కండిషన్ లో ఉండుట,సాలిడ్ వెస్ట్ మానేజ్మెంట్ రూల్స్ పాటించక పోవడం జరిగినది. భవాని నగర్ కె ఎఫ్ సి రెస్టారెంట్, ఎయిర్ బైపాస్ రోడ్డు నందలి కె ఎఫ్ సి రెస్టారెంట్ లందు 17-6-2026 తేదీ బెంగుళూరు నుండి తెచ్చిన దాదాపు 684 కేజీల మరియూ 683 కేజీల చికెన్ సరిఅయిన రాక్ లలో ఉంచక రూమ్ ఫ్లోర్ పైన నిలువ చేసి అపరిశుభ్రమైన పరిస్థిలో చెడు వాసన వేస్తూ ఉండి ప్రజావినియోగము నకు నిరూపయోగముగా ఉన్నట్లు గమనించడం మైనది అదే రెండు కె ఎఫ్ సి,రెస్టారెంట్ లందు కొన్ని ఆహారప దార్ధాల ప్యాకింగ్ లపై ఎం ఆర్ డి,లేబల్స్ వేయలేదు స్టోర్ రూములు సరిఅయిన పద్దతిలో నిర్వహించక పోవడం, మరియూ వాటర్ టాప్స్ లీక్ అవ్వడంవలన స్టోర్ రూంవద్ద నీరు నిలిచి ఉండుట గమనించడమైనది. మిగిలిన ఢ్ష?మినోస్ రెస్టారెంట్ బాలాజీ కా లని, రేణిగుంట రోడ్డు, తిరుమల బైపాస్ రోడ్డు నందలి రెస్టారెంట్లు,సబ్ వే రెస్టారెంట్ పరిశుభ్రంగా ఉండుట గమనించడం మైనది మరియూ ఎయిర్ బైపాస్ రోడ్డు నందలి మెగాడోనాల్డ్స్ రెస్టారెంట్ నందు కూడా మంచి కండిషన్లో ప్రమాణలు పాటిస్తూ వ్యాపారం చేయడం గమనించడమైనది.కె ఫ్ సి,వారికి నోటీసులు జరిచేయడం జరిగినది మరియూ రెస్టారెంట్ లన్నింటికి సాలిడ్ వెస్ట్ మేనేజ్ మెంట్ రూల్స్ పాటించవలసిందిగా నోటీసులు జరిచేయడంజరిగినది.

## అంగరంగ వైభవంగా
# వినాయక చవితి వేడుకలు

**ఏడు రకాల హోమాలు, వనభోజనాల నిర్వహణ**

**యాడికి జూన్ 19 సూర్య న్యూస్:** మండల కేంద్రంలో ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని లోకకళ్యాణార్థం





వైభవోపేతంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించను న్నారు. ఈ సందర్భంగా శ్రీ సిద్ధి బుద్ధి వినాయక స్వామి కళ్యాణంతో పాటు గణపతి హోమం, సుదర్శన హోమం, గ్రామదేవత హోమం, వాసవి హోమం, నవగ్రహ హోమం తదితర ఏడు రకాల విశేష హోమాలు, జపాలు వేద పండితుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య యువజన సంఘ సభ్యులు జీఎస్టీ రవి, భూపాలం కేదార్, రాఘవ, నితిన్ సాయి తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సమాజ సేవలో భాగంగా 50 మంది ఆర్యవైశ్య మహిళలకు సాంప్రదాయబద్ధంగా వడిబియ్యం సమర్పించే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వినాయక నిమజ్జనం అనంతరం సుమారు 500 మందికి పైగా భక్తుల కోసం వనభోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యాడికి ఆర్యవైశ్య సంఘ సభ్యుల సహకారంతో నిర్వహించనున్న ఈ మహోత్సవాలకు రూ. 4 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు వ్యయం అవుతుందని, ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లకు కమిటీ ఆమోదం తెలిపిందని వెల్లడించారు. ఈ పవిత్ర కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సంఘ సభ్యులు, మహిళా సంఘ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## దేశం కోసం జీవితాన్ని
# త్యాగం చేసిన రాహుల్ గాంధీ

**నేటి తరం యువతకు ఆదర్శప్రాయం- సర్పంచ్ శాంతి కిషన్ నాయక్**

**మహబూబాబాద్ జూన్ 19 సూర్య న్యూస్:** బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్



అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో బయ్యారం సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ పాల్గొని కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం,సమ్మిళిత అభివృద్ధి విలువల పట్ల రాహుల్ గాంధీకి ఉన్న అంకితభావాన్ని అభిమానిస్తామన్నారు. ఈ సందర్భంగా నాయిని శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో ధైర్యం,నిబద్ధత అవసరమైన ఈ కాలంలో ఎన్నో సవాళ్లు ఎదురైనా తాను నమ్మిన సిద్ధాంతాల కోసం ఆయన నిలబడుతున్నారని,దేశం కోసం అసాధారణ త్యాగాలు చేసిన కుటుంబ వారసత్వాన్ని రాహుల్ గాంధీ వినయంతో,అంకితభావంతో మనందరం ముందుకు తీసుకెళ్దామన్నారు. రాహుల్ గాంధీకి మంచి ఆరోగ్యం,ఆనందం,శక్తి, ప్రజాసేవలో మరిన్ని విజయాలు కలగాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు రేలా ఆగిరెడ్డి, బయ్యారం మాజీ ఎంపీపీ కిషన్ నాయక్,ములుకురి వీరారెడ్డి,కొండ్రెడ్డి సోమిరెడ్డి,నందగిరి భద్రయ్య,వార్డు సభ్యురాలు బానోత్ సునీత,ప్రమోద్ రెడ్డి,మండ రేణుక,తాటి జనార్ధన్, కంకటి నారాయణ,పులి మల్లయ్య,పందిరి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# వాడపల్లి దేవస్థాన అభివృద్ధిపై ధర్మకర్తల మండలి విస్తృత చర్చ

**భక్తుల సౌకర్యాలే ప్రధాన లక్ష్యంగా ప్రణాళికలు... చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ సూర్య చక్రధరరావు**

**కోనసీమ/ఆత్రేయపురం జూన్ 19 సూర్య న్యూస్:** కోనసీమ తిరుమలగా భక్తుల విశేష ఆదరణ పొందుతున్న వాడపల్లి శ్రీ





వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ధర్మకర్తల మండలి సాధారణ సమావేశం శుక్రవారం ఘనంగా నిర్వహించబడింది. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్), డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆలయ సమగ్ర అభివృద్ధి, భక్తులకు మరింత మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా మండలి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది.

**ప్రధాన చర్చనీయాంశాలు-సమీక్ష:** సమావేశంలో ఆలయానికి సంబంధించిన పలు కీలక విషయాలపై సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు.

**మౌలిక వసతుల విస్తరణ:** ఆలయంలో ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనులు, భవిష్యత్తులో చేపట్టాల్సిన నూతన నిర్మాణాలు మరియు మౌలిక వసతుల కల్పనపై సమీక్షించారు.

**భక్తుల రద్దీ - ఏర్పాట్లు:** స్వామివారిని దర్శించుకునేందుకు నిత్యం పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శన ఏర్పాట్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, వాహన పార్కింగ్, వసతి సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని నిర్ణయించారు. ఆదాయ వృద్ధి -- కార్యాచరణ: దేవస్థాన ఆదాయ వృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, ఆలయ పరిసరాల సౌందర్యీకరణ, భక్తులకు అత్యుత్తమ సేవలు అందించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికలపై సభ్యులు తమ అమూల్యమైన అభిప్రాయాలను పంచుకున్నారు.

**సమిష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం:** దేవస్థాన అభ్యున్నతికి, భక్తుల సేవకు ధర్మకర్తల మండలి సభ్యులందరూ సమిష్టిగా కృషి చేయాలి. స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే ప్రతి భక్తుడు సంతృప్తిగా వెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం ముదునూరి వెంకటరాజు, ఆలయ చైర్మన్ అన్నారు.

**సౌకర్యాల కల్పనే మా ప్రాధాన్యత:** భక్తుల సౌకర్యాలే ప్రధాన లక్ష్యంగా దేవస్థానంలో అన్ని కార్యక్రమాలు చేపడుతున్నాం. రానున్న రోజుల్లో భక్తులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు, ఆలయ సమగ్ర అభివృద్ధికి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నాం. నల్లం సూర్య చక్రధరరావు, డిప్యూటీ కమిషనర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ధర్మకర్తల మండలి సభ్యులు గంగవరపు పద్మావతి, కాస చాముండేశ్వరి, కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్, పెండెం కుమారి, సలాది నాగేశ్వరావు, సరేళ్ల సరిత, ఏపుగంటి విజయకుమారి, చింతపల్లి సత్యనారాయణ, తమ్మన సాయిప్రసాద్, యల్లమిల్లి చంద్రకుమారి, కె. రామచంద్రరావు, సిస్ట సూర్య కుటుంబరావు, దాలిపర్తి శ్రీలక్ష్మి, మసకపల్లి సత్యనారాయణ, వాడపల్లి వెంకట సుందర శేషావతారంతో పాటు ఆలయ అధికారులు, సిబ్బంది హాజరై వివిధ అంశాలపై వివరాలు అందించారు.

సూర్య
జాతీయ తెలుగు దినపత్రిక
శనివారం 20 జూన్, 2026

### మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో...
# అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణ

**జూన్ 21న ఉదయం 7.30 గంటలకు యోగా కార్యక్రమాలు-ఎంపీడీవో అల్లా బకాష్**

**చిప్పగిరి జూన్ 19 సూర్య న్యూస్:** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా చిప్పగిరి మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఈ నెల 21వ తేదీ ఆదివారం



ఉదయం 7 గంటల 30 నిమిషాల నుంచి యోగా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అల్లా బకాష్ తెలిపారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అల్లా బకాష్ విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరంలో ఆయా గ్రామాల్లో యోగా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించిన ప్రదేశాల్లోనే ఈసారి కూడా యోగ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గ్రామ ప్రజలు, యువత, మహిళలు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. యోగా సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని ఎంపీడీవో పేర్కొన్నారు.

# రైతన్నల నిరీక్షణ ఇంకెన్నాళ్లు..!

**కలుషిత నీటిని తాగి కాలాన్ని వెళ్లదీస్తున్న రైతులు**

**పెడన జూన్ 19 సూర్య న్యూస్:** సద్ది అన్నం మూటగట్టుకుని ఆలినేమో వెంటబెట్టుకుని ఏరువాకను సాగించే రైతన్నలకు వ్యర్థాలతో కూడిన మురికి నీరుని తాగాల్సిన దౌర్భాగ్య



పరిస్థితి దాపురించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయం చేసే రైతన్నలకు పెద్దపీట వేస్తుంది. కానీ క్రింది స్థాయి అధికారులు నిర్లక్ష్యమో పాలకుల అలసత్వమో తెలియదు కానీ రైతన్నల పరిస్థితి ఏళ్ల తరబడి నిరీక్షణ కొనసాగుతూనే ఉంది. ఇది ఎక్కడో మారుమూల ప్రాంతం అనుకుంటే పొరపాటే మరి. సాక్షాత్తు జిల్లా కేంద్రమైన మచిలీపట్నానికి కూతవేటు దూరంలో ఉన్న పెడన మున్సిపాలిటీలో ఈ దౌర్భాగ్య పరిస్థితి దాపురించింది. వివరాల్లోకెళితే పట్టణానికి పడమర ప్రాంతానికి రామరాజుపాలెం ఛానల్ నుంచి బ్రహ్మపురం మీదుగా కొంకేపూడి, ఈదుమూడి గ్రామాలకు పంట కాలవ ఉంది. ఈ కాలువ కుడివైపు పెడన వెస్ట్ ఈస్ట్, ఎడమవైపు గూడూరు మండలం పోసినవారిపాలెం కప్పలదొడ్డి గ్రామాలలోని రైతుల పంట భూములకు సాగునీటిని అందిస్తోంది. ఈ కాలువ నుంచి దాదాపు 1200 ఎకరాలకు పైగా వ్యవసాయం సాగుతుంది. ఇటీవల తొలకరి పలకరించడంతో రైతన్నలు ఖరీఫ్ సాగు వైపు అడుగులు వేస్తున్నారు. అయితే ఈ కాలువ మున్సిపాలిటీ కి ఆనుకుని ఉండడంతో నివాస ప్రాంతాల్లోని వ్యర్థాలతో కూడిన డ్రైనేజీ మురుగునీటిని ఈ కాలువల్లోకి ప్రవహిస్తుంది. ముఖ్యంగా బ్రహ్మపురం లక్ష్మీ గణపతి నగర్ ఒకటవ వార్డు ప్రాంతాలలోని మురుగునీరు డ్రైనేజీల ద్వారా నేరుగా పంట కాలువలో చేరుతున్నాయి. దీనివలన సాగునీరు కూడా కలుషితం అవుతుంది వ్యవసాయ పనులను చేసుకునే రైతన్నలు పంటబోతుల్లో ఉండే ఈ కలుషిత నీటితోనే ముఖం కడుక్కోవడం చేతులు కాళ్ళను శుభ్రపరుచుకోవడం తోపాటు ఇంటి వద్ద నుంచి అన్నం, ఫలహారాలు తిన్న వెంటనే పంట బోదులలోని కలుషిత నీటిని తాగాల్సి వస్తుందంటూ రైతన్నలు వాపోతున్నారు వీటివలన రోగాల బారిన పడుతున్నామని పలువురు అధికారులకు విన్నవించిన ఫలితం లేదని ఆ ప్రాంత రైతులు చెబుతున్నారు రైతన్నల ప్రభుత్వం అని నాయకులు ,అధికారులు చేసే ప్రకటనలు తమ సమస్యలను కూడా పరిగణలోకి తీసుకొని పరిష్కరించే దిశగా ఆలోచన చేయాలని రైతన్నలు హితవు పలుకుతున్నారు ప్రస్తుతం పురపాలక సంఘ సభ్యుల పదవీకాలం పూర్తి కావడంతో ప్రత్యేక అధికారిగా ఆర్డీవో సాంబశివరావు పర్యవేక్షణలో మున్సిపల్ పరిపాలన సాగుతుంది ఇప్పటికైనా రైతన్నల గోడు వినిపించుకుని మురుగు నీటిని సాగునీటి కాలువలోకి రాకుండా అడ్డుకట్ట వేస్తారో లేక నిమ్మకుండిపోతారో అన్నది వేచి చూడాల్సిందే. ఈ విషయంపై మున్సిపల్ ఏఈ రామాంజనేయులు సూర్య న్యూస్ పలుమార్లు చరవాణిలో వివరణ కోరెందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.

### రైతులకు సకాలంలో...
# ఎరువులు అందించాలి

**సీపీఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు**

**మణుగూరుజూన్ 19 సూర్య న్యూస్:** ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని సీపీఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సిపిఎం




కార్యాలయంలో కామ్రేడ్ దామల్ల లెనిన్ బాబు అధ్యక్షతన మణుగూరు మండల కమిటీసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్రపల్లి మాట్లాడుతూ రైతులు సాగు పనులు ప్రారంభిస్తున్న ఈ సమయంలో యూరియా, డీఏపీ, పొటాష్, కాంప్లెక్స్ ఎరువులు సరిపడా నిల్వ ఉంచి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు అందించడంతో పాటు రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ ప్రక్రియను పటిష్టంగా నిర్వహించాలన్నారు. ఎరువుల కొరత కారణంగా రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి రాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు పంటల సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వ్యవసాయ అధికారులను గ్రామాల్లో అందుబాటులో ఉంచాలని కోరారు. వ్యవసాయ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్నందున రైతుల అవసరాలను ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకోవాలన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాల సరఫరాపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బొల్లం రాజు, మడి నరసింహారావు, పిట్టల నాగమణి, కుంజరాజు, తోట పద్మ, ఎం సుదర్శన్, తాటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న కాలు కదిలితేనే.. సమస్యల్లో కదలిక

**మాజీ మంత్రి ఆర్కేరోజా**

**నగరి జూన్19 సూర్య న్యూస్:** జగనన్న కాలు కదిలితేనే.. రాష్ట్రంలో ఏర్పడే సమస్యల్లో కదలిక వస్తోందని మాజీ మంత్రి ఆర్కే రోజా అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో సాయికృష్ణ కేసుకు సంబంధించి సీఐని సస్పెండ్ చేయడం ద్వారా ప్రభుత్వం తప్పు జరిగినట్లు అంగీకరించిందన్నారు. 'కోర్టు తీర్పు వెలువడకముందే పోలీస్ స్టేషన్‌ల్లోనే శిక్షలు అమలు అవుతున్నాయంటే దీని వెనుక ఎవరున్నారు? దీనిపై ప్రజలకు ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుంది? అని నిలదీశారు. అలాగే ఆక్వా రైతుల సమస్యలపై స్పందిస్తూ, ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హెచ్చరిక చేసిన తరువాతే ప్రభుత్వం స్పందించిందని ఫీడ్ యాజమాన్యాలతో చర్చలు జరిపేందుకు సిద్ధమైందన్నారు. 'జగనన్న కాలుకదపక పోతే రాష్ట్రంలో ప్రజల సమస్యలు పరిష్కారమయ్యేలా లేవన్నారు. ఆయన మాట్లాడకపోతే ఈ రాష్ట్రంలో రైతులు, సామాన్య ప్రజల సమస్యలను ప్రభుత్వం




పట్టించుకోరా?' అని ఆమె ప్రశ్నించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చొరవ చూపాలని, ప్రతిపక్షం ఒత్తిడి చేసిన తరువాత మాత్రమే స్పందించడం సరైన విధానం కాదని రోజా విమర్శించారు. సాయి కృష్ణ మరణం కస్టడీ హింస అనుమానాలకు తావిస్తోందని పోలీసు కస్టడీలో తమ బిడ్డ హింసకు గురయ్యాడని కుటుంబ సభ్యులు చెప్పడం చూస్తుంటే ఈ అంశం తీవ్ర ఆందోళన కలిగిస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన అరెస్ట్, నిర్బంధం, వైద్య పరీక్షలు, సీసీటీవీ దృశ్యాలు, పోస్టుమార్టం నివేదికలు తదితర అన్ని ఆధారాలను పరిశీలించి పూర్తి స్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. విజయవాడలో చోటుచేసుకున్న గడే సాయి కృష్ణ అనుమానాస్పద మరణం, పి.క్రాంతి కుమార్ ఆత్మహత్య ఘటనలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ తక్షణం జోక్యం చేసుకుని స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ చేపట్టాలని కోరారు.

# చిన్నారులు త్వరగా కోలుకోవాలి

**నా వంతు ఆర్థిక సహాయం... జనసేన పార్టీ నాయకులు నరేంద్ర దండి**

**శ్రీకాళహస్తి జూన్ 19 సూర్య న్యూస్ :** పట్టణంలో ఇటీవల వీచిన తీవ్ర గాలుల కారణంగా అమాయక చిన్నారులు గాయపడిన విషయం తెలుసుకుని ఎంతో బాధకు గురయ్యానని



జనసేన నాయకుడు నరేంద్ర దండి తెలిపారు. ఆ చిన్నారుల తండ్రి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుండి కేవలం కుటుంబ జీవనోపాధి కోసం ఇక్కడికి వచ్చి కష్టపడి పనిచేస్తున్న పరిస్థితిని చూసి తన హృదయం కలచివేసిందనీ ఆయన ఆర్థిక పరిస్థితిని ప్రత్యక్షంగా తెలుసుకున్నప్పుడు నిజంగా కంటతడి పెట్టానని,జనసేన పార్టీ తరపున నరేంద్ర దండి ఒక బాధ్యతగల పౌరుడిగా, మానవత్వంతో స్పందిస్తూ తన వంతు సహాయంగా రూ. 10,000/- (పది వేల రూపాయలు) హరీష్ కి ఫోన్ పే ద్వారా పే చేశాను. ఇది వారి కుటుంబానికి కొంతైనా ఊరటనివ్వగలదని ఆశిస్తున్నాను. చిన్నారుల మెరుగైన వైద్యం త్వరితగతిన కోలుకునేందుకు ఆసుపత్రిలో ఏ విధమైన సహాయం అవసరమైనా నేను అందుబాటులో ఉంటానని నరేంద్ర తెలియజేశారు.అవసరమైతే నా వంతు సహకారం పూర్తిగా అందిస్తానని అన్నారు, ప్రియమైన చిన్నారులారా, మీరు త్వరగా కోలుకుని ఆరోగ్యంగా తిరిగి రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. త్వరలోనే మిమ్మల్ని స్వయంగా పరామర్శిస్తానని తెలిపారు.ఆ స్వామి అమ్మవారు ఆశీస్సులతో మీరు త్వరగా కోలుకుని, సంతోషంగా ఇంటికి రావాలని, జనసేన పార్టీ యువ నాయకులు నరేంద్ర దండి కోరుకున్నారు.

# లోకధాలత్‌లో కేసుల పరిష్కారానికి కృషి

**నగరి జూన్19 సూర్య న్యూస్:** జూలై 11న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో రాజీ పడదగిన క్రిమినల్ కేసుల పరిష్కారం కోసం ప్రయత్నించాలని నగరి ఇన్‌చార్జి సివిల్ జడ్జి కె.రమ్యసాయి తెలిపారు. స్థానిక న్యాయస్థానంలో శుక్రవారం స్థానిక పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇరువర్గాల ఆమోదంతో న్యాయవ్యవస్థతో సమన్వయం చేసుకుని



పోలీసుశాఖ కూడా కేసుల పరిష్కారానికి సహకరించాలన్నారు. పార్టిసిపేట్స్ ప్రెసిడెంట్ చిరంజీవి, ఏపీపీ రామశాంతి, సీఐ మల్లికార్జున, ఎస్ఐ విజయ్‌నాయక్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

### గిడ్డంగివారిపల్లె గ్రామంలో...
# ఓటర్ల జాబితా ఇంటింటి సర్వే

**ఇంటింటికీ వెళ్లి ఓటరు సవరణ ఫారాలు పంపిణీ**

**వేంపల్లె జూన్ 19 సూర్య న్యూస్ :** ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని గిడ్డంగివారిపల్లె గ్రామంలో బిఎల్ఓ సానా వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా సవరణ ఫారాలను పంపిణీ చేశారు. గిడ్డంగి వారిపల్లె గ్రామ మాజీ సర్పంచ్ ఓబుళరెడ్డి పద్మనాభరెడ్డి కి ఫారం అందజేశారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పులకు సంబంధించి ప్రజల



నుంచి దరఖాస్తులు స్వీకరించారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని, డూప్లికేట్ ఓట్లు, మరణించిన వారి పేర్లు తొలగించేందుకు సహకరించాలని బిఎల్ఓ సానా వెంకట ప్రసాద్ కోరారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### ఉపాధి హామీతో...
# పండ్ల తోటలకు చేయూత..

**27 రకాల మొక్కల పంపిణీకి దరఖాస్తులు ప్రారంభం**

**ఉపాధి హామీతో ఉద్యానవన పంటల సాగుకు స్వర్ణావకాశం**

**ఉపాధి హామీ కార్యాలయంలోనే దరఖాస్తుల స్వీకరణ.. అవసరమైన పత్రాలతో రైతులు ముందుకు**

**రావాలి - ఏపీఓ (ఈసీ) మధుసూదన్ రెడ్డి**

**వేముల జూన్ 19సూర్య న్యూస్:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించేందుకు అర్హులైన రైతుల నుంచి



దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఉపాధి హామీ పథకం ఇంచార్జ్ ఏపీఓ (ఈసీ) మధుసూదన్ రెడ్డి తెలిపారు.రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు.ఈ పథకం కింద మామిడి,స్వీట్ ఆరెంజ్, బత్తాయి, నిమ్మ,సపోటా,జామ, సీతాఫలం, దానిమ్మ, ఉసిరి, కొబ్బరి, ఆయిల్ పామ్,కోకో, కరివేపాకు,డ్రాగన్ ఫ్రూట్,అత్తి,అవకాడో,బ్లాక్ పెప్పర్, పనస, అల్లనేరేడు, కాఫీ, ప్యాషన్ ఫ్రూట్,స్టార్ ఫ్రూట్, ఖర్జూరం,అంజీర్,మునగ,హెచ్‌డీ సపోటా,తమలపాకు తదితర పంటల మొక్కలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.ఆసక్తి కలిగిన రైతులు ఉపాధి హామీ కార్యాలయంలోనే దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.దరఖాస్తుతో పాటు రైతు ధృవీకరణ పత్రం, ఉపాధి హామీ జాబ్ కార్డు,ఆధార్ కార్డు,రేషన్ కార్డు,1-బి, భూమి పాస్‌పుస్తకం,బ్యాంకు పాస్‌పుస్తకం జిరాక్స్ ప్రతులను తప్పనిసరిగా జతచేయాలని పేర్కొన్నారు.ఉద్యానవన పంటల సాగు ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయం లభించడంతో పాటు భూముల ఉత్పాదకత పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని తమ భూముల్లో పండ్ల తోటలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.అర్హులైన రైతులు ఆలస్యం చేయకుండా అవసరమైన పత్రాలతో ఉపాధి హామీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని,పూర్తి వివరాల కోసం మండల ఉపాధి హామీ కార్యాలయాన్ని సంప్రదించాలని ఏపీఓ (ఈసీ) మధుసూదన్ రెడ్డి తెలిపారు.

### తల్లిదండ్రులు క్రమశిక్షణ పాటిస్తే...
# విద్యార్థులు పాటిస్తారు

**: డాక్టర్ శంకర్ శర్మ**

**కర్నూలు జూన్19సూర్య న్యూస్ :** ఒలంపిక్ డే రన్ సందర్భంగా జిల్లా ఒలంపిక్ సంఘం ఆధ్వర్యంలో అంతర్ పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. నగరంలోని అవుట్డోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ కబడ్డీ పోటీలను గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు శంకర్ శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. క్రీడల్లో పాల్గొంటే క్రమశిక్షణ వస్తుందన్నారు. ముఖ్యంగా ఇంట్లో తల్లిదండ్రులు మంచి అలవాట్లు కలిగి ఉంటే



విద్యార్థులు సైతం వాటిని ఆచరిస్తారని తెలిపారు. విద్యార్థులు సెల్ ఫోన్ కి అంకితం కాకుండా తల్లిదండ్రులు చూడాలని వారితో రీల్స్ చేయించకూడదని డాక్టర్. శంకర్ శర్మ సూచించారు. మంచి ఆహారం, పండ్లు తీసుకొని ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో నాగరత్నమయ్య, అవినాష్, సుబాకర్, కృష్ణ, మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైల క్షేత్రంలో వేదనాదం-హిందూ సామ్రాజ్య దినోత్సవ వేడుకల్లో వేద పఠన పోటీలు

**శ్రీశైలం(దేవస్థానం) జూన్ 19 సూర్య న్యూస్ :** నేడే జరగబోయే హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీశైల దేవస్థాన వేద పాఠశాలలో శుక్రవారం రోజున వేద పఠనం పోటీలను ఘనంగా నిర్వహించారు.విహెచ్‌పి ధర్మాచార్య విభాగం స్వామి శ్రీనివాసానంద కాళిదాసు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో వేద విద్యార్థులు తమ పాండిత్యాన్ని ప్రదర్శించారు. ఋగ్వేద, యజుర్వేద,సామవేద మంత్రాలను చిన్నారులు స్వర, ఉచ్చారణ శుద్ధితో గంభీరంగా పఠించి న్యాయనిర్ణేతలను ఆకట్టుకున్నారు.ఛత్రపతి శివాజీ





మహారాజ్ స్థాపించిన హిందూ సామ్రాజ్య వైభవాన్ని స్మరించుకుంటూ సాగిన ఈ కార్యక్రమం వేద సంస్కృతి గొప్పతనాన్ని చాటింది.ఈ సందర్భంగా విహెచ్‌పి ధర్మాచార్య విభాగం స్వామి శ్రీనివాసానంద కాళిదాసు మాట్లాడుతూ వేద రక్షణే దేశ రక్షణ. హిందూ సామ్రాజ్య దినోత్సవం స్ఫూర్తితో ప్రతి బాలబాలిక వేదాధ్యయనం చేయాలి ఛత్రపతి శివాజీ ఆశయాలను కొనసాగించడం మనందరి బాధ్యత వేద మంత్రాల తోనే భారత్ విశ్వగురువు అవుతుంది అని పిలుపునిచ్చారు. అధ్యాప కులు శివయ్య స్వామి, మాట్లాడుతూ ఇలాంటి పోటీల ద్వారా భావితరాల్లో ధార్మిక చైతన్యాన్ని నింపడమే మా సంకల్పం ఇది సనాతన ధర్మ పరిరక్షణ యజ్ఞం అని పేర్కొన్నారు.

EDITED PUBLISHED AND WONEDBY N.MAHESWARA REDDY PUBLISHED AT D.NO 1/171/2 DEVANAKONDA (M&POST) 518465, KURNOOL DIST, AP, PRINTED AT SRI LAKSHMI OFFSET PRINTERS AND PUBLICATIONS D.NO 1/171/2 DEVANAKONDA (M&POST)518465 KURNOOL DIST. CONTRACT CELL NO. 9010008143,RNI APTEL 2022/82194 Gmail :suryavelugutelugu daily@gmail.com

### ప్రభుత్వ వసతి గృహాలలో నెలకొన్న...

## విద్యార్థుల సమస్యలను పరిష్కారం చేయాలి

**హిందూపురంజూన్ 19సూర్య న్యూస్:** స్థానిక పట్టణంలో ఉన్న ఎస్సీ బీసీ ఏ ఎస్ లకు వినతి పత్రం ఇస్తున్న పి డి ఎస్ యు విద్యార్థి సంఘం నాయకులుఈ సందర్భంగా పి డి ఎస్ యు విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు బాబావలి మాట్లాడుతూ హిందూపురం డివిజన్ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థుల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇవ్వాల్సిన బెల్ షీట్లు ప్లేట్లు యూనిఫామ్ నోటుబుక్కులు తొందరగా అందించాలని డిమాండ్ చేశారు అద్దె భవనాలలో నడుపుతున్న ప్రభుత్వ వసతి గృహాలకు సొంత భవనాలను ఏర్పాటు చేయాలి ఖాళీగా ఉన్న ప్రభుత్వ హాస్టల్ వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలని హాస్టల్ విద్యార్థులకు పెండింగ్ లో ఉన్న మెస్ కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలని అదేవిధంగా నిత్యవసర ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు హాస్టల్ విద్యార్థుల సమస్యను పరిష్కారం కాకపోతే రాబోవు రోజుల్లో పెద్ద ఎత్తున విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు బాబావలి పట్టణ నాయకులు నాగేంద్ర, మహేష్, జనార్ధన్,హరికృష్ణ, నరసింహ,సురేష్ నందీష్, తదితరులు పాల్గొన్నారు.



### 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు

## ఓటు హక్కును పొందాలి

**హోళగుంద జూన్ 19 సూర్య న్యూస్:** మండలంలోని హోన్నూరు గ్రామంలో గల 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండాలని ఎల్ ఎల్ జి డి సి చైర్మన్ మిక్కిలినేని శివప్రసాద్ సోదరుడు టిడిపి యువ నాయకుడు మిక్కిలినేని శ్రీనివాసరావు మరియు మిక్కిలినేని రమేష్ లు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం గ్రామంలో బిఎల్ఓ లు , మరియు వీఆర్వో సురాంజనేయులుతో కలిసి గ్రామంలో పర్యటించి ఇంటింటి సర్వేలో పాల్గొన్నారు. అలాగే గ్రామంలోని ప్రతి ఒక్కరూ బి ఎల్ ఓ లు ఇంటి దగ్గరకు రాగానే ప్రతి ఒక్కరూ వారికి సహకరించి వారు అడిగిన వివరాలను తెలపాలన్నారు. అలాగే ఎస్ ఐ ఆర్ పై కూడా సమగ్రంగా అవగాహన కలిగి ఉండటంతో పాటు తమ నమోదును తూచా తప్పకుండా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటింటి సర్వే సిబ్బంది మరియు టిడిపి నాయకులు బిఎల్ఓ బిఎల్ఎ లు పాల్గొన్నారు.



### ముత్తూట్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో...

## విద్యార్థులకు స్టేషనరీ కిట్ల పంపిణీ

**పొదలకూరు, జూన్ 19 సూర్య న్యూస్:** సామాజిక బాధ్యత (జూ=) కార్యక్రమంలో భాగంగా పొదలకూరు ముత్తూట్ ఫైనాన్స్ సంస్థ ఆధ్వర్యంలో పట్టణం లోని నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులకు స్టేషనరీ కిట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులకు పెన్సిళ్లు, స్కేలు, షార్పనర్, ఎరైజర్,పెన్ను తదితర విద్యా సామగ్రితో కూడిన స్టేషనరీ కిట్లను అందజేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈకార్యక్రమంలో ముత్తూట్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్ ఆర్. రవికుమార్, అసిస్టెంట్ మేనేజర్ పి. రాజేష్, సిబ్బంది ఓ. శివకుమార్, ఎస్. శ్రీనివాసులు పాల్గొని విద్యార్థులకు కిట్లను అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ లక్ష్మీ దుర్గా ,ముత్తూట్ ఫైనాన్స్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేసింది



### రాచమల్లు చెన్నారెడ్డి అంత్యక్రియలు పూర్తిచేసిన

## యాడికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్

**యాడికి జూన్ 19 సూర్య న్యూస్:** నిట్టూరు కొత్తపల్లి గ్రామానికి చెందిన రాచమల్లు చెన్నారెడ్డి (85) గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ కన్నుమూశారు. ఆయన మృతితో గ్రామంలో నిశ్శబ్దం అలముకుంది. అయితే అంత్యక్రియల నిర్వహణ సమయంలో కొన్ని అనివార్య కారణాలు మరియు ఇబ్బందులు ఎదురుకావడంతో, మృతుడి బంధువులే స్వయంగా యాడికిలోని ప్రముఖ సామాజిక సేవా సంస్థ 'యాడికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్' ప్రతినిధులకు ఫోన్ చేసి సమాచారం అందించారు.సమాచారం అందిన వెంటనే సానుకూలంగా స్పందించిన ఫౌండేషన్ నిర్వాహకులు మరియు సభ్యులు యాడికి నుంచి నిట్టూరు కొత్తపల్లి గ్రామానికి చేరుకున్నారు. వృద్ధుడి మృతదేహానికి హిందూ సాంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లను ఫౌండేషన్ సభ్యులు దగ్గరుండి చూసుకున్నారు. 'యాడికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్' వారు అందిస్తున్న నిస్వార్థ సేవలను, వారి మానవతా దృక్పథాన్ని గుర్తించిన చెన్నారెడ్డి కుటుంబ సభ్యులు కూడా వారితో కలిసి నడిచారు. బసిరెడ్డి చెన్నారెడ్డి కోడలు రాచమల్లు లక్ష్మీదేవి, అలాగే కొడుకుల వరసయ్యే ఆలూరు రాకేష్ కుమార్ రెడ్డి, ఆలూరు పవన్ కుమార్ రెడ్డి లు ఫౌండేషన్ సభ్యులతో కలిసి భాగస్వాములయ్యారు. భౌతిక కాయాన్ని స్మశాన వాటికకు తరలించే క్రమంలో, వారు కూడా ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి పాడే మోసి అంతిమ సంస్కారాలను గౌరవప్రదంగా పూర్తి చేశారు.ఆపత్కాలంలో పిలవగానే వచ్చి కుటుంబ సభ్యులకు అండగా నిలిచి అంత్యక్రియలను పూర్తి చేసిన 'యాడికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్' సేవలను నిట్టూరు కొత్తపల్లి గ్రామస్తులు మరియు కుటుంబ సభ్యులు అభినందించారు. విపత్కర పరిస్థితుల్లో ఫౌండేషన్ చేస్తున్న ఇటువంటి సామాజిక కార్యక్రమాలు ఎందరికో ఆదర్శనీయమని స్థానికులు కొనియాడారు.ఈ అంత్యక్రియల కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు బండారు బాలకృష్ణ, ఆలూరు చంద్రశేఖర్ రెడ్డి , చందగాని ధ్రువనారాయణ, సాకరే శంకరప్ప, టీ లక్ష్మీకాంతమ్మ, కావలి సుధాకర్ (వెంకటాంపల్లి) తదితరులు పాల్గొన్నారు.



# నరసరావుపేటలో విజ్ మనీ 353వ శాఖ ప్రారంభం

**నరసరావుపేట జూన్ 19 సూర్య న్యూస్ :** ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ విజ్ మనీ తన 353వ శాఖను నరసరావుపేటలో శుక్రవారం ప్రారంభించింది. అరండల్ పేట,ఐడీబీఐ బ్యాంక్ పైన ఏర్పాటు చేసినఈ నూతన కార్యాలయాన్ని సంస్థ జోనల్ హెడ్, వైస్ ప్రెసిడెంట్ టి. శ్రీనివాస్ రెడ్డి, విజయవాడ రీజినల్ హెడ్ కె. వెంకట సుబ్బయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి బ్రాంచ్ మేనేజర్ జానీ భాష నేతృత్వం వహించారు.పట్టణ ప్రముఖులు, వినియోగదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.విజ్ మనీ సీఈఓ డైరెక్టర్ కృష్ణన్ ఆర్ మాట్లాడుతూ దేశంలో 353వ శాఖను, రాష్ట్రంలో 19వ శాఖను శుక్రవారం ప్రారంభించడం గర్వకారణమన్నారు. సామాన్య ప్రజలకు పారదర్శకమైన ఆర్థిక సేవలు అందించడమే లక్ష్యమని చెప్పారు.జోనల్ హెడ్ టి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ 352 శాఖల ద్వారా లక్షలాది మంది నమ్మకాన్ని గెలుచుకున్నామని, నరసరావుపేట ప్రజల అవసరాలకు తగ్గట్టు అన్ని అధునాతన వసతులు కల్పించామని తెలిపారు.బ్రాంచ్ మేనేజర్ జానీ భాష మాట్లాడుతూ తక్కువ వడ్డీకే గోల్డ్ లోన్స్, విదేశీ కరెన్సీ ఎక్స్ఛేంజ్, దేశీయ అంతర్జాతీయ మనీ ట్రాన్స్‌ఫర్స్, బిల్లు చెల్లింపులు, ఇన్సూరెన్స్, ట్రావెల్ ఌ హాలిడేస్ సేవలు ఒకే చోట అందిస్తామని వివరించారు.గతంలో యూనిమోనిగా ఉన్న ఈ సంస్థ ప్రస్తుతం విజ్ మనీ పేరుతో సేవలు అందిస్తోంది.






### ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీపై

## ఏబీవీపీ ఆగ్రహం

**బుక్స్, యూనిఫామ్ పేరుతో అదనపు వసూళ్లపై చర్యలు తీసుకోవాలి**

**జగ్గంపేట ఎంఈఓకు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ వినతిపత్రం**

**జగ్గంపేట జూన్19 సూర్య న్యూస్ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కాకినాడ జిల్లా జగ్గంపేట శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు, బుక్స్ మరియు యూనిఫామ్ పేరుతో అదనపు వసూళ్లు జరుగుతున్నాయని ఆరోపిస్తూ స్థానిక మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ)కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఏబీవీపీ భాగ్ కన్వీనర్ జస్వంత్ మాట్లాడుతూ మండలంలోని అనేక ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని విమర్శించారు. బుక్స్, యూనిఫామ్‌లు మరియు ఇతర అవసరాల పేరుతో అధిక మొత్తాలు వసూలు చేస్తూ ప్రభుత్వ మార్గదర్శకాలనుపట్టించుకోకుండావ్యవహరిస్తున్నారని ఆరోపించారు.ఇలాంటి అక్రమ వసూళ్లపై సంబంధిత అధికారులు వెంటనే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఫీజు నియంత్రణ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు, విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.డిమాండ్లపై స్పందన రాకపోతే రాష్ట్రవ్యాప్తంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఆందోళనలు, ఉద్యమాలు నిర్వహిస్తామని జస్వంత్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, పవన్ కుమార్, బాలకృష్ణతో పాటు పలువురు ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



### ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించడమే

## గ్రామపంచాయతీ లక్ష్యం

**- గ్రామ అభివృద్ధి అధికారి రాజశేఖర్ గౌడ్**

**హోళగుంద జూన్ 19 సూర్య న్యూస్:** మండల కేంద్రంలోని హోళగుంద గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా గ్రామపంచాయతీ పనిచేస్తుందని గ్రామాభివృద్ధి అధికారి ఆర్. రాజశేఖర్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండల ప్రత్యేక అధికారి ఆదేశాల మేరకు మండల కేంద్రంలో గల ఫిల్టర్ బెడ్ను పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే గత డిసెంబర్ నెల నుండి ఎల్ఎల్సీ కాలువ నుండి నీరు సరఫరా నిలిచిపోవడంతో సిడబ్ల్యూసి వాటర్ స్కీం ద్వారానే ప్రజలకు తాగునీటిని అందిస్తున్నామన్నారు. అయితే గ్రామంలో ప్రతి వీధిలో కూడా ఐదు రోజులకు ఒకసారి నీటిని విడుదల చేస్తున్నామని అందులోనూ మొదటి ఇంటి నుండి చివరి ఇంటి వరకు నీరు సరఫరా జరిగేలా చూస్తున్నామన్నారు. కావున ప్రజలు కూడా వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటిని పొదుపుగా వాడాలన్నారు. అలాగే తమ ఇంటి పరిసరాలను చేత పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## రెచ్చిపోతున్న ఇసుక మాఫియా..!

**తాళ్లపూడి జూన్ 19 సూర్య న్యూస్ :** మండలంలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, పట్టపగలే అక్రమ రవాణాకు పాల్పడుతోందనడానికి ఈ మధ్యకాలంలోనే సరైన బిల్లు లు లేకుండా లారీలు పట్టుబడడం ఉదాహరణ. దీనికి ప్రత్యక్ష సాక్ష్యం ఈ ఫోటో. ఫోటోలో కనిపిస్తున్న లారీని చూడండి. గుట్టలుగా ఇసుక నింపి, పైన కనీసం టార్పాలిన్ కూడా కప్ప కుండా రోడ్డుపై దూసుకెళ్తోంది. అంతేకాదు, లారీకి వెనుక నెంబర్ ప్లేట్ ఆనవాలు కూడా లేదు. అంటే దొరికిపోతామనే భయమా లేదంటే అధికారులంటే లెక్కలేదన్నమాట. ఇలా టార్పాలిన్ లేకుండా వెళ్తుండటంతో ఇసుక అంతా రోడ్డుపై పడి, వెనుక వచ్చే ద్విచక్ర వాహనదారులకు ప్రమాదకరంగా మారుతోంది. కళ్లలో ఇసుక పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఓవర్ లోడ్‌తో వెళ్తుండటంతో రోడ్లు కూడా దెబ్బతింటున్నాయి. నెంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్నారంటేనే ఇది 100% అక్రమ రవాణా అని స్పష్టం అవుతోంది. అధికారులు తనిఖీ చేసినా ఎవరిదో కనిపెట్టలేరు అనే ధీమాతోనే ఈ దందా సాగిస్తున్నారా? అని స్థానికుల ఆగ్రహం రోజూ ఇలాంటి లారీలు వెళ్తున్నాయి. కొన్నిటికి నెంబర్ ఉండదు, టార్పాలిన్ ఉండదని బయటకు రావాలంటేనే భయం వేస్తోందని అధికారులు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదు అని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మైనింగ్, పోలీస్, రెవెన్యూ శాఖలు మేల్కొని, ఈ ఫోటోను ఆధారంగా చేసుకుని విచారణ జరిపి, అక్రమ రవాణాకు పాల్పడుతున్న లారీ యజమానులు, డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### ఓటర్ల జాబితాలో అక్రమాలపై...

## అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత బిఎల్ఎ లదే - ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి**

**ఆలూరు జూన్ 19సూర్య న్యూస్ :** ఓటర్ల జాబితాలో అక్రమాలపై వైసిపి కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత కూడా బిఎల్ఏ లదేనని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని హొలగుంద, నేరనికి, తండా, కొత్తపేట, ఎల్లార్తి, చిన్నహేట, పెద్దహేట, సమ్మతగేరి, కోగిలతోట, ముద్దటమాగి తదితర గ్రామాలలో వైసిపి బిఎల్ఎ లకు ఎస్ఐఆర్ పై సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియను అడ్డం పెట్టుకుని అధికార పార్టీ ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసే కుట్రలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. ఓటర్ల హక్కులను కాపాడటం ప్రతిబిఎల్ఏ బాధ్యత అని తెలిపారు. పార్టీకి సంబంధించిన వైసీపీ బిఎల్ఏలు ఓటర్ల ప్రత్యేక సవరణ ప్రక్రియపై ఎన్నికల వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసే ఏ ప్రయత్నాన్నైనా క్షేత్రస్థాయిలో అడ్డుకోవాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. ప్రత్యేక సవరణ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించటం అనర్హులను చేర్చటం మ్యాపింగ్ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడటం వంటి చర్యలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బూతు పరిధిలో ఓటర్ల జాబితాను నిశితంగా పరిశీలించి ఎలాంటి అక్రమాలు జరిగినా వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని బిఎల్ఎ లకు సూచించారు. వైసిపి హయాంలో ఎన్నికల వ్యవస్థను పారదర్శకంగా నిర్వహించిన విషయాన్ని గుర్తు చేస్తూ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో పాటు ప్రజాస్వామ్య వ్యవస్థలను కూడా బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు. అవునా బిఎల్ఎ లో ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ షఫీవుల, కో కన్వీనర్ లక్ష్మన్న, ఎంపీపీ తనయుడు ఈసా, వైస్ ఎంపీపీలు కెంచప్ప,హనుమప్ప, ఎంపీటీసీలు ప్రజాప్రతినిధులు సర్పంచులు బూత్ లెవెల్ ఏజెంట్లు క్లస్టర్ ఇన్చార్జీలు కోక్లస్టర్ ఇంఛార్జిలు బివిఆర్ అభిమానులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.






### మండలంలో జోరుగా సాగుతున్న

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమం

**తాళ్లపూడి జూన్ 19 సూర్య న్యూస్ :** మండలంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమం జోరుగా సాగుతోంది. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాలతో బీఎల్ఓలు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ తిరుగుతూ ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తూవివరాలు సేకరిస్తున్నారు. అయితే అసలు సమస్య ఇక్కడే ఉంది, క్షేత్రస్థాయిలో ఓటర్లను గుర్తించడంలో కీలకమైన నాయకులు, కూటమి బూత్ లెవెల్ ఏజెంట్లు మాత్రం ఈ కార్యక్రమానికి సహకరించడం లేదు. "మాకు సంబంధం లేదు" అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. స్థానికంగా ఎవరెవరు ఉన్నారు, కొత్తగా ఎవరు వచ్చారు, ఎవరు మరణించారు అనే పూర్తి వివరాలు స్థానికంగా ఉన్న బూత్ ఏజెంట్లకు మాత్రమే తెలుసు వారి సహకారం లేకపోవడంతో బీఎల్ఓలు ఒంటరిగా ఇబ్బంది పడుతున్న తరుణం. ఉదయం నుండి రాత్రి వరకు ఉద్యోగస్తులు తిరుగుతున్నా కానీ స్థానిక బూత్ ఏజెంట్లు మాకు సహకరిస్తే 10 నిమిషాల్లో అయిపోయే పని 2 గంటలు పడుతోందట, నాయకులు ఒక్క ఫోన్ చేసినా చాలు, ప్రజలంతా సహకరిస్తారు. కానీ ఎవరూ ముందుకు రావడం లేదని వారి ఆవేదన, "త్వరితగతిన (సర్) పూర్తి చేయండి" అంటూ అధికారులు, సిబ్బందిపైనే ఒత్తిడి తెస్తోంది. కానీ స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు మాత్రం బీఎల్ఓలకు కనీస సహకారం అందించడం లేదనేది వాస్తవం. ఉద్యోగస్తులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నా, స్థానిక సహకారం లేకపోవడంతో గడువులోపు పూర్తి చేయడం కష్టంగా మారొచ్చు అనే సంకేతాలు వినబడుతున్నాయి. అర్హులైన కొంతమంది పేర్లు మిస్ అయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా బూత్ లెవెల్ ఏజెంట్లు, కూటమి నాయకులు, స్పందించి, బీఎల్ఓలతో కలిసి పనిచేస్తేనే (సర్) కార్యక్రమం 100% విజయవంతం అవుతుంది. లేకపోతే కష్టపడేది ఉద్యోగులు, నష్టపోయేది ప్రజలు.సిబ్బంది చిత్తశుద్ధి ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం (సర్) కి ఆటంకం. కేంద్రం మరియు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు బూత్ లెవెల్ ఏజెంట్లు అనుకున్న రీతిలో సహకరించకపోవడంతో (సర్) నీరు గారే ప్రమాదం ఉందని నిపుణులు అంటున్నారు.



సూర్య
జాతీయ తెలుగు దినపత్రిక

శనివారం 20 జూన్, 2026

### ఆర్జీయూకేటీ ఆర్కే వ్యాలీలో తొలి...

## ముగ్గురు టాపర్లకు అడ్మిషన్లు

**వేంపల్లె జూన్ 19 సూర్య న్యూస్:** రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లో యూజీ-2026 ప్రవేశాల కౌన్సిలింగ్ శుక్రవారం



ప్రారంభమైంది. క్యాంపస్ లోని సెంట్రల్ లైబ్రరీలో ఉదయం 8 గంటలకు ప్రారంభమైన కౌన్సిలింగ్‌లో రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రాధాన్యత క్రమంలో సీట్లు కేటాయించారు. తొలి రోజు కౌన్సిలింగ్‌లోనే రాష్ట్ర స్థాయిలో టాప్ ర్యాంకులు సాధించిన ముగ్గురు విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. చిట్టా ఆదిమూర్తి కుమారుడు చిట్టా లక్ష్మీ నివాస్, బొమ్మతోటి నాగేంద్ర వర ప్రసాద్ బాబు కుమార్తె బొమ్మతోటి దీపిక, రామగౌని నారాయణ స్వామి కుమార్తె రామగౌని హారిక తమ అడ్మిషన్లను ఖరారు చేసుకున్నారు. అడ్మిషన్ ప్రక్రియలో భాగంగా విద్యార్థుల ధ్రువపత్రాలను అధికారులు పరిశీలించి, డాక్యుమెంట్ వెరిఫికేషన్ పూర్తి చేశారు. అనంతరం విద్యార్థులు హాస్టళ్లలో రిపోర్ట్ చేశారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఈ విద్యార్థులు ప్రతిభతో ఆర్జీయూకేటీలో సీటు సాధించడం పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

### ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీపై...

## మండిపడ్డ పీడీఎస్‌యూ విజృంభణ

**అధిక ఫీజులు, పుస్తకాల పేరుతో అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**లేకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమాలకు హెచ్చరిక**

**జగ్గంపేట జూన్ 19 సూర్య న్యూస్:** రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ, పాఠ్యపుస్తకాల పేరుతో జరుగుతున్న అధిక వసూళ్లను అరికట్టడంలో ప్రభుత్వం



విఫలమైందని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ విజృంభణ) రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్ విమర్శించారు. కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం గ్రామపంచాయతీ పరిధిలోని రంగవల్లి నగర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చుకున్న కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు తల్లిదండ్రుల నుంచి భారీ మొత్తాల్లో ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా పాఠశాలలను నిర్వహిస్తూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న సంస్థలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం లేదనిఅన్నారు. రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు ఉండే పాఠ్యపుస్తకాలను రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు విక్రయిస్తూ తల్లిదండ్రులపై అదనపు భారం మోపుతున్నారని పేర్కొన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఇలాంటి వ్యాపారధోరణులు పెరుగుతున్నాయని విమర్శించారు. విద్యా హక్కు చట్టాన్ని సమర్థంగా అమలు చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఫీజుల నియంత్రణ, పుస్తకాల విక్రయాల్లో పారదర్శకత తీసుకురావడంలో విఫలమైందని ఆయన అన్నారు. పెరుగుతున్న జీవన వ్యయాల మధ్య విద్యా ఖర్చులు కూడా భారంగా మారి సామాన్య కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ, పుస్తకాల పేరుతో జరుగుతున్న అక్రమ వసూళ్లపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే విద్యార్థి సంఘాలఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలుచేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డాన్ శ్రీను, వెంకట్, శ్రావణి, దేవి తదితరులు పాల్గొన్నారు.

### ఆలస్యంగా మొదలై.. ఆసక్తి లేకుండానే

## ముగిసిన మండల సర్వసభ్య సమావేశం


**గోరంట్ల, జూన్ 19 సూర్య న్యూస్:** మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం ఆలస్యంగా




ప్రారంభమై... ప్రజా సమస్యలపై ఆశించిన స్థాయిలో సమస్యల ప్రస్తావన లేకుండానే ముగిసింది. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశానికి కోరం సభ్యులు తగిన సంఖ్యలో హాజరుకాక పోవడంతో అధికారులు ప్రజాప్రతినిధులు గంటల సేపు నిరీక్షించాల్సి వచ్చింది. తరువాత సభ్యులు హాజరుకావడంతో సమావేశాన్ని ప్రారంభించినప్పటికీ మండలంలోని ప్రధాన సమస్యలు అభివృద్ధి పనులు ప్రజలకు సంబంధించిన అంశాలపై విస్తృత చర్చ జరగలేదు. ప్రజా సమస్యలకు పరిష్కారాలు చూపాల్సిన సర్వసభ్య సమావేశం ఆశించిన ఫలితాలు ఇవ్వకపోవడంతో పలువురు సభ్యులు నిరాశ వ్యక్తం చేశారు. సమస్యలపై గంభీరమైన చర్చలు స్పష్టమైన నిర్ణయాలు లేకపోవడంతో సమావేశం చప్పిడి సమావేశంగా సాగిందనే విమర్శలు వినిపించాయి. ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక కావాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక ఆలస్యంగా ప్రారంభమవడమే కాకుండా, సమస్యలపై సమగ్ర చర్చలు, శాఖల వారీ సమీక్షలు లేకుండానే ముగిసింది. దీంతో సమావేశం పేరు కోసం నిర్వహించినట్లే ఉందని పలువురు సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

## మినీ ట్రక్ ఢీకొని వ్యక్తి మృతి

**సీతారామపురం జూన్ 19 సూర్య న్యూస్:** మండలంలోని బోడ సిద్దాయ పల్లి గ్రామం వద్ద శుక్రవారం ఉదయం రోడ్డు దాటుతుండగా మహేంద్ర మినీ ట్రక్ ఢీకొని వ్యక్తి మృతి







చెందిన ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు బోడ సిద్దయ్య పల్లి గ్రామానికి చెందిన నాగరాజు(42) అనే వ్యక్తి రోడ్డు దాటుతుండగా అదే సమయానికి సిఎస్ పురం నుండి మైదుకూరుకు వెళ్తున్న మహేంద్ర మినీ ట్రక్ నాగరాజు ను వెనుక నుండి ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయం అయింది. వెంటనే 108 అంబులెన్స్ లో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం ఉదయగిరి ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారని తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై వెంకట రాజేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని వాహనాన్ని అదుపులో తీసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

### సరిహద్దులు చెరిపిన ప్రేమ నరసరావుపేటకు చెందిన...

# వెంకటేశ్వర్లను ప్రేమ వివాహం చేసుకున్న జర్మని యువతి

**నరసరావుపేట జూన్ 19 సూర్య న్యూస్ :** ప్రేమకు హద్దులు లేవని నిరూపిస్తూ నరసరావుపేటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి







వెంకటేశ్వర్లు జర్మనీకి చెందిన యువతిని శుక్రవారం వివాహం చేసుకున్నాడు. స్థానిక ప్రైవేట్ కళ్యాణ మండపంలో ఈ వివాహం తెలుగు సంప్రదాయ క్రిస్టియన్ పద్ధతిలో అత్యంత వైభవంగా జరిగింది. వివరాల్లోకి వెళితే, నకరికల్లు మండలం దేచవరం గ్రామానికి చెందిన చెందిన వెంకటేశ్వర్లు ఉద్యోగ రీత్యా జర్మనీ నగరానికి వెళ్లాడు. అక్కడ ఓఆపిల్ కంపెనీలో పనిచేస్తున్న సమయంలో సహోద్యోగి అయిన జర్మనీ యువతితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం స్నేహంగా, స్నేహం ప్రేమగా మారింది. విషయాన్ని ఇరువురూ తమ కుటుంబ సభ్యులకు తెలపగా, వారు కూడా సుముఖత వ్యక్తం చేశారు. దీంతో పెళ్లి వేడుకను వరుడి స్వస్థలం నరసరావుపేటలో నిర్ణయించారు. ఈ మేరకు వధువు తల్లిదండ్రులు, సన్నిహితులతో కలిసి వారం రోజుల ముందే నరసరావుపేటకు చేరుకున్నారు . శుక్రవారం ఉదయం వేడుక మొదలైంది. వెంకటేశ్వర్లు క్రిస్టియన్ సంప్రదాయ ప్రకారం వధువు మెడలో మూడు ముళ్లు వేశాడు. పట్టు చీర, బంగారు ఆభరణాలతో తెలుగు కోడలిలా మెరిసిపోయిన జర్మనీ వధువు అందరినీ ఆకట్టుకుంది. వధువు తల్లిదండ్రులు మాట్లాడుతూ భారతీయ వివాహ సంప్రదాయం చాలా గొప్పగా ఉందని, ఇక్కడి ఆతిథ్యం మర్చిపోలేనిదని సంతోషం వ్యక్తం చేశారు. ఈ వివాహానికి పట్టణ ప్రముఖులు, బంధుమిత్రులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహం అనంతరం ఏర్పాటు చేసిన విందులో తెలుగు వంటకాలను జర్మనీ బంధువులు ఆస్వాదించారు.

## పేకాట తావులపై పోలీసుల దాడి

**పది మంది అరెస్ట్, రూ.15,820 నగదు స్వాధీనం**

**గంగవరం జూన్ 19 సూర్య న్యూస్:** గంగవరం పోలీసు స్టేషన్ పరిధిలోని చిన్నంపాలెం గ్రామ శివారున రహస్యంగా పేకాట ఆడుతున్న ముఠాపై పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో పది మందిని అదుపులోకి తీసుకోగా, వారి వద్ద నుంచి రూ.15,820 నగదును సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలవరం జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ ఆదేశాల మేరకు, రంపచోడవరం డీఎస్పీ పి . అష్రఫ్ అలీ పర్యవేక్షణలో జూదగాళ్లపై నిఘా ఉంచారు. ఇందులో భాగంగా నిన్న గురువారం రాత్రి సమయంలో గంగవరం ఏఎస్ఐ వీర్రాజు మరియు పోలీసు సిబ్బందితో కలిసి చిన్నంపాలెం గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అక్కడ గుంపుగా చేరి పేకాట ఆడుతున్న పది మంది వ్యక్తులను పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుండి రూ.15,820 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై గంగవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

### పదోన్నతితో వీడ్కోలు - ఏపీఎం పి.సన్యాసిరావుకు

## ఘన సన్మానం

**రైతు కుటుంబం నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన సన్యాసిరావు ప్రయాణం స్ఫూర్తిదాయకం**

**గండేపల్లి మండలాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపిన అధికారిగా ప్రశంసలు**

**గండేపల్లి జూన్19సూర్య న్యూస్:** మండల మహిళా సమాఖ్యలో ఏపీఎం పి. సన్యాసిరావుకు పదోన్నతి లభించిన సందర్భంగా మండల సమాఖ్య ప్రతినిధులు, సీసీలు,





వీఓఏలు కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా పి. సన్యాసిరావు మాట్లాడుతూ తాను సాధారణ రైతు కుటుంబానికి చెందినవాడినని, 2002లో మారేడుమిల్లిలో సీసీగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం 2007లో ఏపీఎంగా పదోన్నతి పొంది జగ్గంపేట, ఏలేశ్వరం ప్రాంతాల్లో బాధ్యతలు నిర్వర్తించానని, 2022లో గండేపల్లిలో ఏపీఎంగా చేరి సేవలందించినట్లు చెప్పారు. ఇప్పుడు డీపీఎంగా పదోన్నతి రావడం తనకు ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు. మండల సమాఖ్య ప్రతినిధులు మాట్లాడుతూ సన్యాసిరావు బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి గండేపల్లి మండలం జిల్లా స్థాయిలో పలు కార్యక్రమాల్లో ముందంజలో నిలిచిందన్నారు. ముఖ్యంగా రికవరీల విషయంలో 100 శాతం లక్ష్యాన్ని సాధించడం ఆయన నాయకత్వానికి నిదర్శనమని కొనియాడారు. కార్యక్రమంలో మండల సమాఖ్య సిబ్బంది, ఎంఎస్ ఓబీలు, సీసీలు, వీఓఏలు పాల్గొని సన్యాసిరావుకు ఘనంగా సన్మానం చేసి పదోన్నతికి అభినందనలు తెలిపారు.

### గరుగువీధిలో ఇంటింటి

## ఓటర్ వెరిఫికేషన్

**233 బీఎల్ఓ ఆధ్వర్యంలో సర్వే : జడ్పీటీసీ రవి కుమార్ రెడ్డికి ఫారం అందజేత**

**వేంపల్లె జూన్ 19 సూర్య న్యూస్ :** పట్టణంలోని గరుగువీధిలో ఓటర్ జాబితా ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని బీఎల్ఓ-233 మేరీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఓటర్ల వెరిఫికేషన్‌లో



భాగంగా జడ్పీటీసీ మాచిరెడ్డి రవి కుమార్ రెడ్డికి ఫారం అందజేసి వివరాలు నమోదు చేశారు. ఓటర్ జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు చేర్పుల కోసం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ ఇంటింటి సర్వే జరుగుతోంది. ప్రతి ఓటరు వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తప్పులు లేకుండా జాబితాను పకడ్బందీగా రూపొందించడమే లక్ష్యంగా బీఎల్ఓలు పనిచేస్తున్నారు. ఓటర్లందరూ తమ వివరాలను సరిచూసుకొని ఏవైనా తప్పులు ఉంటే బీఎల్ఓ దృష్టికి తీసుకురావాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మాజీ వార్డు మెంబర్ వి.వి. రత్నం, దస్తగిరి, రసూల్ తదితరులు పాల్గొని బీఎల్ఓకు సహకరించారు.

## ఎన్టీఆర్ ట్రస్ట్ ఉచిత వైద్య శిబిరం..

**పేద ప్రజలకు అండగా వైద్య సేవలు**

**గంగవరం జూన్ 19 సూర్య న్యూస్:** మొహనాపురం పంచాయతీ పరిధిలోని మొహనాపురం గ్రామంలో శుక్రవారం నాడు ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం అత్యంత విజయవంతంగా నిర్వహించబడింది.





ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోలేని మారుమూల, లోపలి గ్రామాల పేద ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడమే ధ్యేయంగా ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్‌పర్సన్ నారా భువనేశ్వరి ఆదేశాల మేరకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ట్రస్ట్ నిర్వాహకులు శ్రీకాంత్, కందుల సాయి, మరియు కుంజం రామకృష్ణ దొరల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. మండలంలో ఈ నెల షెడ్యూల్ ప్రకారం మొత్తం 7 గ్రామాలలో ఈ ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించనున్నారు. డాక్టర్ తీగల ప్రభ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు మొహనాపురం గ్రామంలో జరిగిన ఈ శిబిరానికి మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతో మేలు చేకూరుస్తాయని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ?ఈ ఉచిత వైద్య శిబిరంలో గ్రామ పెద్దలు మరియు వైద్య సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులకు పూర్వ అభ్యాస శిక్షణ

**ఉదయగిరి జూన్ 19సూర్య న్యూస్:** వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయం చేపట్టి తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు సాధించేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యేక పూర్వభ్యస శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొని చిరుధాన్యాల సాగు, ఎల్‌నినో ప్రభావం, సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర పంటల యాజమాన్యం, జీవన ఎరువులు, జీవ నియంత్రణ కారకాల వినియోగం, భూమి సంరక్షణ మరియు ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పించారు. శిక్షణలో భాగంగా చిరుధాన్యాల సాగు వల్ల తక్కువ నీటి వినియోగంతో పాటు వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యం పెరుగుతుందని వివరించారు. ఎల్‌నినో పరిస్థితుల కారణంగా వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు నీటి యాజమాన్యంపై ప్రత్యేక దృష్టి సారించి, స్థానిక పరిస్థితులకు అనుకూలమైన పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. సమగ్ర పోషక యాజమాన్యంలో భాగంగా భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించడం, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి జీవన ఎరువులను ప్రోత్సహించడం ద్వారా నేల సారాన్ని మెరుగుపరచవచ్చని తెలిపారు. రైజోబియం, అజోటోబాక్టర్, అజోస్పిరిల్లం, పీఎస్‌బీ, కెఎస్‌బీ వంటి జీవన ఎరువుల వినియోగంపై రైతులకు వివరించారు. అలాగే భూమి సంరక్షణ కార్యక్రమంలో భాగంగా నేల ఆరోగ్యాన్ని కాపాడేందుకు




సేంద్రియ పదార్థాల వినియోగం, మట్టి కోత నివారణ చర్యలు, వర్షపు నీటి సంరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఖేత్ బచావో అభియాన్ ద్వారా భూసార పరిరక్షణ, నీటి వనరుల సమర్థ వినియోగం, పర్యావరణహిత వ్యవసాయ పద్ధతుల అమలుకు రైతులను ప్రోత్సహించారు. పంటలలో చీడపీడలు, వ్యాధుల నియంత్రణకు ట్రైకోడెర్మా, ఫ్యూడోమోనాస్ ఫ్లోరెసెన్స్ వంటి జీవ నియంత్రణ కారకాల వినియోగం వల్ల రసాయన పురుగుమందుల అవసరం తగ్గి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందని పేర్కొన్నారు. సమగ్ర పంటల యాజమాన్యం ద్వారా నాణ్యమైన విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, నీటి యాజమాన్యం, కలుపు మరియు చీడపీడల సమగ్ర నియంత్రణ పద్ధతులపై రైతులకు శిక్షణ అందించారు. అదనంగా, ఏపిఏఐఎంఎస్ యాప్ వినియోగంపై రైతులకు



ప్రాయోగిక శిక్షణ ఇచ్చి, వ్యవసాయ సేవలు మరియు సమాచారాన్ని సులభంగా పొందే విధానాలను వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులు తమ సందేహాలను నిపుణులను అడిగి నివృత్తి చేసుకున్నారు. చివరగా శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించి సుస్థిర వ్యవసాయం వైపు అడుగులు వేయాలని అధికారులు రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవాయాధికారులు ఎన్. సుబ్బ రెడ్డి, సి.హెచ్. మదన్ మోహన్, పి. ఎ. ఎస్. సి.ఈ.ఓ లోకనాథ్ రెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం, నెల్లూరు సేద్య విభాగ శాస్త్రవేత్త డా. కె. కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రతే ముఖ్యం

**స్కూల్ బస్సు డ్రైవర్లకు అవగాహన కల్పించిన ట్రాఫిక్ సీఐ ప్రసాద్ రావు అవగాహన**

**పులివెందుల జూన్ 19సూర్య న్యూస్ :** పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా పులివెందుల పట్టణంలో ప్రైవేట్ పాఠశాలల బస్సు డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు, పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్ సూచనలతో స్థానిక ట్రాఫిక్ సీఐ ప్రసాద్ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ ప్రసాద్ రావు డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలపై పలు కీలక సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులను బస్సుల్లో ఎక్కించే సమయంలో అలాగే దించే సమయంలో డ్రైవర్లు అత్యంత జాగ్రత్తగా, అప్రమత్తంగా వ్యవహరించాలి. ప్రతి పాఠశాల బస్సులోనూ ఫస్ట్ ఎయిడ్ (ప్రథమ చికిత్స) కిట్, ఎమర్జెన్సీ డోర్ తప్పనిసరిగా అందుబాటులో ఉండాలి. వాహనానికి సంబంధించిన ఫిట్‌నెస్ సర్టిఫికేట్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ , డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ తదితర ఒరిజినల్ పత్రాలను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలి.



**మద్యం సేవించి నడిపితే కఠిన చర్యలు!..** మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతూ ఎవరైనా మద్యం తాగి స్కూల్ బస్సులు నడిపితే వారిపై చట్టపరంగా అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటాంఅని ట్రాఫిక్ సీఐ ప్రసాద్ రావు తీవ్రంగా హెచ్చరించారు. విద్యార్థుల క్షేమకరమైన ప్రయాణాన్ని కాపాడటంలో డ్రైవర్ల పాత్ర కీలకమని, నిబంధనలను ప్రతి ఒక్కరూ తు.చ. తప్పకుండా పాటించాలని ఆయన స్పష్టం చేశారు.

### పదో వార్డులో ఇంటింటి...

# ఓటరు వెరిఫికేషన్

**పామిడి జూన్ 19 సూర్య న్యూస్ :** పట్టణంలో పదో వార్డు నందు 244 బూతు నందు బిఎల్వో జోష్ణా ఆధ్వర్యంలో ఓటర్ వెరిఫికేషన్ శుక్రవారం జరిపారు అక్కడ ఉన్నటువంటి కాలనీవాసులతో మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ కొత్త ఓటర్ల నమోదు మార్పులు చేర్పుల కోసం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇంటింటి సర్వే జరుగుతుంది ఇప్పుడు మీకు అవకాశం కల్పించింది ఎన్నికల సంఘం ఎక్కడైనా ఓటర్ల తప్పొప్పులు ఉన్న సరిదిద్దుకునేందుకు అవకాశం కల్పించారు కొంతమంది లేనిపోని ఆరోపణ చేస్తున్న అవన్నీ పక్కనపెట్టి ఒకసారి బిఎల్ఓ ని వార్డు ఇన్చార్జిని సంప్రదిస్తే మీకు అన్ని క్లుప్తంగా తెలియజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ వెంకటరమణ,బిఎల్ఎ గాధ లింగప్ప,జనసేన పార్టీ నాయకులు కత్రిమల సుబ్బు,కాలనీవాసులు పాల్గొన్నారు.



# ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తం కావాలి


**పిఎండిఎస్ సాగుతో పశుసంపదకు రక్షణ రైతులకు డాక్టర్ నాగరాజు సూచనలు**

**డోన్ జూన్ 19 సూర్య న్యూస్:** ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.నాగరాజు రైతులు,పశుపోషకులు ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎల్‌నినో కారణంగా జూన్ నుంచి ఆగస్టు వరకు అధిక ఉష్ణోగ్రతలు, తక్కువ వర్షపాతం నమోదై వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశముందని ఆయన తెలిపారు. ఈ పరిస్థితులు పశుసంపదపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో పశుగ్రాసం సాగు విస్తీర్ణం తగ్గి పచ్చిమేత కొరత ఏర్పడుతుందని, అధిక వేడి కారణంగా పశువుల పాల ఉత్పత్తి,పునరుత్పత్తి సామర్థ్యం తగ్గే ప్రమాదం ఉందని వివరించారు. అలాగే పశుగ్రాసం ధరలు పెరగడం వల్ల సన్నకారు రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతుందని,త్రాగునీటి కొరతతో పాటు పశువులకు వడదెబ్బ తగిలే అవకాశాలు అధికంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ పరిస్థితులను అధిగమించేందుకు ప్రకృతి వ్యవసాయంలో భాగమైన ూవీణూ (ూతీవ-వీశీఅంశీశీఅ ఐతీఎ ూశీషఱఅగ్ర) విధానాన్ని రైతులు విస్తృతంగా అనుసరించాలని సూచించారు. ప్రధాన పంటకు ముందే 20 నుంచి 30 రకాల విత్తనాలను కలిపి సాగు చేయడం ద్వారా భూమి ఏడాది పొడవునా పచ్చదనంతో కప్పబడి ఉంటుందని తెలిపారు. ఈ విధానం భూమిలో తేమను నిల్వ చేయడంతో పాటు సూక్ష్మజీవుల వృద్ధికి దోహదపడి నేల సారాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయంలో విత్తన గుళికల (ప్యాలెటైజేషన్) తయారీకి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని డాక్టర్ నాగరాజు సూచించారు. బీజామృతంతో శుద్ధి చేసిన విత్తనాలపై మంచి మట్టి,బూడిద పొరలు వేసి గుళికలుగా తయారు చేయడం వల్ల అధిక ఉష్ణోగ్రతలు,వేడి గాలులు,తక్కువ వర్షపాతాన్ని తట్టుకునే శక్తి పెరుగుతుందని తెలిపారు. ఈ విధానం ద్వారా విత్తనాలు సుమారు ఆరు నెలల వరకు జీవంతో ఉండటమే కాకుండా చీడపీడలు, వ్యాధుల నుంచి రక్షణ పొందుతాయని వివరించారు.ూవీణూ సాగు ద్వారా నవధాన్యాలు,పచ్చిగడ్డి సమృద్ధిగా లభించి పశువులకు పోషకాహారం అందుతుందని చెప్పారు. నేలలో వానపాముల వృద్ధి, నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు నేల కోత తగ్గి రైతులకు అదనపు ఆదాయం లభించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా మామిడి తోటలు,ఖాళీ భూముల్లో ఈ పద్ధతిని సాగు చేయడం వల్ల ఉత్తమ ఫలితాలు వస్తాయని తెలియజేశారు.



## ఘనంగా అంతోని మడ్ ఫోర్ట్ సహాయ గురువు అఖిల్ జన్మదిన వేడుకలు

**పెడన జూన్ 19 సూర్య న్యూస్:** నియోజకవర్గ పరిధిలోని గూడూరు మండలం గంగ్రం గ్రామానికి చెందిన నిమ్మగడ్డ ఫాదర్ అఖిల్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాదులోని ఆంథోనీ మడ్ ఫోర్ట్ సహాయ గురువుగా ప్రభు సేవలందిస్తున్న ఫాదర్ అఖిల్ గా నియమితమై ఏడాది పూర్తవడంతో రెండు పండుగలు ఒకేరోజు గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఆయా చర్చిల మత గురువులు, మత పెద్దలు, సంఘాల నాయకులు, తోటి సంఘస్తులు, స్నేహితులు, బంధుమిత్రులతో స్వగ్రామైన గంగ్రంలో పండుగ వాతావరణం చోటుచేసుకుంది. ఉదయం నుంచి గ్రామంలో ఉన్న చర్చిలో ప్రార్థనలు జరిపి అనంతరం అఖిల్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అంతేకాకుండా ఈనెల 20వ తేదీ నుంచి తూర్పుగోదావరి జిల్లా పాలకొల్లులో ఉన్న పల్లోటి సంస్థ ఆర్సిఎం చర్చిల సహాయ గురువుగా పదోన్నతులు పొందనున్నారు. ఫాదర్ గా నియమితమైన ఏడాదికే ఆయన చేసిన సేవలను మత గురువులు గుర్తించి పదోన్నతులు కల్పించడంతో అందరూ ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. మరిన్ని పదవులు అలంకరించాలని సంఘస్తులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఫాదర్ అఖిల్ మాట్లాడుతూ. ఈ జీవితం దేవుని సేవకే అంకితమని, సమాజంలో శాంతి, సామరస్యం, సోదర భావం ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని ఆయన ఉద్బోధించారు. అనంతరం కేకును కట్ చేసి మిఠాయిలను పంచారు.



### అట్టహాసంగా నమ్మకం.. అభివృద్ధి.. సంక్షేమం...

# విజయోత్సవ సంబరాలు

**రాష్ట్ర ప్రభుత్వ రెండేళ్ల పాలన విజయాలను ప్రతిబింబించిన ప్రత్యేక ప్రదర్శనలు**

**లబ్ధిదారులతో మమేకమైన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి - అభివృద్ధి పథకాలపై ప్రశంసలు**

**ఆత్మకూరు (రూరల్) జూన్ 19సూర్య న్యూస్:** పట్టణంలోని శ్రీధర్ గార్డెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన “నమ్మకం.. అభివృద్ధి.. సంక్షేమం” విజయోత్సవ వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నియోజకవర్గ ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వివిధ శాఖల స్టాల్స్‌ను సందర్శించి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. ఆత్మకూరు నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధి, పునరుద్ధరణ కార్యక్రమాలు, చేపట్టిన మౌలిక సదుపాయాల వివరాలను ప్రదర్శించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే డీఆర్ డీఏ, వ్యవసాయ శాఖ, విద్యాశాఖ, మహిళా సాధికారతకు సంబంధించిన దీపం-2, స్త్రీ శక్తి, ఆటో డ్రైవర్ల సంక్షేమ పథకాలు తదితర పథకాలపై ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ప్రతి స్టాల్ వద్దకు వెళ్లిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి లబ్ధిదారులతో నేరుగా ముచ్చటించి వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా తమ కుటుంబాలకు ఎంతో మేలు జరిగిందని, జీవనోపాధి మెరుగుపడిందని లబ్ధిదారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో ఆత్మకూరు నియోజకవర్గంలో చేపట్టిన రహదారుల నిర్మాణం, విద్యా రంగ అభివృద్ధి, వ్యవసాయ ప్రోత్సాహక కార్యక్రమాలు, మహిళా సాధికారత, స్వయం ఉపాధి పథకాలు, సామాజిక భద్రతా కార్యక్రమాల గురించి వివరించారు. ప్రభుత్వ లక్ష్యం ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమేనని పేర్కొన్నారు. వేడుకల ప్రాంగణం మొత్తం పండుగ వాతావరణాన్ని తలపించింది. ప్రజలు, కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద ఎత్తున హాజరై విజయోత్సవ సంబరాల్లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ ఫలితాలను ప్రజలకు చేరవేసే వేదికగా ఈ కార్యక్రమం నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.







### వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు సీడ్ పెలటైజేషన్‌పై

# రైతులకు అవగాహన

**గోరంట్ల జూన్ 19 సూర్య న్యూస్ :** మలసముద్రం రైతు సేవా కేంద్రం పరిధిలోనిబూదిలివాండ్లపల్లి గ్రామంలో ఏపీసీఎన్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం సీడ్ పెలటైజేషన్ విత్తన గుళికల తయారీ పై అవగాహన ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సీడ్ పెలటైజేషన్ పద్ధతిని అనుసరించాలని అధికారులు సూచించారు. ఈ విధానంలో విత్తనాలను ద్రవ జీవామృతం ఘన జీవామృతం బంకమన్ను, బూడిదతో శుద్ధి చేసి గుళికలుగా తయారు చేస్తారని వివరించారు. ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ విధానంలో సుమారు 30 రకాల విత్తనాలను సాగు చేయడం ద్వారా భూమిలో తేమశాతం నిల్వ ఉండటంతో పాటు తక్కువ వర్షపాతం పరిస్థితుల్లోనూ పంటలు మెరుగ్గా పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే బీడు భూముల్లో విత్తన గుళికలను చల్లడం ద్వారా భూమి పచ్చదనంతో కప్పబడి నేల సారాన్ని కాపాడడంతో పాటు రైతులకు అదనపు ఆదాయం సమకూరే అవకాశ ముందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి పొలంలో రైతులకు సీడ్ పెలటైజేషన్ విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించి వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వర్షాభావ పరిస్థితుల్లోనూ పంటలను విజయవంతంగా సాగు చేయాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ సమత, మండల వ్యవసాయ అధికారి శంకర్ నాయక్, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# కప్పట్రాళ్లలో సార్ పై విస్తృత అవగాహన

**ప్రతి అర్హ పౌరుడు ఓటరుగా ఉండాలి- తెదేపా కప్పట్రాళ్ల మల్లికార్జున**

**దేవనకొండ జూన్ 19 సూర్య న్యూస్:** మండల పరిధిలోని కప్పట్రాళ్ల గ్రామంలో శుక్రవారంనాడు తహసీల్దార్ రామేశ్వర్ రెడ్డి,తెదేపా నాయకులు కప్పట్రాళ్ల మల్లికార్జున ఆధ్వర్యంలో సార్ ( స్పెషల్ ఎంటెన్సీ రివిజన్) కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమమైన ూ×= యొక్క ముఖ్య ఉద్దేశ్యం ఓటరు జాబితాలను పూర్తిగా ఖచ్చితంగా పారదర్శకంగా మరియు తప్పులు లేకుండా రూపొందించడమేనని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని,18 సంవత్సరాలు నిండిన యువత కొత్త ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే మరణించిన వ్యక్తుల పేర్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారి పేర్లు మరియు డూప్లికేట్ నమోదులను గుర్తించి తొలగించడం ద్వారా ఓటరు జాబితాను పరిశుభ్రంగా ఉంచేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని వివరించారు ఓటర్ల పేర్లు, చిరునామాలు, వయస్సు తదితర వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే వాటిని సరిచేసుకునేందుకు ఈ కార్యక్రమం మంచి అవకాశమని పేర్కొన్నారు. గ్రామస్థులు తమ వివరాలను బిఎల్ఓ లకు అందించి సవరణ ప్రక్రియలో సహకరించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను ధృవీకరించే ప్రక్రియలో బి ఎల్ ఓ లు కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హరి, సీనియర్ అసిస్టెంట్ రవి, బి ఎల్ వోలు, బి ఎల్ ఏ లు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, అవసరమైన ధ్రువపత్రాలు, కొత్త ఓటర్ల నమోదు విధానం తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరుగా నమోదు కావడం అత్యంత అవసరమని వారు తెలిపారు.



# పార్టీ కోసం పనిచేసే వారిపై విమర్శలు...

**వీర గో బ్యాక్ అనే అర్హత మీకు లేదు**

**పామిడి జూన్ 19 సూర్య న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పాదయాత్ర చేసినప్పటి నుండి పార్టీ కోసం కష్టపడిన వ్యక్తిని గో బ్యాక్ అనే అర్హత మీకు లేదని శుక్రవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ రాజశేఖర్ పీటర్ విజయ్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు అనంతరం వారు మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థాపించక ముందే జగన్ రెడ్డి బొమ్మ జెండాలు ముద్రించి పార్టీ కోసం పని చేసిన వ్యక్తులు మేము మాజీ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి గెలుపు కోసం మాజీ ఏ డి సి సి పామిడి వీర కష్టపడడం మేము కళ్లారా చూసాము ఎందుకంటే ఫస్ట్ సారి పోటీ చేసి ఓటమిపాలైన వెంకటరామిరెడ్డి గెలుపు కోసం వీర మరియు అనుచరులు అక్రమ కేసులు పెట్టించుకుని గెలుపు కోసం పని చేస్తే ఇప్పుడు గెలిచిన తర్వాత మధ్యలో పార్టీలోకి వచ్చినవారు మాటలు నమ్మి మీరు వీరా ఓ బ్యాక్ కని అనడం చాలా బాధాకరమైన విషయం ఎందుకంటే నిన్న సమావేశంలో వీరాని విమర్శించిన వారు గతంలో వీరా దగ్గర ఉన్న వ్యక్తులే ఇప్పుడు మరలా విమర్శిస్తున్నారు అంటే ఒక్కసారి మీ విజ్ఞతకే వదిలేస్తున్నాం మరొక ఆయన గత కొన్ని రోజుల కిందట మీరు ఆదరించే రెడ్డి కులానికి సంబంధించిన వారిని స్వయానా వీరా దగ్గరికి వచ్చి లేనిపోని మాటలు చెప్పిన సంగతి అతను మర్చిపోయారేమో మరల అతనే మాట్లాడడం చాలా సిగ్గుచేటు ముగ్గురు తో కాదు ఎన్ని కార్యక్రమాలు చెప్పినా గో బ్యాక్ అని చెబుదామంటున్నారు మీకే కాదు మేము కూడా గో బ్యాక్ అని చెప్పగలం మేము వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణలో ఉన్నాము ఎవరిని విమర్శించం మరలా ఒక నాయకుడు మాజీ ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి లెటర్ ఇస్తేనే ఏడీసీసీ చైర్మన్ పదవి ఇచ్చారని కల్లబొల్లి మాటలు చెబుతున్నారు పదవి రావడానికి మిథున్ రెడ్డి జగన్మోహన్ రెడ్డి దయాదాక్షాల వస్తుందని తెలుసుకున్నప్పుడు మరలా మధ్యలో లెటర్ ప్యాడ్ ఇచ్చారు మేము ఇప్పటికైనా వై వెంకట్రాంరెడ్డిని ఎక్కడ విమర్శించము ఎందుకంటే వెంకటరామిరెడ్డి గతంలో గెలుపు కోసం పనిచేసే మీ విమర్శించం ఈ మధ్యకాలంలో నైరుతి రెడ్డి నియోజకవర్గంలో లేనిపోని గొడవలు సృష్టిస్తున్నారు గుంతకల్ నియోజకవర్గానికి నైరుతి రెడ్డికి సంబంధం ఏమిటి ? ఇన్చార్జి వెంకటరామరెడ్డి అడుగుజాడల్లో నడుచుకుంటాము గానీ మీరు జిల్లా ఉపాధ్యక్షురాలు మీరు ఎక్కడైనా కార్యక్రమాలు చేసుకోండి కానీ మీరు గుంతకల్లు నియోజకవర్గం ఇంఛార్జ్ కాదు మేము మాత్రం మా గుంతకల్లు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వెంకట్రామిరెడ్డి తో కలిసిమెలిసి పనిచేస్తాం గత కొద్ది రోజుల కిందట కూడా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మీరందరూ కలిసి పని చేయాలని చెప్పడంతో మేము మా నాయకుడు మాట ఎక్కడ తప్పకుండా పనిచేస్తామని మాట ఇచ్చాం కనుక పామిడి మండల మాజీ మండల అధ్యక్షుడు పాలెం నారాయణరెడ్డి కూడా కలిసిమెలిసి పనిచేస్తామని చెప్పాము అక్కడికి వచ్చిన తర్వాత కొంతమంది వైసీపీ నాయకులు గో బ్యాక్ వీర గో బ్యాక్ వీర అంటూ ఉంటే మీరు సరిదిద్దాల్సిన నాయకులే చోద్యం చూస్తుంటే ఎలా ఉంటుందని ఏది ఏమైనా నియోజకవర్గంలో ఈ మధ్యకాలంలో పార్టీ కోసం పని చేసే వారిని పక్కనపెట్టి మాయమాటలు చెప్పే వారికి ప్రాధాన్యత ఇచ్చారు గతంలో కూడా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పామిడి మండలంలో పనిచేసే నాయకులు చాలామంది ఉన్న మీ బంధువు అని మండలించార్జి రూపేష్ రెడ్డిని మరియు జానకిరామ్ రెడ్డిని నియమించినప్పుడు పార్టీ భ్రష్టు పట్టి ఓడిపోయాము మరలా ఇప్పుడు కూడా పార్టీలో కష్టపడే వారిని పక్కనపెట్టి అధికారంలోకి వచ్చిన నాయకులని మీరు పెద్ద మనుషులుగా చాలా మంది చేస్తున్నారు ఆ పెద్ద మనుషులే మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ గుప్తా కి టికెట్ ఇస్తే నీ దగ్గర ఉన్న వారు చాలామంది నీ దగ్గర లేకుండా వెళ్ళిపోతారు మేము మా వీరా మనుషులు కట్ట కాలేయంత వరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మరియు జగన్మోహన్ రెడ్డి తోనే కలిసి ఉంటాం ఇప్పటికైనా పార్టీ కోసం పని చేసే వారిని కలుపుకొని పోయి పార్టీకి నష్టం కలిగించే వారిని గుర్తించి దూరంగా ఉండాలి ఎందుకంటే గతంలో పార్టీ కోసం పని చేసిన వారు చాలామంది ఉన్నారు కాంసెన్సీలు పెరిగినప్పుడు టికెట్ ఆశించేవారు గంటా నరహరి చిన్నబాబు వీర వెంకటరామిరెడ్డి నైరుతికి టికెట్ ఇచ్చిన అందరూ కలిసి పని చేస్తే విజయం సాధిస్తాం ఒకరిపై ఒకరు విమర్శలు మాని ఇప్పటికైనా కలిసికట్టుగా పనిచేయాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో చలపతి, వీరాంజనేయులు, వెంకటేష్, లింగ, రసూల్, ధనుంజయ, ఎర్రి స్వామి, నల్లప్ప,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సూర్య

శనివారం 20 జూన్, 2026

### ప్రజాస్వామ్య భారత్ జోడో స్ఫూర్తితో ముందుకు సాగుతున్న

# రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**కర్నూలు జూన్ 19సూర్య న్యూస్:** భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ ని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అడ్వకేట్ క్రాంతి నాయుడు బోయ అభిప్రాయపడ్డారు. శుక్రవారం





రాహుల్ గాంధీ బర్త్ డే సందర్భంగా కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన క్రాంతి నాయుడు మాట్లాడుతూ ఏఐసీసీ మాజీ అధ్యక్షులు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో వివిధ సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. భారత్ జోడో యాత్ర ద్వారా దేశాన్ని ఏకం చేసిన రాహుల్ గాంధీ ఈ దేశ యువతకు స్ఫూర్తి. ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు అలుపెరగని పోరాటం చేస్తోంది. రైతులు, కార్మికులు, మహిళలు, నిరుద్యోగుల హక్కుల కోసం ఆయన చేస్తున్న పోరాటం చరిత్రలో నిలిచిపోతుంది. అని రాహుల్ గాంధీ ఆశయాల స్ఫూర్తితో కర్నూలు జిల్లాలో ప్రతి గడపకూ కాంగ్రెస్ సిద్ధాంతాన్ని తీసుకెళ్తాం. 2029 ఎన్నికల్లో రాహుల్ గాంధీ ని ప్రధానిగా చూడటమే మా లక్ష్యం అని క్రాంతి నాయుడు అభిప్రాయపడ్డారు. ముందుగా పార్టీ నాయకులు కార్యకర్తలు సమక్షంలో కేక్ కట్ చేసి రాహుల్ గాంధీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి సుమారు 50 మంది యువకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. రాహుల్ గాంధీ జన్మదిన పురస్కరించుకొని పార్టీ కార్యాలయ ఆవరణలో చెట్లు నాటారు. అనంతరం రాష్ట్ర ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున యాదవ్, రాష్ట్ర నాయకులు యం పాట్రిక్ డేవిడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై క్రాంతి నాయుడు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని భాష, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ యన్ సి బజారన్న, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డివి సాంబశివుడు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఏ సూర్య ప్రకాష్ రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు సజ్జాద్ హుస్సేన్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మీసాల సుమలత, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు పగిడాల అమన్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పాట్రిక్ డేవిడ్, ఓబీసీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కె భాగ్య లక్ష్మి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు చిన్న స్వామి డిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి రియాజుద్దీన్, ఎస్సీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షులు ఈ లాజరస్, కాంగ్రెస్ నాయకులు జి వెంకటస్వామి, కల్లూరు ప్రభాకర్, వశీ భాష, ఐ ఎన్ టి యు సి సిటీ అధ్యక్షులు ఆర్ ప్రతాప్ దూద్ పీరా మొదలగువారు అధిక సంఖ్యలో కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

### మందపల్లిలో దేవదాయ శాఖ కమిషనర్

# క్షేత్రస్థాయి పర్యటన

**కోనసీమ/కొత్తపేట జూన్ 19 సూర్య న్యూస్:** మండలం లోని మందపల్లి గ్రామంలో వేంచేసియున్న ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానాన్ని





ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ కమీషనరు కె. రామచంద్ర మోహన్ శుక్రవారం ఉదయం దర్శించారు. ఆయనకు ఆలయ సహాయక కమిషనర్ దారపురెడ్డి సురేష్ బాబు అర్చక స్వామి స్వాగతం పలికారు. రాబోయే గోదావరి పుష్కరములు 2027 ను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం దేవస్థానంలో నిర్మిస్తున్న పలు అభివృద్ధి పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనులపై సంతృప్తి శుక్రవారం ఉదయం 8:30 గంటలకు ఆలయానికి చేరుకున్న కమిషనర్, తొలుత భక్తుల సౌకర్యార్థం రూపుదిద్దుకుంటున్న తైలాభిషేక మండపం మరియు అన్నప్రసాద భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతి పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూ, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని దేవదాయ శాఖ ఇంజినీరింగ్ అధికారులకు తగు సూచనలు చేశారు. స్వామివారి దర్శనం -- మార్పులపై హర్షం అనంతరం కమిషనర్ శ్రీ రామచంద్ర మోహన్ శ్రీ స్వామి వారిని, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల కాలంలో దేవస్థానంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను, గతంలో కంటే ప్రస్తుతం ఆలయ రూపురేఖల్లో వచ్చిన సానుకూల మార్పులను చూసి ఆయన హర్షం వ్యక్తం చేశారు. పాల్గొన్న అధికారులు, ప్రముఖులుఈ పర్యటనలో కమిషనర్ వెంట దేవదాయ ధర్మదాయ శాఖ ఉన్నతాధికారులు:రమేశ్ బాబు డిప్యూటీ కమీషనరు,సత్యనారాయణ జిల్లా దేవదాయ శాఖ అధికారి, సుబ్బారావు టెక్నికల్ అడ్వైజర్, దుర్గేశ్ కుమార్ ఎస్.ఇ.ఉదయ్ కుమార్ డి.ఇ.ఉన్నారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు దంగేటి సాయి నాగ భూషణం, నేరేడుమిల్లి మహాలక్ష్మి ఏడుకొండలు, చిలకమర్తి అనంత లక్ష్మి సావిత్రి శ్రీనివాస్ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ట్రాఫిక్ నిబంధనలు పాటించి

# సురక్షిత ప్రయాణం చేయండి

**హెల్మెట్ తప్పనిసరి.. మద్యం సేవించి వాహనం నడపవద్దు: ఎస్సై టి. రఘునాథరావు**

**జగ్గంపేట జూన్ 19 సూర్య న్యూస్ :** వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని జగ్గంపేట ఎస్సై టి. రఘునాథరావు



సూచించారు. శుక్రవారం జగ్గంపేట సెంటర్‌లో పోలీసు సిబ్బందితో కలిసి ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ, ఇన్సూరెన్స్ తదితర పత్రాలను పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించిన పలువురికి జరిమానాలు విధించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అది ప్రమాదాల సమయంలో ప్రాణాలను కాపాడగల ముఖ్యమైన భద్రతా సాధనమని ఎస్సై వివరించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల తీవ్రమైన ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరిస్తూ, అలాంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. రోడ్డు భద్రత అందరి బాధ్యత అని, ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఎస్సై టి. రఘునాథరావు పేర్కొన్నారు.

# మోదీ వికాస్ ప్రదర్శనకు శ్రీకారం

**డోన్ లో సంక్షేమ పథకాల ఎగ్జిబిషన్ స్టాల్‌ను ప్రారంభించిన డీఎస్పీ శ్రీనివాసులు**

**డోన్ జూన్ 19 సూర్య న్యూస్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే లక్ష్యంతో డోన్ పట్టణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన "మోదీ వికాస్ ప్రదర్శన" ఎగ్జిబిషన్ స్టాల్‌ను డోన్ డీఎస్పీ శ్రీనివాసులు ప్రారంభించారు. నరేంద్ర మోదీ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవ,సుపరిపాలన కార్యక్రమాల్లో భాగంగా నంద్యాల జిల్లా బీజేపీ యువ మోర్చ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనను నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా యువ మోర్చ అధ్యక్షుడు సిలవరి వెంకటేష్ అధ్యక్షత వహించగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సందు వెంకటరమణ,జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్,జిల్లా యువ మోర్చ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిలవరి వెంకటేష్ మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం రైతులు, మహిళలు, యువత, పేదల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని అనేక పథకాలను



విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి,జల్ జీవన్ మిషన్,ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలు దేశ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచాయని పేర్కొన్నారు. డోన్ అసెంబ్లీ బీజేపీ యువ నాయకుడు నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ నంద్యాల జిల్లా చైర్మన్ కొట్టె మల్లికార్జున మాట్లాడుతూ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్,నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు సూచనల మేరకు ఈ ప్రదర్శనను నిర్వహించామని తెలిపారు. మోదీ సారథ్యంలో "వికసిత్ భారత్ వికసిత్ ఆంధ్రప్రదేశ్" లక్ష్య సాధనకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించే ఉద్దేశంతో ఎగ్జిబిషన్ స్టాల్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రదర్శనలో కేంద్ర ప్రభుత్వ పథకాల వివరాలు,లబ్ధిదారుల విజయ గాథలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువ మోర్చ ప్రధాన కార్యదర్శులు విజయ భాస్కర్,బుగ్గన కావ్య, ఉపాధ్యక్షులు భవాని, సందు అరుణ్ కుమార్,కార్యదర్శి వసంత్ కుమార్, ట్రెజరర్ కమలేష్, ప్యాపిలి మండల యువ మోర్చ అధ్యక్షుడు కేశవ్‌తో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా

# పకడ్బందీగా ఏర్పాట్లను చేయాలి

**-జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**

**కర్నూలు జూన్19సూర్య న్యూస్ :** ఈ నెల 24 వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా పకడ్బందీగా ఏర్పాట్లను చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. ఈ నెల 24 వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు పత్తికొండ నియోజకవర్గం జొన్నగిరిలో జియో మైసూర్ గోల్డ్ మైన్స్ ప్లాంట్ ను సందర్శించనున్న సందర్భంగా హెలిప్యాడ్, మైనింగ్ ఏరియా వ్యూ పాయింట్, ప్రాసెసింగ్ ప్లాంట్, బహిరంగ సభ ఏర్పాట్లను పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబు, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ లతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు.. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అదే విధంగా సభకు హాజరయ్యే ప్రజల కోసం రవాణా, తాగునీరు, ఆహారం, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలను సమకూర్చే చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామ సమీపంలో ఉన్న ఈస్టర్న్ ధార్వార్ క్రాటన్ బంగారు ఖనిజ నిల్వలను ఆధారంగా చేసుకుని జియో మైసూర్ మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్, కంపెనీ వారు ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర ఖనిజ రంగ అభివృద్ధికి, ఉపాధి అవకాశాల పెంపుకు, దేశీయ బంగారం ఉత్పత్తి వృద్ధికి దోహదపడనుందన్నారు. ప్రస్తుతం ఈ గనిలో రోజుకు సుమారు 1,000 టన్నుల ఖనిజాన్ని ప్రాసెస్ చేసే సామర్థ్యం ఉందన్నారు. ప్రతి టన్ను ఖనిజం నుంచి సగటున 1 నుండి 1.5 గ్రాముల వరకు బంగారం వెలికితీయబడుతోందన్నారు. ప్రస్తుతం ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం సుమారు 30 కిలోగ్రాముల బంగారంగా ఉండగా, దీనిని మరింత పెంచేందుకు విస్తరణ పనులు చేపడుతున్నారన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే ఏర్పాటు చేసిన తొలి ప్లాంట్‌ను విస్తరించడంతో పాటు, రెండో ప్రాసెసింగ్ ప్లాంట్ నిర్మాణం కూడా చేపడుతున్నారన్నారు. దీంతో బంగారం ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరగనుందన్నారు. దేశంలో ప్రైవేట్ రంగంలో అభివృద్ధి చెందుతున్న తొలి బంగారు గనుల ప్రాజెక్టులలో జొన్నగిరి గోల్డ్ మైన్ ఒకటిగా గుర్తింపు పొందుతోందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా దేశీయంగా బంగారం ఉత్పత్తి పెరగడంతో పాటు, బంగారం దిగుమతులపై ఆధారపడే పరిస్థితిని కొంత మేర తగ్గించే అవకాశం ఉందన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబు మాట్లాడుతూ కర్నూలు జిల్లా, తుగ్గలి మండలం, జొన్నగిరి గ్రామంలో ఏర్పాటు చేసిన గోల్డ్ మైన్ (బంగారు గని) ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 24వ తేదీన విచ్చేయనున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి గారు గోల్డ్ మైన్ ప్రాజెక్టును పరిశీలించి, రాష్ట్ర అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు ప్రాధాన్యత, బంగారం ఉత్పత్తి సామర్థ్యం, స్థానిక ప్రాంత అభివృద్ధిపై దీని ప్రభావం వంటి అంశాలపై ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారన్నారు. గతంలో వివిధ కారణాలతో ఆలస్యమైన ఈ ప్రాజెక్టుకు ప్రస్తుత ప్రభుత్వం వేగవంతమైన అనుమతులు (ఫాస్ట్ ట్రాక్ క్లియరెన్సులు) మంజూరు చేసి కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకుందన్నారు. దీంతో జొన్నగిరి గోల్డ్ మైన్ ప్రారంభానికి మార్గం సుగమమైందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఇప్పటికే వందలాది మందికి ఉపాధి అవకాశాలు లభించగా, భవిష్యత్తులో ఓపెన్ మైనింగ్ కార్యకలాపాలు విస్తరించడంతో మరింత భారీ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించబడనున్నాయన్నారు. రాబోయే రోజుల్లో స్థానిక యువతకు దాదాపు 1000 వరకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. జొన్నగిరి గోల్డ్ మైన్ ప్రాజెక్టు కేవలం తుగ్గలి మండలానికే కాకుండా పత్తికొండ నియోజకవర్గం, కర్నూలు జిల్లా మరియు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కూడా కీలక మైలురాయిగా నిలవనుందన్నారు.

### దేశ ఆర్థిక రక్షణలో మహిళలు

# భాగస్వాములు కావాలి

**బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుష్మ**

**వేంపల్లె జూన్ 19 సూర్య న్యూస్:** భారతీయ జనతా మహిళా మోర్చా ఆధ్వర్యంలో దేశ ఆర్థిక రక్షణలో మహిళలను భాగస్వామ్యులను చేయడమే లక్ష్యంగా ప్రతి ఇంట వంట గ్యాస్



మరియు వంట నూనెను పొదుపు చేసే అవగాహన కార్యక్రమం నిర్వహించా రు. ఈ సందర్భంగా బిజెపి మహిళా నేత సుష్మ మాట్లాడుతూ మన దేశం వంట గ్యాస్ మరియు వంటనూనెలను ఎక్కువగా వేరే దేశాల నుండి దిగుమతి చేసుకోవడం జరుగుతోందని, ఇప్పుడు జరుగుతున్న యుద్ధ పరిస్థితుల దృష్ట్యా ఎవరో చేసే తప్పిదాల వలన మన దేశం ఇబ్బంది పడవలసి వస్తోందని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని మనం గ్యాస్ మరియు వంట నూనెలను పొదుపుగా మరియు జాగ్రత్తగా వాడవలసిన అవశ్యకత ఏర్పడిందని అన్నారు. ఈ కార్యక్రమం గురించి ప్రజల్లో అవగాహన పెంచేందుకు మహిళలతో తక్కువ గ్యాస్ మరియు తక్కువ నూనె వాడి తయారు చేసిన వంటల పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు తమ ప్రావీణ్యాన్ని ఉపయోగించి వివిధ రకాల వంటలను ప్రదర్శించారు. అందులో తక్కువ గ్యాస్ ఉపయో గించి చేసిన మహిళలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా నేతలు కవిత, సౌభాగ్య, సుమతి గార్లు మాట్లాడుతూ మహిళలు తక్కువ లేదా అసలు నూనె లేకుండా వంటలు తయారు చేసి తమ కుటుంబాలని ఆరోగ్యవంతంగా తయారు చేసి దేశ ఆర్థిక ప్రగతిలో భాగం కావాలని తెలిపారు. అలాగే మహిళలు ఇంటి నుండి బయటికి వచ్చి సమాజంలో వ్యాపారవేత్తలుగా, రాజకీయ నేతలుగా, సమాజ సేవకులుగా మారి మన దేశ ప్రగతిలో భాగం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నూలు బీజేపీ మహిళా నేత కవిత, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సుమతి, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు సౌభాగ్య , సుమన్, సునీల్, ఈశ్వర్ రెడ్డి , ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**కుప్పం(రూరల్ ) జూన్ 19 సూర్య న్యూస్ :** మండల పరిధిలోని దళవాయి కొత్తపల్లి లో సంపంగి రామ అనే వ్యక్తి శుక్రవారం ఉదయం చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం ప్రకారం.. బెంగళూరుకు చెందిన సంపంగి రామ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో కొంతకాలంగా వారానికి ఒకసారి బంధువుల ఇంటికి కుప్పంకు వచ్చి వెళ్లేవాడు. శుక్రవారం ఉదయం వ్యక్తి ఉరివేసుకొని చనిపోవడం స్థానికంగా కలకలం రేపింది. కుప్పం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### ఆంకాలజీ చికిత్స రోగి ప్రాణాలను కాపాడిన

# మలక్‌పేట్ యశోదా హాస్పిటల్ వైద్యబృందం

**ఆక్యూట్ మైలోయిడ్ లుకీమియా అనేది రక్త క్యాన్సర్‌లోఒక రకం ...కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రోహిత్ రెడ్డి**

**మిర్యాలగూడ జూన్ 19సూర్య న్యూస్:** పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యశోద హాస్పిటల్స్ మలక్పేట్ నిపుణులు కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రోహిత్ రెడ్డి మాట్లాడుతూ ఆక్యూట్ మైలోయిడ్ లుకీమియా అనేది రక్త క్యాన్సర్‌లో ఒక రకం,చాలా వేగంగా కొన్ని రోజులు లేదా వారాల్లోనే ప్రాణాపాయకర స్థితికి చేరుతుంది. చికిత్స ఆలస్యం అయితే, ఈ అసాధారణ కణాలు రక్తం ద్వారా ఇతర అవయవాలకు వ్యాపించి,తీవ్రమైన ఇన్ఫెక్షన్లు, నియంత్రించలేని రక్తస్రావం, అవయవ వైఫల్యం కలిగించవచ్చు అన్నారు. ఎ ఎమ్ ఎల్ తో బాధపడుతున్న మిర్యాలగూడకు చెందిన 34 సంవత్సరాల యువకుడికి విజయవంతంగా చికిత్స చేసి రోగి ప్రాణాలను కాపాడారని తెలిపారు. ఆసుపత్రికి చేరేసరికి ఆయన పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉందని, వైద్యులు వెంటనే ఇది సాధారణ వ్యాధి కాదని, ఆక్యూట్ మైలోయిడ్ లుకీమియా అనే వేగంగా పెరుగుతున్న రక్త క్యాన్సర్ అని గుర్తించారు. అత్యవసర పరిస్థితిలో,యశోదా హాస్పిటల్, మలక్‌పేట్‌లోని నిపుణులైన ఆంకాలజీ బృందం సకాలంలో




రోగిని ద్రవాలు, యాంటీబయోటిక్స్, రక్త మార్పిడి ద్వారా స్థిరపరిచిన తర్వాత, క్యాన్సర్ కణాలను నాశనం చేయడానికి ఇండక్షన్ కీమోథెరపీ ప్రారంభించారని తెలిపారు. వైద్యుల నిరంతర పర్యవేక్షణ,24/7 కేర్ వల్ల ఇన్ఫెక్షన్లు నియంత్రించబడ్డాయని పేర్కొన్నారు. అత్యంత ప్రమాదకరమైన లుకీమియా కేసు,ఫెబ్రైల్ న్యూట్రోపీనియా, ఎమ్ ఆర్ డి పాజిటివిటీ వంటి క్లిష్టతలున్నప్పటికీ, సకాలంలో చేసిన ఇండక్షన్ కీమోథెరపీ వల్ల కన్సాలిడేషన్ ద్వారా రిమిషన్ సాధించగలిగామని అన్నారు. నిరంతర పర్యవేక్షణ,సపోర్టివ్ కేర్ కీలకం అయ్యాయి. అత్యాధునిక ఆంకాలజీ మౌలిక సదుపాయాలు, ఆధునిక నిర్ధారణ సాంకేతికతతో ఎ ఎమ్ ఎల్ వంటి అత్యంత క్లిష్టమైన, ప్రాణాపాయకరమైన రక్త క్యాన్సర్ కేసులను సమర్థవంతంగా నిర్వహించేందుకు సకాలంలో కీమోథెరపీ ప్రోటోకాల్స్, ఇన్ఫెక్షన్ కంట్రోల్, రక్త మార్పిడి సదుపాయాలు,నిరంతర పర్యవేక్షణ కీలకమని యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మలక్‌పేట్, హైదరాబాద్ డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె శ్రీనివాసరెడ్డి,అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర తెలిపారు. వాసు కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

EDITED PUBLISHED AND WONEDBY N.MAHESWARA REDDY PUBLISHED AT D.NO 1/171/2 DEVANAKONDA (M&POST) 518465, KURNOOL DIST, AP, PRINTED AT SRI LAKSHMI OFFSET PRINTERS AND PUBLICATIONS D.NO 1/171/2 DEVANAKONDA (M&POST)518465 KURNOOL DIST. CONTRACT CELL NO. 9010008143,RNI APTEL 2022/82194 Gmail :suryavelugutelugu daily@gmail.com